# ఈనాడు మంచిర్యాల

బుధవారం 3 జనవరి 2018 | 16 పేజీలు




పెంబి అటవీప్రాంతంలో నేలకొరిగిన పెద్ద టేకు వృక్షాలు

# రూ. కోట్ల సంపద అడవిపాలు..

- పడిపోయిన వృక్షాలను డిపోలకు తరలించడంలో నిర్లక్ష్యం
- రవాణా ఖర్చులు భారంగా మారాయంటున్న అటవీశాఖ అధికారులు
- స్మగ్లర్ల నుంచి పట్టుబడిన కలప డిపోల్లో వేలం

ఈనాడు-ఆదిలాబాద్

ఈనాడు పరిశీలన




**దట్టమైన అటవీ ప్రాంతాల్లో స్మగ్లర్లు నరికిపడేసిన.. సహజ సిద్ధంగా.. ప్రకృతి వైపరీత్యాల వల్ల కిందపడిపోయిన టేకు, నల్లమద్ది, ఏగిస చెట్లను కలప డిపోలకు తరలించడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో విలువైన కలప అడవుల్లోనే చెదలు పట్టి .. వర్షాలకు కుళ్లి పాడైపోయి భూమి పాలవుతోంది. కొందరు స్మగ్లర్లు దీనినే అనుకూలంగా మలచుకుంటున్నారు. గడిచిన మూడునాలుగేళ్లుగా అడవుల నుంచి డిపోలకు వచ్చే కలప తగ్గిపోయింది. ఖానాపూర్, పెంబి, కడెం, జన్నారం, బజార్‌హత్నూర్ మండలం డెడ్రా, సిరికొండ మండలం వాయిపేట, భీంపూర్, చిమ్మన్‌గూడి, బోథ్ మండలం అజ్జర్‌వజ్జర్, నాగుగూడ వంటి అటవీ ప్రాంతాల్లో ఏళ్లతరబడి పడిఉన్న కలపను తరలించడంలేదు. అందుకు ప్రత్యేక నిధులు మంజూరవుతున్నా.. వాటిని తరలించడానికి అధికారులు నిద్రమత్తును వీడటంలేదు.**



పడిపోయిన వృక్షాలు కనిపించకుండా నిప్పుపెట్టి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్, జన్నారం, ఇచ్చోడ, కాగజ్‌నగర్ మండల కేంద్రాల్లో కలప డిపోలున్నాయి. అక్రమంగా పట్టుబడిన కలపతో పాటుగా.. అడవుల్లో పడిపోయిన వృక్షాలను తరలించి ప్రతి నెలా వేలం పాటలు నిర్వహిస్తారు. ఇప్పుడు రూ.కోట్ల విలువైన టేకు కర్ర పడి ఉన్నప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.

అటవీశాఖ అధికారులు అన్ని స్థాయిల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సెక్షన్, బీట్ అధికారులు సక్రమంగా (మిగతా 7లో)



లక్సెట్టిపేట పాల శీతలీకరణ కేంద్రాన్ని అర్ధాంతరంగా మూసివేయడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రంలో పాలు పోసే అవకాశం లేకపోవడం... మరో వైపు ఉత్పత్తి చేసిన పాలను ఇంటింటికి తిరిగి అమ్మడం ఇబ్బందిగా మారడంతో కేంద్రాన్ని గతంలో నిర్వహించిన మేనేజర్ సహాయంతో పాడిరైతులు ఆంధ్రాకాలనీలో ఇలా సొంతగా గదిని అద్దెకు తీసుకున్నారు. రైతులు పోసిన పాలను వినియోగదారులకు అమ్మి మిగిలిన పాలను ధర్మపురికి తరలించి పాల ట్యాంకర్ ద్వారా నిజామాబాద్ డెయిరీకి తరలిస్తున్నారు.

# పాడి రైతును ముంచారు!

- ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు
- లక్సెట్టిపేట పాలశీతలీకరణ కేంద్రానికి తాళం
- మీన మేషాలు లెక్కిస్తున్న అధికారులు
- స్పందించకుంటే తుక్కుగా రూ.లక్షలు విలువ చేసే యంత్రాలు



మూతపడ్డ లక్సెట్టిపేట పాల శీతలీకరణ కేంద్రం

**లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: కొండనాలికకు మందు వేస్తే ఉన్న నాలిక ఊడటం అంటే ఇదేనేమో...పాడి పరిశ్రమను బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నామంటూ ప్రభుత్వం గుప్పిస్తున్న ప్రకటనలు నీటి మూటలుగానే మారుతున్నాయి. అధికారుల అలసత్వం... పాలకుల నిర్లక్ష్యం... వెరసి పాడి రైతు రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించింది. లక్సెట్టిపేటలో 40 ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన పాలశీతలీకరణ కేంద్రాన్ని అర్ధంతరంగా మూసివేయడంతో లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం, మంచిర్యాల, హాజీపూర్ మండలాల్లోని పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ నేపథ్యంలో పాలశీతలీకరణ కేంద్రం మూసివేతకు దారి తీసిన పరిస్థితులు, పాడి రైతుల ఇబ్బందులు, అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై 'న్యూస్‌టుడే' కథనం...**

| | |
|---|---|
| పాల సేకరణ జరిగే మండలాలు | మంచిర్యాల, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం |
| పాలమిత్ర యూనిట్లు | 17 |
| పాల సేకరణ చేసే గ్రామాలు | 35 |
| పాల ఉత్పత్తిదారుల సంఖ్య | 500 |
| సేకరణకు అవకాశం | 3 వేల లీటర్లు |
| పాడి రైతులకు బాకీ పడ్డది | రూ. 11 లక్షలు |
| సిబ్బందికి చెల్లించాల్సిన జీతాలు | రూ. 2 లక్షలు |

పాల ఉత్పత్తిదారులను ప్రోత్సహించి వారికి ఉపాధి కల్పించే ఉద్దేశంతో పాలశీతలీకరణ కేంద్రాన్ని లక్సెట్టిపేటలో తొలుత 1977లో ఏర్పాటు చేశారు. నిర్వహణ కొరవడి పాల ఉత్పత్తి ఆశించిన మేర రాక 1996లో మూత పడింది. తిరిగి 500 మంది ఉత్పత్తిదారులతో రోజుకు వెయ్యి లీటర్ల పాలు సేకరించే లక్ష్యంతో (మిగతా 7లో)



- నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఈ యువకుడు తన స్నేహితులతో కలిసి మద్యం తాగి అర్ధరాత్రి ఇంటికి వెళ్లే క్రమంలో రోడ్డుప్రమాదంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి మృతి చెందాడు.
- గత నెలలో బెల్లంపల్లి డివిజన్‌కు చెందిన ఓ యువకుడు స్నేహితులతో కలిసి అతిగా మద్యం తాగాడు. దీని ప్రభావంతో మృతి చెంది కుటుంబసభ్యులకు తీరని శోకం మిగిల్చాడు.

# మద్యం తాగి నడిపితే.. ప్రమాదం తథ్యం

- జిల్లాలో ఏడాదిలో రూ.443.5 కోట్ల విక్రయాలు..నమోదైన కేసులు రెండువేలకు పైనే..

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే


**జిల్లాలో మద్యం విక్రయాలు ఆబ్కారీశాఖకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. 2016తో పోలిస్తే 2017 సంవత్సరం అమ్మకాల్లో రూ.72.65 కోట్లు వ్యత్యాసం పెరిగింది. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుతున్న ఈ మద్యం విక్రయాల వల్ల ప్రజలపై తీవ్ర ప్రభావమే పడుతోంది. ఆర్థికంగా నష్టపోవటంతో పాటు ప్రమాదాలకు పలు నేరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా కారణమవుతోంది. మద్యం తాగడంతో రోడ్డుప్రమాద బారిన పడి మృతిచెండటంతో పాటు అనారోగ్యంతో ప్రాణాలు పోగొట్టుకుంటున్న అభాగ్యులు ఎందరో. జిల్లాలో గతేడాది జరిగిన మద్యం విక్రయాలతో పాటు తాగి వాహనాలు నడిపిన కేసులపై 'న్యూస్‌టుడే' కథనం..**

వివరాలు 7లో



మంచిర్యాల పట్టణంలో రాత్రి 10 గంటలకు మూయాల్సిన మద్యం దుకాణం 12 గంటలకు ఇలా తెరచి విక్రయాలు సాగిస్తున్నారు.

నెలల వారీగా విక్రయాలు రూ. కోట్లలో (ఇన్వాయిస్ ధర ప్రకారం)



# సేవా భావం.. కావాలి సంకల్పం

## నేడు 'రెడ్‌క్రాస్' ఎన్నికలు ★ ఐఆర్‌సీఎస్ చరిత్రలో తొలిసారి ★ పోటాపోటీగా అభ్యర్థుల ప్రచారం

**ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే:** రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ సభ్యులకు గట్టి పోటీ నెలకొంది. ఐఆర్‌సీఎస్ చరిత్రలో తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం ఉదయం స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 7 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ఎన్నికల పరిశీలకులుగా డీసీఓ సంజీవరెడ్డి వ్యవహరించనున్నారు. గత శుక్రవారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి నామపత్రాలు స్వీకరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు ఏకగ్రీవంగా సాగడంతో గతంలో ఎన్నికలు జరిపే అవకాశం రాలేదు.. పోటీ అధికం కావడంతో బరిలో ఉన్న అభ్యర్థులకు ఇప్పటికే గుర్తులు కేటాయించారు. దీంతో పోటీలో ఉన్న వ్యక్తులు తమ ప్రచారాన్ని విస్తృతం చేశారు. ఇప్పటి వరకు ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు ఈ ఏడాది ఆ దిశగా నియామకం అయ్యే పరిస్థితి కనిపించకపోవడంతో ఎవరికి వారు తమ మెజారిటీని పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

### తొలిసారి ప్రత్యక్ష ఎన్నికలు

సంస్థ నియమ నిబంధనలు (బై లాస్) ప్రకారం చేతులు ఎత్తి సొసైటీకి పది మంది నిర్వాహక కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటారు. ఈ ఏడాది నిర్వాహక కమిటీకి మొత్తం 26 మంది సభ్యులు నామపత్రాలు దాఖలు చేశారు. అందులో నాలుగు తిరస్కరణకు గురి కాగా ఒకరు తన నామపత్రాన్ని ఉపసంహరించుకున్నారు. దీంతో తుది జాబితా ప్రకారం 21 మంది బరిలో నిలిచారు. 21 మందిలో కూడా ఏకాభ్రియం కుదిర్చేందుకు గత నెల 29 నుంచే మంతనాలు ప్రారంభించారు. పాత, కొత్త కలయికతో నూతన కమిటీ ఏర్పాటు అవుతుందని అందరు భావించారు. ఏ ఒక్కరూ నామపత్రాలు ఉపసంహరణకు సమ్మతించకపోవడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి.




జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రం

### సేవ కోసం పెరిగిన పోటీ..

సాధారణంగా సేవా సంస్థలకు పెద్దగా పోటీ ఉండదు. సేవా దృక్పథం ఉన్నవారు మాత్రమే ఆయా సంస్థల పదవులను పొందడానికి ఆసక్తి చూపుతారు. దీనికి భిన్నంగా ఇందులో పదవిని దక్కించుకోవడాన్ని సభ్యులు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో ప్రజల్లో రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికలపై ఆసక్తి పెరిగింది. ఏటా నాలుగు గోడల మధ్య జరిగే ఈ తతంగం ప్రస్తుతం బహిర్గతం కావడంతో ప్రజలు ఈ కేంద్రం వైపు చూడటం మొదలుపెట్టారు. లక్షల రూపాయలతో కూడుకున్న వ్యవహారం కావడం ఒక కారణమైతే ప్రస్తుతమున్న సభ్యుల మధ్య సమన్వయలోపం, గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఒకరి వ్యవహారశైలి ప్రత్యక్ష ఎన్నికలకు కారణమైందని పలువురు గుసగుసలాడుతున్నారు. సింగరేణి ప్రాంతానికి చెందిన ఓ సభ్యుడు సేవ ముసుగులో అక్రమాలు చేస్తున్నారని కొందరు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. మరికొంతమంది పదవుల కోసం పోటీపడితే.. దీన్ని అడ్డుపెట్టుకుని సంపాదించుకునేందుకు ఇంకొంత మంది ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది వరకు కేంద్రంలో పనిచేసే వారు నిర్వాహకుల మధ్య పొరపొచ్చలు రావడం, సేవ సంస్థలో అక్రమాలు చేయడం నచ్చక బయటకు వెళ్లారని తెలిసింది. ఇటీవలే జిల్లా కేంద్రంలో మరో రక్తనిధి కేంద్రం ఏర్పాటుకు కారణమైందని సమాచారం.

### స్థానిక సేవా సంస్థల సభ్యుల నుంచి వ్యతిరేకత..

కేంద్రం ప్రారంభంలో జిల్లాలోని పలు సేవా సంస్థలు పోటీపడి మరీ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశాయి. రక్తనిధి కేంద్రం, రక్తదానంపై విస్తృత ప్రచారం చేశారు. అభివృద్ధికి తోడ్పాటు అందించారు. గత రెండు మూడు ఏళ్లుగా ఆయా సంస్థల సభ్యులు కేంద్రంపై తీవ్ర వ్యతిరేకత ప్రకటిస్తున్నారు. నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఆపదలో రక్తం అవసరమై వచ్చిన నిరుపేదల నుంచి కూడా డబ్బులు డిమాండ్ చేయడం, అధిక ధరలను తీసుకుంటుండంతో ఈ కేంద్రంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

రెడ్‌క్రాస్ ఎన్నికలు స్థానిక ఎన్నికలను తలపిస్తున్నాయి. పోటీలో ఉన్న అభ్యర్థులు చెమటోడ్చుతున్నారు. సంస్థలోని దాదాపు 3500 మంది సభ్యులను ప్రసన్నం చేసుకోవాడానికి పావులు కదుపుతున్నారు. ప్రచారపత్రాలు, ఫ్లెక్సీలతో సభ్యులను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లను ఉపయోగించుకుంటున్నారు.

### సభ్యులు ఆలోచించాలి..

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తనిధి కేంద్రంతో పాటు అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమం కొనసాగుతోంది. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ సొసైటీని నడిపించే కమిటీ సభ్యులను ఆచీతూచి ఎంపిక చేసుకోవాలి. వ్యక్తి ప్రయోజనం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే ఆలోచన దృక్పథం ఉన్న వ్యక్తులు, సొసైటీని అన్ని విధాలుగా ముందుకు నడిపిస్తూ నిరుపేదల శ్రేయస్సు కోసం ఆరాటపడే వారిని ఎంపిక చేసుకోలని ప్రజలు కోరుతున్నారు.

## భర్త మద్యం తాగాడని వివాహిత ఆత్మహత్య

**లకెట్టిపేట, న్యూస్‌టుడే:** మండలంలోని అంకత్‌పల్లి గ్రామానికి చెందిన ఎంబడి రమాదేవి(28) ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై బి.సమ్మయ్య తెలిపిన వివరాల మేరకు...గంపలపల్లి గ్రామానికి చెందిన రమాదేవికి అంకత్‌పల్లి గ్రామానికి చెందిన ఎంబడి అంజయ్యతో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. కొంత కాలంగా అంజయ్య మద్యానికి బానిసగా మారాడు. ఈ నెల 1న రాత్రి అంజయ్య మద్యం తాగి ఇంటికి వచ్చారు. దీంతో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్థాపం చెందిన రమాదేవి రాత్రి పది గంటల ప్రాంతంలో పురుగుల మందు తాగింది. ఆమెను వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందింది. రమాదేవి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రమాదేవి మృతదేహం

## అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత

**మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే:** రైలులో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న మద్యంను పట్టుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల జీఆర్పీ ఎస్సై జితేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి చంద్రాపూర్ జిల్లాకు చెందిన రాజురా గ్రామస్థులు ఎ.అశోక్, తిరుపతి దండేకర్ మంచిర్యాలలోని ఓ మద్యం దుకాణంలో రూ.18,620 విలువ కలిగిన 280 మద్యం సీసాలను కొనుగోలు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మద్యంను అజ్నీ ప్యాసింజర్ రైలులో తరలించేందుకు వారు మంచిర్యాల రైల్వేస్టేషన్‌లోని మొదటి ఫ్లాట్‌ఫాంపై వేచిచూస్తున్న క్రమంలో జీఆర్పీ పోలీసుల తనిఖీలో పట్టుబడ్డారని ఆయన తెలిపారు.



మద్యంతో పాటు నిందితులను చూపుతున్న రైల్వే పోలీసులు

## అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన కారు

**హత్నూర:** మద్యం మత్తులో అతివేగంగా కారును నడపడంతో అదుపు తప్పి చెట్టుకు ఢీకొంది. వాహనంలో ఉన్న ఇద్దరికి ప్రాణాప్రాయం తప్పింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం హత్నూర మండలం మంగాపూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన సమంత్ (32) హైదరాబాద్‌లో ఉంటూ బాలానగర్‌లోని వరుణ్ మోటార్స్‌లో సర్వీస్ అడ్వైజర్‌గా పని చేస్తున్నారు. అతడి స్నేహితుడికి చెందిన కారులో తనతో పాటు ఉంటున్న మిత్రులు గణేష్, రాజులతో కలిసి మెదక్ జిల్లా చిలప్‌చెడ్‌లో ఉంటున్న మహబూబ్ అనే అతడు దగ్గరకు మంగళవారం వచ్చారు. వీరిలో సమంత్, రాజులు మద్యం తాగారు. సమంత్ మత్తులో వాహనాన్ని నడుపుతూ హత్నూర మండలం మీదుగా బాలానగర్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో దౌల్తాబాద్‌కు వచ్చిన తర్వాత వాహనం నడిపిస్తానని గణేష్ కోరగా సమంత్ నిరాకరించాడు. దీంతో గణేష్ కారు దిగి ఆటోలో వెళ్లాడు. దౌల్తాబాద్ దాటిన తర్వాత మంగాపూర్ గ్రామ శివారులోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు ముందుభాగం ధ్వంసమైంది. వాహనంలో ఎయిర్‌బెలూనులు తెరుచుకోవడంతో సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు.

## వ్యక్తి ఆత్మహత్య

**భీంపూర్:** మండలంలోని బెల్సరీ రాంపూర్‌కి చెందిన మేస్రం నాగ్‌నాథ్(40) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సోమవారం రాత్రి పంటచేలకు వెళ్తానని ఇంటి నుంచి బయలుదేరిన ఆయన మంగళవారం గ్రామశివారులో పడి ఉన్న ఆయన్ను గమనించిన గ్రామస్థులు కుటుంబసభ్యులకు, ఆ తర్వాత పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలంలో పురుగుల మందు డబ్బాను స్వాధీనం చేసుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మద్యం మత్తులో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

# రెండిళ్లలో చోరీ

☛ 18 తులాల బంగారం, రూ.90 వేలు అపహరణ

☛ మరో రెండిళ్లలో విఫలయత్నం

**మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే:** తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా పెట్టుకున్న దొంగ పట్టణంలోని కాలేజ్‌రోడ్డులో చోరీకి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి నాలుగు ఇళ్లలో చొరబడిన దొంగ రెండిళ్లలో దాచిన బంగారంతో పాటు నగదును ఎత్తుకెళ్లాడు. బాధితులు, పట్టణ సీఐ వేణుచందర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాలేజ్‌రోడ్డులో నివాసం ఉంటున్న ప్రైవేటు గుమాస్తా కాశిపాక అంజయ్య, మంచిర్యాల గ్రంథాలయాధికారి విశ్వనాథ్, ప్రభుత్వ ఉద్యోగి బండ శంకరయ్యలు పలు పనుల నిమిత్తం సోమవారం తమ కుటుంబ సభ్యులతో వేరే ఊళ్లకు వెళ్లారు. ఒకే వీధిలో ఉన్న వీరి ఇళ్లలో ఏక కాలంలో చోరీకి పాల్పడిన దొంగ అంజయ్య నివాసంలో దాచిన రూ.90 వేల నగదుతో పాటు సుమారు పది తులాల బంగారు నగలు ఎత్తుకెళ్లాడు. విశ్వనాథ్, శంకరయ్యల ఇళ్ల తలుపులను పగుల గొట్టిన దొంగ స్థానికులు చేసిన అలికిడి వల్ల అక్కడ నుంచి పారిపోయినట్లు తెలుస్తోంది. కొద్దిదూరంలో ఉన్న గీతా ధ్యానమందిరం పక్కన గల గడ్డం పార్వతి ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లో దాచిన ఎనిమిది తులాల బంగారు నగలు అపహరించుకుపోయాడు. ఈ చోరీలన్నీ ఒకరే చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దొంగతనం జరిగిన తీరు, క్లూస్ టీంల ఆధారాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాలను ఏసీపీ గౌస్ బాబా పర్యవేక్షించారు. దొంగతనం జరిగిన ఇళ్ల వద్ద నుంచి డాగ్ స్క్వాడ్‌లు గీతా ధ్యానమందిరం సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లడంతో స్థానికుడే చోరీలకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ వేణుచందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అంజయ్య ఇంట్లో వస్తువులు చిందరవందగా పడేసిన దృశ్యం

## ఉద్యమకారిణికి పదవి..

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నీలాబాయి

**ఆదిలాబాద్ పట్టణం, సిరికొండ, న్యూస్‌టుడే:** తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడుతున్న సిరికొండ మండలం రాయిగూడకు చెందిన కుస్రం నీలాబాయికి ఎట్టకేలకు పదవి వరించింది. ఆమెను రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలిగా నియమిస్తు ఉత్తర్వులు జారి అయ్యాయి. నీలాబాయి పుట్టిన స్వస్థలం గుడిహత్నూర్ మండలం. 1995లో తెలుగుదేశం తరపున ఆమె గుడిహత్నూర్ జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొందారు. ప్రస్తుతం ఆమె అత్తగారిళ్లైన సిరికొండలోని రాయిగూడలోని నివాసం ఉంటున్నారు. తెరాస పార్టీ ఆవిర్భవించాక 2001 నుంచి అందులో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. మలివిడత ఉద్యమంలోనూ కీలకంగా వ్యవహరించారు. ఆదివాసీల్లో గోండు తెగకు చెందిన ఆమె తెరాస మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. మంత్రులు జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ గోడం నగేష్, డైరీ అధ్యక్షుడు లోక భూమారెడ్డి, ఎమ్మెల్యే రాథోడ్‌బాపురావు సంయుక్తంగా జిల్లా నుంచి ఆమె ఒక్క పేరునే ప్రతిపాదించడంతో కమిషన్ సభ్యురాలిగా నియమితులయ్యారు.

## బస్సుపాస్‌లను పునరుద్ధరించుకోవాలి

**శాంతినగర్:** అర్హులైన పాత్రికేయులు బస్సుపాస్‌లను పునరుద్ధరించుకోవాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షుడు బేత రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 2017 సంవత్సరానికి సంబంధించిన బస్‌పాస్‌ల కాలపరిమితి గత సంవత్సరం డిసెంబర్ 31తో ముగియడంతో వాటి కాలపరిమితిని మరో మూడునెలల పాటు అనగా మార్చి 31 వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఏప్రిల్ నెల నుంచి ఆన్‌లైన్‌లో బస్సుపాస్‌లను పొందాల్సి ఉంటుందని ఆర్టీసీ అధికారులు సూచించినట్లు తెలిపారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న పాత్రికేయులు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్ఎం కార్యాలయంలో సంప్రదించి బస్‌పాస్‌లను పునరుద్ధరించుకోవాలని సూచించారు.

## వాహన సౌకర్యం కోసం రూ.10 వేల సాయం

**ఎదులాపురం, న్యూస్‌టుడే:** జిల్లాలోని ఏఎన్ఎంలు మెరుగైన వైద్య సేవలు అందించటానికి వారికి ద్విచక్రవాహన సౌకర్యం కల్పించటానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించటానికి జిల్లా పాలనాధికారిణి దివ్య హామి ఇచ్చినట్లు తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ తెలిపారు. జిల్లా పాలనాధికారిణిని ఆమె కార్యాలయంలో నాయకులు మంగళవారం కలుసుకొని ఆమెకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని ఏఎన్ఎంలకు ద్విచక్రవాహన సౌకర్యం కల్పించటానికి ఎన్‌హెచ్ఎం నిధుల నుంచి ప్రభుత్వం రూ.10 వేలు అందిస్తోంది. అయితే ఈ వాహనాల కొనుగోలు భారం కానుందని రూ.15వేలు అదనపు సాయం అందించాలని సంఘం నాయకులు కోరగా ఆమె రూ.10వేలు అందించడానికి హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లా పాలనాధికారిణిని కలిసిన వారిలో సంఘం నాయకులు కే.అనిల్, రమణాచారి, శ్రీనివాస్, ప్రమోద్, అర్షద్‌హుస్సేన్, మహిళా విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సంపత్‌కుమారి, సి.పుష్పలత, రెండవ ఏఎన్ఎంల అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, వెంకటమ్మ, సుజాత తదితరులున్నారు.



జిల్లా పాలనాధికారిణి దివ్య కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం నాయకులు

# జలంతోనే జీవితం.. పొదుపుగా వాడుదాం



- ఆటో స్టార్టర్లతో నీటి వృథా
- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా తీరు
- పరిశీలనలో బయటపడిన ఇబ్బందులు



★ ఇది లక్సెట్టిపేట మండలం దౌడపల్లి శివారులోనిది. యాసంగిలోనూ ఇలా నీటితో నిండిపోయింది. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయడంతో సంబంధిత రైతు మోటారు ఆన్ చేసి వదిలివేశారు. దీంతో నీరు అవసరానికి మించి పొలంలోకి చేరి వృథా అవుతున్నాయి. ఇలాగే కొనసాగితే భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయి బావుల్లో చుక్క నీరుండని పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉంది. రైతులు నీటిని జాగ్రత్తగా వాడుకుని జల సంరక్షణకు తోడ్పడాలి.

**దండేపల్లి, న్యూస్‌టుడే**

**రైతుల సంక్షేమానికి ఎన్నో వినూత్న కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వం జనవరి 1 నుంచి సేద్యానికి ఉచిత విద్యుత్‌ను 24 గంటలు అందించేందుకు శ్రీకారం చుట్టింది. బోర్లు, మోటార్ల కింద సాగు చేస్తున్న రైతులు గతంలో సాగుకు విద్యుత్తు లేక ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు 24 గంటల సరఫరా వల్ల ఎప్పటిలాగే ఆటోస్టార్టర్లు ఉంచి మోటార్లు ఉపయోగిస్తే నీటికి, కరెంటుకు కష్టమే.. భూగర్భ జలాలు పడిపోయి భవిష్యత్తులో నీటి కష్టాలు తలెత్తే ప్రమాదం ఉంది. రెండు రోజుల పాటు 'న్యూస్‌టుడే' చేసిన పరిశీలనతో ఈ విషయాలు బయటపడ్డాయి. నీరు వృథా చేయకుండా రైతులు పొదుపుగా వాడుకోవాల్సిన అవసరంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..**

జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి సాగు చేస్తుండగా ఆ తర్వాత స్థానం వరిదే. కడెం జలాశయం, చెరువుల కింద 40 వేల ఎకరాల వరకు సాగవుతోంది. మరో 30 వేల ఎకరాల వరకు వాగులు, వ్యవసాయ బావులు, బోర్ల కింద ఉచిత విద్యుత్ సరఫరాతో సేద్యం చేస్తున్నారు.

ఇప్పటి వరకు వ్యవసాయానికి 9 గంటల పాటు ఇందులో పగలు 6, రాత్రి 3 గంటలు విద్యుత్ సరఫరా చేసేవారు. దీనివల్ల రాత్రి వేళల్లో రైతులు పొలాలకు వెళ్లలేక మోటార్ల వద్ద ఆటో స్టార్టర్లు అమర్చుకున్నారు. జనవరి 1 నుంచి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటంతో చాలా చోట్ల ఆటోస్టార్టర్లు తొలగించకుండానే గతంలోలాగే మోటార్లు ఉపయోగిస్తున్నారు. దీనివల్ల సాగు నీరు అవసరానికి మించి పారి వృథా అవుతోంది. దీనివల్ల భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

**జిల్లాలో వివరాలు:**

| | |
|---|---|
| జిల్లాలో వరి సాగు: | 70 వేల ఎకరాలు |
| విద్యుత్ ఆధారిత సాగు: | 30 వేల ఎకరాల వరకు |
| రైతులు: | 1.45 లక్షలు |
| వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు : | 30,056 |
| విద్యుత్ ఉపకేంద్రాలు (33/11కేవీ): | 47 |
| ఉపకేంద్రాలు (132/33కేవీ): | 04 |
| 220/132కేవీ ఉపకేంద్రం : | 01 |
| విద్యుత్ వినియోగం (ఏడాదికి) : | 87.482 మిలియన్ల యూనిట్లు |



★ యాసంగి వరి సాగుకు సిద్ధం చేస్తున్న ఈ పొలం దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లోనిది. 24 గంటలు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడం వల్ల వర్షాకాలం సాగును మరిపించేలా మడి నిండా నీరు పారుతోంది. ప్రస్తుతం బావిలో పుష్కలంగా నీరు ఉండటం వల్ల ఏ ఇబ్బంది లేదు. నీరు ఇలాగే ఉపయోగిస్తే భవిష్యత్తులో బావి నీటి మట్టం పూర్తిగా పడిపోయి ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది.

ఈనాడు పరిశీలన

### ఆటోస్టార్టర్ల తొలగింపుపై అవగాహన పెంచాలి



గతంలో ఏడు గంటలు, తొమ్మిది గంటలు ...అదీ రెండు విడతలుగా రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా చేయడంతో రైతులు రాత్రి పూట పొలాలకు వెళ్లకుండా ఉండేందుకు ఆటోస్టార్టర్లు అమర్చుకున్నారు. రెండు విడతలుగా కావడంతో గరిష్ఠ స్థాయిలో ఆరు గంటల కన్నా మించి విద్యుత్ సరఫరా ఉండేది కాదు. దీంతో ఎటువంటి ఇబ్బంది లేదు. 24 గంటలు విద్యుత్ ఉండటంతో అవసరం ఉన్నా లేకపోయినా మోటారు పనిచేస్తుండటంతో నీరు వృథా అవుతుంది. దీంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయి బావులు, వాగులు ఎండిపోయి సాగు నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అధికారులు ఆటో స్టార్టర్ల తొలగింపుపై రైతుల్లో అవగాహన కల్పించాలి. నీరు వృథా చేస్తే భవిష్యత్తులో పొంచి ఉన్న ముప్పును వివరించాలి. అప్పుడే నిరంతర విద్యుత్ రైతులకు పూర్తి ఉపయోగకరంగా ఉంటుంది.

### రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

**- ఎం.రమేశ్‌బాబు, ఎస్‌సీ డిస్కం మంచిర్యాల**

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రస్తుతం నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నాం. అక్కడక్కడ చిన్నచిన్న అంతరాయం కలుగుతోంది తప్ప పెద్దగా ఇబ్బందులు లేవు. వీటిని కూడా లేకుండా చర్యలు తీసుకుంటాం. రైతులు ఇంకా చాలా చోట్ల ఆటోస్టార్టర్లు అలాగే ఉంచి మోటార్లను ఉపయోగిస్తున్నారు. దీనివల్ల చాలా నష్టం. నీరు వృథా అయి భూగర్భ జలాలు పడిపోతాయి. విద్యుత్ కూడా వృథా కావడంతో పాటు మోటారుపై భారం పడి కాలిపోయే ప్రమాదం ఉంది. నీరు పారించుకునే వరకు రైతులు పొలం దగ్గరే ఉంటేనే మంచిది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని. రైతులు కూడా జాగ్రత్త పడాలి.




★ రెండు రోజుల కిందటి వరకు నీటితో కళకళలాడిన ఈ వాగు మేదరిపేట సమీపంలోనిది. రెండు రోజులుగా నిరంతర విద్యుత్ వల్ల వాగును ఆధారం చేసుకుని వరి సాగు చేస్తున్న రైతులు నీటిని పూర్తిగా తోడేశారు. నీరు అవసరం ఉన్నా లేకపోయినా మోటార్ పంపులు పనిచేస్తుండడంతో వాగులో చుక్క నీరు లేకుండా పోయింది. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పంట సాగుకే కాదు.. కనీసం పశువులు దాహార్తి తీర్చుకోవడానికి సైతం నీరుండదు.

### ఆటో స్టార్టర్ తీసేశాను



**- షేక్ అహ్మద్ రైతు వెంకటాపూర్**


నాకు గ్రామ శివారులో ఎకరం పొలం ఉంది. నా పొలంలో ఉన్న మోటారు 4 నుంచి 5 గంటలు పనిచేస్తే పొలం నిండుతుంది. ప్రస్తుతం 24 గంటల పాటు కరెంటు వస్తుండటంతో మోటార్ పనిచేస్తే నీరు వృథా పోవడమే కాకుండా మోటార్ కాలుతుందని ఇటీవలే ఆటో స్టార్టర్ తొలగించాను. నీరు అవసరం ఉంటే పొలం దగ్గరనే ఉండి పారించుకుంటున్నాను.

| | |
|---|---|
| జిల్లా వ్యాప్తంగా ఆటో స్టార్టర్లు: | 25,500 |
| ప్రస్తుతం తొలగించినవి : | 5,200 |
| తొలగించాల్సినవి: | 20,300 |

### అంతరాయం లేకుండా చూడాలి

24 గంటల పాటు విద్యుత్ రైతులకు ప్రయోజనకరంగానే ఉన్నా మధ్యమధ్యలో సరఫరాలో అంతరాయం (ట్రిప్) కావడం రైతులకు ఇబ్బందిగా మారింది. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం సరాసరిగా రోజుకు రెండు నుంచి నాలుగు సార్లు ట్రిప్ అవుతోందని రైతులు చెబుతున్నారు. స్తంభాల మధ్యలో చెట్లు ఉండటం, అటవీ ప్రాంతం శివారు పొలాల సమీపంలో ఉడతలు, పక్షులు తీగలపై చనిపోవడంతో ట్రిప్ అవుతున్నాయి. అయితే అధికారులు 5 నుంచి 10 నిమిషాల వ్యవధిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తున్నా తిరిగి పొలానికి వెళ్లి మోటర్ ఆన్ చేయాలంటే ఇబ్బందే. ఏమాత్రం అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తేనే రైతులకు ఇబ్బందులు తప్పుతాయి.

ఒక ఫీడర్ కింద గత రెండు రోజులుగా ట్రిప్ అయిన తీరు ఇలా..




# ప్రైవేటు ఆసుపత్రుల బంద్ విజయవంతం

- జిల్లా కేంద్రంలో ర్యాలీ
- మద్దతు ప్రకటించిన అనుబంధ సంఘాలు




ర్యాలీలో పాల్గొన్న ఐఎంఏ, కెమిస్టు, డ్రగిస్టు, మెడికల్ రిప్రజెంటేటివ్, ల్యాబ్ టెక్నిషియన్ అసోసియేషన్ సభ్యులు

**ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే:** కేంద్ర ప్రభుత్వం ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌ను రద్దు చేసి ఇండియన్ మెడికల్ కమిషన్ ఏర్పాటు దిశగా అడుగులు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన ప్రైవేటు ఆసుపత్రుల ఒకరోజు బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన చేపట్టారు. పాలనాధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. వైద్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అనంతరం మంచిర్యాల ఐఎంఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఐఎంసీకి బదులుగా జాతీయ వైద్య కమీషన్ బిల్లును తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బంద్‌కు మద్దతుగా కెమిస్టు, డ్రగిస్టు అసోసియేషన్, మెడికల్ రిప్రజెంటిటీవ్, ల్యాబ్ టెక్నిషియన్ అసోసియేషన్ సభ్యులు తమ మద్దతు తెలిపి నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మూర్తి, వైద్యులు ఎన్.మల్లేష్, రమణ, రాఘవరావు, రాంబాబు, నర్సయ్య, అన్నపూర్ణ, పద్మ, స్వరూప, రఘునందన్, కెమిస్టు, డ్రగిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు తొగరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాల

## రక్తనిధి కేంద్రంలో నిల్వలు

**ఏసీసీ(మంచిర్యాల):** మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు మంగళవారం వరకు ఎ పాజిటివ్ 6, ఎ నెగటివ్ 2, బి పాజిటివ్ 43, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 1, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 22, ఒ నెగటివ్ 7 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. అవసరం ఉన్నవారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా.డి.విష్ణుమూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.

## వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**గూడెం(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన దమ్మ రాజయ్య అనే వీఆర్ఏ మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. తహసీల్దార్ దత్తుప్రసాదరావు, సిబ్బంది ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ గణపతి, వీఆర్వో రాజయ్య, వీఆర్ఏలు మన్నె ప్రవీణ్, కాసం శరత్‌కుమార్, బల్లు రాజు, సాగర్, రాజయ్య పాల్గొన్నారు.

# లక్షలు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

### శిథిలావస్థలో బెహరన్‌గూడ చెక్‌డ్యాం ✧ సాగు నీరందక బీళ్లుగా మారుతున్న పొలాలు ✧ పునరుద్ధరిస్తే రైతులకు ప్రయోజనం

**దండేపల్లి, న్యూస్‌టుడే:**

**గ్రామాల్లో వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ, మరమ్మతులు చేపట్టేందుకు మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. గతంలో వాగులు, ఇతర నీటి వనరులను ఆధారంగా చేసుకుని నిర్మించిన చెక్‌డ్యాంలు నిర్వహణ లేక శిథిలావస్థకు చేరాయి. గిరిజన గ్రామాలకు సాగు నీరందించేందుకు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలో బెహరన్‌గూడలో నిర్మించిన చెక్‌డ్యాం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారడంతో భూములు బీళ్లుగా మారుతున్నాయి. గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై 'న్యూస్‌టుడే' కథనం...**

దండేపల్లి మండలం చింతపల్లి పంచాయతీ పరిధిలోని బెహరన్‌గూడ గిరిజన గ్రామ శివారులోని అటవీప్రాంతంలో ప్రవహించే వాగుపై 20 ఏళ్ల కిందట ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.4 లక్షల వ్యయంతో చెక్‌డ్యాం నిర్మించారు. 100 ఎకరాలు సాగు చేసేందుకు వీలుగా చెక్‌డ్యాంకు ఇరువైపులా 400, 160 మీటర్ల పొడవుతో కాలువలు నిర్మించారు. కాలువల్లోకి నీరు వెళ్లేందుకు షట్టర్లతో కూడిన తూములు సైతం నిర్మించారు. దీనికి ఏళ్లుగా మరమ్మతులు చేయకపోవడం, చెక్‌డ్యాంలో ఇసుక, మట్టి పూడిక నిండి నిరుపయోగంగా మారింది. గతంలో ఐడీడీఏ అధికారులు దీనిని సందర్శించి పూడిక తీత, మరమ్మతుల కోసం నిధులు విడుదల చేస్తున్నట్లు హామీ ఇచ్చారు కాని అది కార్యరూపం దాల్చలేదు. అధికారులు స్పందించి ఇసుక, రాళ్లు తొలగించి వాగు నీరు ఇందులో నిల్వ ఉండేలా చెక్‌డ్యాం ఎత్తు పెంచితే 100 ఎకరాల వరకు నీరందే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ, నీటి వనరుల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తేవాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.



☛ చెక్‌డ్యాం కట్ట పూర్తిగా శిథిలమైంది. మొత్తం ఇసుకతో నిండిపోయింది. రాళ్లు పూర్తిగా కూలిపోయాయి. ఏళ్ల తరబడి ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.



☛ చెక్‌డ్యాం నుంచి వచ్చే నీరు కాలువల్లోకి వెళ్లేందుకు నిర్మించిన తూము ఇది. చెక్‌డ్యాం నిరుపయోగంగా మారడంతో తూముకు ఉన్న తలుపులు రాడ్లు పనిచేయకుండా పోయాయి. కింద ఉన్న రాళ్లు కూలిపోతున్నాయి.

### ఇది కాలువనే



చిత్రంలో కనిపిస్తున్నది పొలాల్లోకి సాగు నీరు వెళ్లేందుకు నిర్మించిన కాలువ. చెక్‌డ్యాం నిరుపయోగంగా మారడంతో సాగు నీటి కాలువలు ఇలా అనవాళ్లు కోల్పోయి నిరుపయోగంగా మారాయి. కాలువలు పిచ్చి మొక్కలు, పొదలతో నిండిపోయాయి. కాలువలు పూడుకుపోయాయి.

### బీడుగా మారిన భూములు



సాగు నీరు అందక పొలాలన్నీ బీళ్లవుతున్నాయి. దీని కింద ఉన్న 100 ఎకరాల మేర పొలాలన్నీ బీళ్లుగా మారాయి. కొందరు రైతులు బావులు తవ్వుకుని 20 ఎకరాల వరకు సాగు చేసుకుంటుండగా మిగతా భూములకు నీటి సౌకర్యం లేక బీళ్లుగా మారాయి.

### చెక్‌డ్యాం ఉపయోగంలోకి తేవాలి



**కుర్సింగ్ శంకర్, రైతు, బెహరన్‌గూడ**

చెక్‌డ్యాం నిరుపయోగంగా మారడంతో పొలాలు బీళ్లుగా మారాయి. నాకు రెండెకరాలు ఉండగా బావి తవ్వుకోవడం వల్ల ఎకరం మాత్రమే సాగవుతోంది. మిగతా ఎకరం బీడుగానే ఉంది. చెక్‌డ్యాం ఎత్తు పెంచి వాగు నీరు నిల్వ ఉండేలా మరమ్మతులు చేసి ఆదుకోవాలి. పొలాలన్నీ పండేలా అధికారులు చూడాలి.

### అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



**పెంద్రం రాంపటేల్, మాజీ సర్పంచి చింతపల్లి**

బెహరన్ గూడ గ్రామానికి చెక్‌డ్యాం ఎంతో ఆధారం. 20 ఏళ్ల కిందట నిర్మించారు. నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. చెక్‌డ్యాం పైభాగంలో ఇసుక, మట్టి పూడికతో నిండిపోయింది. ప్రభుత్వం మిషన్ కాకతీయలో చెరువులను మరమ్మతులు చేస్తోంది. ఈ పథకంలో చెక్‌డ్యాం మరమ్మతులు చేపట్టి ఉపయోగంలోకి తెస్తే గిరిజనులకు చెందిన 100 ఎకరాల వరకు సాగయ్యే అవకాశం ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి.

### ప్రతిపాదనలు పంపాం

**విజయ్‌భాస్కర్ నీటి పారుదల ఏఈ**

చెక్‌డ్యాం మరమ్మతుల కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. మరోసారి ప్రతిపాదనలు పంపుతాం. ప్రభుత్వం నుంచి మరమ్మతులకు అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తాం.



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**దండేపల్లి, న్యూస్‌టుడే:** రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ గోళ్ల మంజుల అన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నందుకు మంగళవారం తెరాస, రైతుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేసీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా రుణమాఫీ, వ్యవసాయ పెట్టుబడులకు ఎకరానికి రూ. 4 వేలు లాంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుని రైతులు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో విగ్రహ నిర్మాత గుండ రవిందర్, సర్పంచి అజ్మీర కిషన్ నాయక్, నాయకులు కట్ట వెంకటేష్, బొలిశెట్టి గంగన్న, కొండు సత్తయ్య, బొమ్మెన మహేష్, గోళ్ల రాజమల్లు, ముత్యాల శంకరయ్య, ఈశ్వర్ నాయక్ తదతరులు పాల్గొన్నారు.

### తెరపై ఈనాడు

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** వేంకటేశ్వర - హలో, ఏషియన్ శ్రీనివాస - ఎంసీఏ(మిడిల్ క్లాస్ అబ్బాయి), లక్ష్మి- ఒక్క క్షణం, మయూరి - టూ కంట్రీస్

## యాదవుల సమస్యలు పరిష్కరించాలి

**గుడిపేట (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే:** జిల్లాలోని యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పశువైద్యాధికారి డా.ఎల్లన్నకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం యాదవులకు అందించే రాయితీ గొర్రెలను వందశాతం అందజేయాలన్నారు. జిల్లా వాతావరణానికి అనుకూలమైన నెల్లూరు గొర్రెలను యాదవులకు అందజేయాలన్నారు. ఇంతవరకు 4216 యూనిట్లు మాత్రమే పంపిణీ చేసినందున వెంటనే పూర్తిస్థాయిలో అందజేయాలన్నారు. పలు కారణాలతో మృతిచెందిన రాయితీ గొర్రెలకు బీమాసౌకర్యం కల్పించాలని కోరారు. మృతిచెందిన గొర్రెల స్థానంలో కొత్త గొర్రెలను అందజేయాలని కోరారు. మేత కోసం ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను అమలుచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం, ఉమ్మడి జిల్లా గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు హన్మాండ్లు, ఉపాధ్యక్షుడు సతీష్,నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా పశువైద్యాధికారి డా.ఎల్లయ్యకు వినతి పత్రం అందజేస్తున్న యాదవసంఘం నాయకులు

## నిరుపేదలకు పట్టాలివ్వాలి

**ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే:** కబ్జాదారుల నుంచి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని నిరుపేదలకు అందజేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని 345 సర్వేలో గుడిసెలు వేసుకున్న పేదలతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా కార్యదర్శి మేకల రామన్న అధ్యక్షతన జరిగిన ఈ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముఖ్యమంత్రి ఎన్నికల వాగ్దానాలను ఇప్పటికి అమలు చేయలేదన్నారు. పేదల సొంతింటి కల కలగానే మిగిలిందన్నారు. మంచిర్యాలలో అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, జాడి దేవరాజ్, తిరుపతిరెడ్డి, సుధాకర్, శ్రీనివాస్, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు అన్నదానం

**సీసీసీ(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే:** నస్పూర్ మండలం సీసీసీ ఆర్కే-5 కాలనీలోని శ్రీసాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అక్కిరెడ్డి రవీందర్-లావణ్య దంపతులు మంగళవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడు పుట్టిన రోజు, నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా వృద్ధులకు మిఠాయిలు, పండ్లు పంచి అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవీందర్-లావణ్య దంపతుల కుటుంబ సభ్యులు రామక్క, లక్ష్మయ్య, హర్షిత్, అక్షిత్, సత్యనారాయణ, దుర్గప్రసాద్, రాజు, శ్రీసాయి వృద్ధాశ్రమ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎండీ జమాల్, సుద్దాల ప్రసాద్ పాల్గొన్నారు.



పశువులకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న పశువైద్యాధికారి కిషోర్

## గాలికుంటు నివారణ టీకాలు

**కాసిపేట(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం కాసిపేట, వెల్గనూర్ గ్రామాలలో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి కిషోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మొత్తం 633 పశువులకు నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అంబటిపెల్లి శ్రీలత, లింగాల తిరుపతి, నాయకులు రవీందర్, సిబ్బంది ఇబ్రహీం షరీఫ్, తిరుపతి, సంతోష్, స్వామి పాల్గొన్నారు.

## 4న లూయీస్ బ్రెయిలీ జయంతి

**మంచిర్యాల గ్రామీణం, న్యూస్‌టుడే:** అంధుల ఆశాజ్యోతి, అక్షరప్రదాత లూయీస్‌బ్రెయిలీ జయంతి వేడుకలను ఈ నెల 4న మంచిర్యాల జిల్లా పాలనాధికారి సమావేశ మందిరంలో ఉదయం 11 గం.లకు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి రౌఫ్‌ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాలకు చెందిన అంధులైన దివ్యాంగులు లూయీస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మంచిర్యాల

## నేడు సావిత్రీబాయిపూలే జయంతి

**చెన్నూరు, న్యూస్‌టుడే:** చెన్నూరులోని ఎమ్మార్సీ కార్యాలయంలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 3 గంటలకు సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి సంతోష్, పొలాస సత్యనారాయణలు తెలిపారు. కార్యక్రమానికి మహిళలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.



# సమస్యలు పరిష్కరించడానికే ఇంటింటి పర్యటన

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజల సమస్యలు పరిష్కరించడానికే ఇంటింటి పర్యటన చేస్తున్నానని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. పాతమంచిర్యాలలో మంగళవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతమంచిర్యాలలో ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, మాజీ అధ్యక్షుడు పెంట రాజయ్య, కౌన్సిలర్లు కోదాటి కమలాదేవి, పల్ల రాజన్న, కో-ఆప్షన్ సభ్యుడు తోట తిరుపతి, మమతా సూపర్ బజార్ అధ్యక్షుడు వై.తిరుపతి, తెరాస పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు పెల్లి అంజయ్య, దుర్గం రాజేశ్, బొలిశెట్టి కిషన్, చింతకింది మల్లయ్య, శెట్టి శ్రీనివాస్, ధర్ని శ్రీనివాస్, పెంట ప్రదీప్, పెంట నవీన్, తూముల నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పాతమంచిర్యాలలో ఇంటింటి పర్యటన చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు



వైద్యారోగ్యశాఖ సంఘం కాలసూచీ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

### వైద్యారోగ్యశాఖ సంఘం కాలసూచీ ఆవిష్కరణ

**ఏసీసీ(మంచిర్యాల):** తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర కాలసూచీని ఆవిష్కరించారు. మంగళవారం ఎమ్మెల్యే దివాకర్‌రావు నివాసంలో ఆయన చేతులమీదుగా విడుదల చేశారు. వైద్యశాఖలోని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అల్లాడి శ్రీనివాస్, కార్యదర్శి సతీష్, సహాయ అధ్యక్షురాలు రాజశ్రీ, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు మహేశ్వరరెడ్డి, పద్మ, ప్రమీల, సంయుక్త కార్యదర్శులు సుశీల, కమలాకర్, ప్రచార కార్యదర్శి రమేష్, కార్యనిర్వాహక కార్యదర్శులు నాగభూషణం, శంకర్, కార్యవర్గ సభ్యులు శంకర్, శ్రీనివాసరెడ్డి, సంతోష్, రాము, గోపాల్, శ్రీనాధ్ తదితరులు పాల్గొన్నారు.

### దుర్గాదేవిపూజ కాలసూచీఆవిష్కరించిన ఎమ్మెల్యే

**మంచిర్యాల సాంస్కృతికం:** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సర్వజనని దుర్గాదేవి పూజ కాలసూచీని ఎమ్మెల్యే దివాకర్‌రావు విడుదల చేశారు. స్థానిక విశ్వనాథ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ధర్మకర్త మండలి ఛైర్మన్ సిరిపురం శ్రీనివాస్, అర్చకులు నరహరిశర్మ, దుర్గాదేవి పూజ అధ్యక్షుడు బోడ ధర్మందేర్, సభ్యులు ప్రియాసర్కార్, బొమ్మ సరిత, కొత్త లీలా తదితరులు పాల్గొన్నారు.



కాలసూచీ, దైనందినలను విడుదల చేస్తున్న డీఈఓ)

## ఎస్టీయూ దైనందిని, కాలసూచీ విడుదల

**మంచిర్యాలవిద్యావిభాగం, న్యూస్‌టుడే:** తెలంగాణ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) 2018 నూతన సంవత్సర కాలసూచీ, దైనందినలను జిల్లా విద్యాధికారి రవికాంత్ విడుదల చేశారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈఓ మాట్లాడుతూ గత 70 ఏళ్లుగా విద్యాభివృద్ధికి ఎస్టీయూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బీసగౌని శంకర్‌గౌడ్, పోకల వెంకటేశ్వర్లు, జిల్లా పరీక్షల సహాయాధికారి సురేష్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి భీంరావు, మండల విద్యాధికారి దాసరి శ్రీనివాస్, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ కరుణాకర్, జిల్లా కోశాధికారి సత్తయ్య, నాయకులు మల్లేశం, సుమన్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటి కాలువల్లో గడ్డిని తొలగించండి

**రాపల్లి (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే:** హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలోని మురుగునీటి కాలువల్లో పేరుకుపోయిన గడ్డిని, ముళ్ల పొదలను సత్వరమే తొలగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గతంలో పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ కాలువల్లోని గడ్డిని తొలగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువల్లో గడ్డి పెరగడంతో నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుందని, దోమలు పెరిగాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వెంటనే మురుగునీటి కాలువల్లోని గడ్డిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ఏపుగా పెరిగిన గడ్డితో నిండిపోయిన మురుగునీటి కాలువలు

## టీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్

**మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే:** మంచిర్యాలకు చెందిన గొల్లపల్లి చంద్రశేఖర్ తెలంగాణ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా నియామకమయ్యారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన టీఎస్‌యూ రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంజి జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌కు నియామకపత్రం అందచేశారు.



## విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

**చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని దుగ్నెపల్లి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ మాధ్యమిక సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటే శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని ప్రధానోపాధ్యాయులు కె.బానయ్య అన్నారు. మార్చివరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు జె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గూడెంలో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న దంపతులు



సత్యదేవుని దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

## గూడెంలో పౌర్ణమి సందడి

**గూడెం(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ముందుగా భక్తులు సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళలు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. దంపతులు సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించారు.

# సంప్రదాయబద్ధంగా సుహాసిని పూజ

### వైభవోపేతంగా ధనుర్మాస ఉత్సవాలు

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** జైశ్రీమన్నారాయణ.. అంటూ తితిదే కల్యాణ మండపం మార్మోగుతోంది. 20 రోజులుగా రోజుకో ప్రత్యేక పూజతో ధనుర్మాస వ్రత మహోత్సవాలు, శ్రీవెంకటేశ్వర శరణాగతి దీక్షలు మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా కొనసాగుతున్నాయి. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళశాసనాలతో జెట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక తితిదే కల్యాణ మండపంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం సేవాకాలం, సామూహిక శ్రీవిష్ణుసహస్రపారాయణము, శ్రీమద్భగవద్రామానుజుల వైభవ ప్రవచన కార్యక్రమాలు నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియ అధ్యక్షతన వైభవోపేతంగా జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం సుహాసినిపూజను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో ప్రత్యేక వస్త్రధారణతో హాజరై అమ్మవారికి గాజులు, పూజలు పండ్లు సమర్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు, సభ్యులు నర్సింగరావు, కిషన్‌రావు, పొన్నమనేని హన్మంతరావు, నర్సింగరావు, ఉమా, భక్తులు పాల్గొన్నారు.



సుహాసినిపూజ జరిపిస్తున్న నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియ, మహిళలు

## మహాసభలను విజయవంతం చేయండి

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 6,7 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య పార్కులో పురపాలిక కార్మికులు, ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించే 2వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ సంఘం జిల్లా కార్యదర్శి కాసర్ల రాజలింగు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మందమర్రి పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోడప్రతులను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఈ సభ ద్వారా తీసుకువెళ్తామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్, లక్ష్మి, వెంకమ్మ, సారయ్య, రాజలింగు పాల్గొన్నారు



శ్రమదానంలో కౌన్సిలర్ పడాల రామన్న

## సాయికుంటలో శ్రమదానం

**మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే:** పట్టణంలోని సాయికుంటలో మంగళవారం మంచిర్యాల వృత్తివిద్యా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శ్రమదానం చేశారు. ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పడాల రామన్న విద్యార్థులతో కలిసి పిచ్చిమొక్కలను తొలగించారు. విద్యార్థులు తమ ప్రాంతాన్ని ఎంచుకొని ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి గ్రామసభలు

**లక్సెట్టిపేట, న్యూస్‌టుడే:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 3 నుంచి 12 వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.రాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 3న బలరావుపేట, చందారం గ్రామాల్లో, 4న దౌడేపల్లి, ఎల్లారం, 5న గుల్లకోట, జెండా వెంకటాపూర్, 6న ఇటిక్యాల, లక్ష్మీపూర్, 8న లక్సెట్టిపేట, మోదెల, 9న పాత కొమ్ముగూడెం, పోతపల్లి, 10న రంగపేట, తిమ్మాపూర్, 11న ఊత్కూర్, వెంకట్రావుపేట, 12న కొత్తూరు గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో సభలు నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. ఆయా గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు, వివిధ శాఖల గ్రామస్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన సూచించారు.

# స్వచ్ఛ బల్దియాలుగా బెల్లంపల్లి, మంచిర్యాల

■ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితా

**బెల్లంపల్లి, మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** బహిరంగ మల, మూత్ర రహిత పట్టణాల జాబితాలో బెల్లంపల్లి, మంచిర్యాల పురపాలకసంఘాలకు చోటు దక్కింది. మంగళవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో తెలంగాణ రాష్ట్రంలోని ఐదు బల్దియాలు, రెండు నగరపాలక సంస్థలకు చోటు దక్కింది. ఇందులో మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి, మంచిర్యాల పురపాలకసంఘాలు ఈ ఘనత సాధించాయి. ఇప్పటికే కేంద్రం ప్రకటించిన మొదటి జాబితాలో మందమర్రికి చోటు లభించిన విషయం విదితమే. దీంతో మంచిర్యాల జిల్లాలో ఉన్న మూడు పురపాలకసంఘాలకు కేంద్రం ప్రకటించిన జాబితాలో చోటు దక్కినట్లైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా నూరుశాతం వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేసి బహిరంగ మల,మూత్ర రహిత పట్టణాలు కేంద్రం ప్రత్యేక సర్వేల ద్వారా ఈ జాబితాను విడుదల చేసింది. ఇందులో రాష్ట్రంలోని వరంగల్, హైదరాబాద్ నగరపాలకసంస్థలు, జనగాం, మిర్యాలగూడ, సదాశివపేట పురపాలకసంఘాలు ఉన్నాయి.

# ఖనిజ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

■ పాలనాధికారి ఆర్వీ కర్ణన్

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** ఖనిజ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని పాలనాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. ఇందుకు అవసరమైన ప్రణాళికలను అధికారులు సిద్ధం చేయాలని ఆదేశించారు. మంచిర్యాలలోని పాలనాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖనిజ ప్రభావిత ప్రాంతాల్లో గల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై తనకు నివేదిక ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్ఛార్జి రెవెన్యూ అధికారి ప్రియాంక, శ్రీరాంపూర్ సింగరేణి జీఎంలు సుభాని, రాఘవులు, విద్య, వైద్య, వ్యవసాయం, అటవీ శాఖ, రోడ్డు భవనాల శాఖ, పంచాయితీరాజ్, జిల్లా సంక్షేమ శాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.

### భూపాల్‌పల్లి జిల్లా ఇన్ఛార్జి పాలనాధికారిగా బాధ్యతలు

**మంచిర్యాల పట్టణం:** భూపాలపల్లి జిల్లా ఇన్ఛార్జి పాలనాధికారిగా మంచిర్యాల పాలనాధికారి ఆర్.వి.కర్ణన్‌ను మంగళవారం నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల కిందటనే పెద్దపల్లి ఇన్ఛార్జి పాలనాధికారిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. అక్కడి జిల్లా అధికారులతో మంగళవారం తొలిసారిగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నిర్వహించిన కొద్ది గంటల్లోనే ఆర్వీ కర్ణన్ బాధ్యతలు మారాయి. తాజాగా పెద్దపల్లి పాలనాధికారిగా దేవసేనను ప్రభుత్వం నియమించి, మళ్లీ ఆర్వీ కర్ణన్‌ను భూపాలపల్లి జిల్లా ఇన్ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆర్వీ కర్ణన్ మంచిర్యాల పాలనాధికారిగా, ఉట్నూర్ ఐటీడీఏ ఇన్ఛార్జి పీఓగా పని చేస్తున్నారు. ఇప్పుడు అదనంగా మళ్లీ భూపాలపల్లి జిల్లా ఇన్ఛార్జి పాలనాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి ఆర్వీ కర్ణన్

### గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

**మంచిర్యాల పట్టణం:** వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేసి గ్రామాల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని పాలనాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. మంచిర్యాల పాలనాధికారి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆక్రమ లేఔట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లను 100 శాతం నిర్మాణం పూర్తి చేసి రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. అనంతరం పంచాయితీ అధికారులు రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను పాలనాధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ శాఖ అధికారి నరేందర్, ఉద్యోగులు సతీష్, మేఘమాల, శంకర్, రవీందర్, వివేక్ వరలక్ష్మి, తదతరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు







# శివనామస్మరణతో మార్మోగిన విశ్వనాథ ఆలయం

✻ శివముక్కోటి కైలాస దర్శనానికి పోటెత్తిన భక్తజనం

**మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే:** ఆది దంపతులైన శ్రీపార్వతిపరమేశ్వరుల ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటేత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోనిని శ్రీవిశ్వనాథ ఆలయం శివనామస్మరణతో మార్మోగిపోయింది. కైలాసేశుని దర్శనానికి భక్తజనం పోటేత్తారు. ముక్కోటి దేవతలు, అశేషభక్తజనులు అత్యంత పవిత్రంగా భావించే శివముక్కోటి కార్యక్రమానికి మంగళవారం తెల్లవారు జమున నుంచే భక్తులు వరుసకట్టారు. స్వామివారి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంఘనబట్ల నరహరిశర్మ, వామనబట్ల రామచంద్రమూర్తి, బాలకృష్ణశర్మ, భట్టారాచార్యులు, సీతారామశాస్త్రీ, శ్రీకేష్‌శర్మలు ఉదయం గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించి అర్చనలు జరిపించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతుల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసపాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహాణాధికారి ఫణితుల వేణుగోపాల్, ధర్మకర్త మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరద్వారం ద్వారా దర్శనిమిస్తున్న నందీశ్వరుడు; బారులుతీరిన భక్తులు



కస్తూర్బా, ఆదర్శ పాఠశాలల ప్రత్యేకాధికారులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి

# రుచి, ఆరోగ్యదాయక ఆహారపట్టిక అమలు చేయాలి

■ జిల్లా విద్యాధికారి రవికాంత్

**మంచిర్యాలవిద్యావిభాగం, న్యూస్‌టుడే:** కస్తూర్బా, ఆదర్శపాఠశాలల్లో కొత్తగా వచ్చిన ఆహారపట్టికను పక్కగా అమలు చేయాలని జిల్లా విద్యాధికారి రవికాంత్ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన జిల్లాలోని కస్తూర్బా, ఆదర్శపాఠశాలల అధికారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించేలా చూడాలన్నారు. వారంలో రెండు రోజులు చికెన్, రెండు రోజులు మటన్ తప్పకుండా అమలు చేయాలన్నారు. ఉదయం పూట ఏడు రోజులు ఏడు రకాల అల్పాహారాన్ని పెట్టాలని, కాస్మోటిక్ కిట్‌లను అందరికి అందేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మెనూలో ఏలాంటి పొరపాట్లు జరిగినా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు.

# గొల్లకురుమలకు ఎస్‌ఎన్‌టీ రిజర్వేషన్ పునరుద్ధరించాలి

★ జీకేఎన్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాదవ్

**చెన్నూరు, న్యూస్‌టుడే:** గొల్లకురుమలకు ఎస్ఎన్‌టీ(సెమి నొమాడిక్ ట్రైబ్స్) రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలని గొల్లకురుమ నవ నిర్మాణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసరి నాగేష్‌యాద్ డిమాండు చేశారు. మంగళవారం సమితి ఆధ్వర్యంలో చెన్నూరులో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. సంచార జీవనం సాగిస్తున్న గొల్లకురుమలను ఎస్ఎన్‌టీ జాబితా నుంచి తొలగించి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. సంచార నేపథ్యంలో ఉన్న గొల్లకురుమలకు 1955 నుంచి 1971 వరకు ఎస్ఎన్‌టీ రిజర్వేషన్ ఉందన్నారు. 1968లో అప్పటి ప్రభుత్వం అనంతరామన్ కమీషన్ వేసి మొత్తం జనాభాలో 18 శాతం ఉన్న గొల్లకురుమలను ఎస్ఎన్‌టీ జాబితా నుంచి తొలగించి బీసీలో చేర్చి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత జాతీయ డినోటిఫైడ్, నొమాడిక్, సెమి నోమాడిక్ ట్రైబ్స్ కమీషన్ సైతం తన నివేదికలో గొల్లకురమలను సంచార జాతులుగా గుర్తించి ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నప్పటికీ ప్రభుత్వాలు దీన్ని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రిజర్వేషన్ సాధనకై ఫిబ్రవరి 25న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు రాష్ట్రంలోని గొల్లకురుమలంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమితి నాయకులతో కలిసి బహిరంగ సభ కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో సమితి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ది రమేష్‌యాదవ్, మండల వర్కింగ్ అధ్యక్షుడు నరిగె లింగయ్య, నాయకులు ఏదండ్ల బాలేష్, రాజబాపు, మధూకర్, రాజు, రమేష్, మహేష్, రమేష్, సంతోష్, వినోద్ రాజ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నూరులో బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేస్తున్న జీకేఎన్‌ఎస్ నాయకులు

# రూ. కోట్ల సంపద అడవిపాలు..

**(మొదటిపేజీ తరువాయి)** పర్యవేక్షించడంలేదు. పడిపోయిన చెట్ల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా నమోదైన వాటిని డిపోలకు తప్పకుండా తరలించాలి. అయితే డిపోలకు తరలించడానికి రవాణ ఖర్చులు భారంగా మారాయి. సంబంధిత అటవీశాఖ అధికారులు ముందుగా చేతి నుంచి డబ్బులు ఖర్చుచేయాలి. డిపోలకు కలప తరలించిన తర్వాతనే వాటి రవాణ ఖర్చులు మంజూరు చేస్తున్నారు. ఆ నిధులు విడుదలలో జాప్యం జరుగుతోంది. నిధులు మంజూరు చేసినా.. వాటిలోనూ కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. చేతి నుంచి ముందుగా పెట్టిన రవాణ ఖర్చులు కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో .. రవాణ ఖర్చులకు భయపడిన కొందరు అధికారులు, సిబ్బంది పడిపోయిన చెట్ల వివరాలే నమోదు చేయడంలేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పడిపోయిన చెట్ల ఆనవాళ్లు కనిపించకుండా నిప్పుపెట్టి బూడిదపాలు చేస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

**అధికారుల నిర్లక్ష్యం.. స్మగ్లర్లకు కలిసొచ్చింది..**

ఖానాపూర్ మండలం నుంచి కొత్తగా ఏర్పడ్డ పెంబి, ఇచ్చోడ మండలం నుంచి కొత్తగా ఏర్పడ్డ సిరికొండ మండలాల సరిహద్దులో మందపల్లి, ఇటిక్యాల, పోచంపల్లి, రాయదుర్గం పరిసరాల్లో దట్టమైన అటవీప్రాంతం ఉంది. ఆ అడవుల్లో టేకు, ఏగిస, నల్లమద్ది వంటి డిమాండు కలిగి కిందపడిపోయిన వందల ఏళ్ల నాటి పెద్దపెద్ద వృక్షాలను తరలించడంలో అటవీఅధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇదంతా ఖానాపూర్ పరిధిలో ఉండటం వల్ల అక్కడి కలప డిపోకే తరలించాల్సి ఉన్నా.. దూరమైందని ఖానాపూర్ అటవీ అధికారులు వదిలేస్తున్నారు. ఆ అటవీప్రాంతం ఇచ్చోడ కలప డిపోనకు దగ్గరగా ఉన్నా.. తరలించడానికి అది తమ పరిధి కాదంటూ ఆ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విలువైన కలప భారీ మొత్తంలో దొంగలకు ఫలహారంగా మారుతుండగా.. మిగిలినదంతా చెదలుపట్టి పాడైపోయి అడవిపాలవుతోంది.

✹ జన్నారం అటవీడివిజన్ పరిధిలోని తాళ్లపేట, జన్నారం, ఇందన్‌పల్లి రేంజిలుండగా.. వాటిలో కూడా భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాటిని జన్నారంలోని కలప డిపోనకు తరలించాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దండేపల్లి మండలం తాళ్లపేట రేంజిలోని ఊట్ల పరిధిలో విలువైన టేకు చెట్లు పడిపోయాయి. వాటిని అలాగే వదిలేయడంతో కలప చెదలుపట్టి పాడైపోయింది. జన్నారం డిపోనకు కలప రావడం తగ్గిపోయింది.

✹ బెల్లంపల్లి అటవీ డివిజన్ పరిధిలో తిర్యాణి మండలంలో పడిపోయిన టేకు చెట్లను తరలించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఈ కలపను దొంగలు ద్విచక్ర వాహనాలపై దండేపల్లి మండలం గుండాల మీదుగా అక్రమంగా తరలించేస్తున్నారు.

✹ బోథ్ మండలం రఘునాథ్‌పూర్, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని నిగిని, వజ్జర్‌లలో దట్టమైన అటవీప్రాంతంలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. వాస్తవానికి వాటిని ఇచ్చోడకు తరలించాలి. కానీ.. ఇప్పటి వరకు ఆ ప్రాంతం నుంచి ఇచ్చోడకు తీసుకొచ్చిన పాపానపోలేదు. ఇదే అదునుగా భావించిన స్మగ్లర్లు పడిపోయిన వాటిని మహారాష్ట్ర, నిజామాబాద్, నిర్మల్‌లకు అక్రమంగా తరలించి అమ్మేసుకుంటున్నారు. అప్పుడప్పుడు పట్టుబడ్డ కలపను మాత్రమే ఇచ్చోడ కలప డిపోనకు తరలించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

✹ ఉట్నూర్ నుంచి మంచిర్యాల, కడెం నుంచి మంచిర్యాలకు వెళ్లే ప్రధాన రహదారికి సమీపంలో భారీగా టేకు వృక్షాలు పడిపోయాయి. రహదారికి ఆనుకుని పడిఉన్న వాటిని కూడా తరలించడంలేదు. రహదారి సౌకర్యం ఉన్నప్పటికీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కడెం మండలంలోని ఉడుంపూర్, గండిగోపాల్‌పూర్, జన్నారం మండలంలోని కవ్వాల్, సిర్పూర్-యు మండలంలోని లింగాపూర్ ప్రాంతాల్లోని దట్టమైన అడవుల్లోనూ భారీ టేకు, నల్లమద్ది, ఏగిస వృక్షాలు పడిపోయాయి. వాటిని తరలించడంలో అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు.

✹ కాగజ్‌నగర్ అటవీడివిజన్ పరిధిలోని బెజ్జూర్ మండలం కృష్ణపల్లి రేంజిలోని కృష్ణపల్లి, దింబ, గూడెం ప్రాంతాల్లో దట్టమైన అటవీప్రాంతంలో పడిపోయిన పెద్దపెద్ద టేకు వృక్షాలు తరలింపులో అటవీ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. బెజ్జూర్, కౌటాల, దహెగాం, సిర్పూర్-టి మండలాల్లో పట్టుబడ్డ కలపను మాత్రమే కాగజ్‌నగర్‌లోని కలప డిపోనకు తరలిస్తున్నారు.

**అప్రమత్తం చేస్తున్నాం..**

**ప్రభాకర్, డీఎఫ్‌వో, ఆదిలాబాద్.**

అడవుల్లో పడిపోయిన వృక్షాలను డిపోలకు తరలించడానికి అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. ఇటీవల ఉన్నతాధికారుల తనిఖీల్లోనూ ఇదే బయటపడింది. అందుకు తగిన నిధులు మంజూరు చేయడంలో ఎటువంటి ఇబ్బందులు లేవు. టేకుతో పాటు నల్లమద్ది, ఏగిస వృక్షాలు కూడా పడిపోయాయి. వాటిని డిపోలకు తరలించి వేలం నిర్వహిస్తాం.

---

# పాడి రైతును ముంచారు!



నిరుపయోగంగా మారిన శీతలీకరణ యంత్రం

**(మొదటి పేజీ తరువాయి)** వెలుగు, డీఆర్డీఏల ఆధ్వర్యంలో 2004 డిసెంబర్‌లో కేంద్రాన్ని తిరిగి ప్రారంభించారు. మంచిర్యాల, లక్సెట్టిపేట, దండేపల్లి, జన్నారం మండలాల్లోని రైతుల నుంచి పాలు సేకరించి వారికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఇందుకోసం రూ.16 లక్షలు వెచ్చించి 3 వేల లీటర్ల సామర్థ్యం గల బల్క్ కూలింగ్ యంత్రాన్ని, జనరేటర్‌ను కొని అట్టహాసంగా ప్రారంభించారు. ప్రారంభ సమయంలో మేలు జాతి పశువుల కొనుగోలు కోసం రైతులకు బ్యాంకులు, ఇతర సంస్థల ద్వారా ఆర్థిక సహాయం అందించేలా ఏర్పాటు చేస్తామని నాయకులు అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆ విషయాన్ని మరిచారు. దీంతో లక్ష్యం నీరుగారుతూ వచ్చింది.

**మూలిగే నక్కపై తాటికాయ చందంగా...**

నిర్వహణ లోపం కారణంగా అపసోపాలు పడుతున్న పాలశీతలీకరణ కేంద్రంలో గత సంవత్సరం జరిగిన అక్రమాలు పాడి రైతుల పాలిట శాపంగా మారాయి. రైతులకు అందజేయాల్సిన రూ.11 లక్షలతో పాటు అందులో పని చేసే సిబ్బంది వేతనాలు రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ 13 లక్షల సొమ్మును డెయిరీ ఇన్చార్జి మేనేజర్‌గా వ్యవహరించిన వెంకటేష్ స్వాహా చేయడంతో పాటు పాలకేంద్రంలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నప్పటికీ డెయిరీని గాడిన పెట్టి పాడి రైతులను ఆదుకోవడానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. పాలకేంద్రం నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు ఆదిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం కేంద్రం మూసివేతకు దారితీసిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక వైపు పాడి రైతులకు చెల్లించాల్సిన సొమ్ము చెల్లించడంలో మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు ఆడిటింగ్ పేరిట కాలయాపన చేస్తూ వచ్చారు.

**అక్రమాలు వెలుగులోకి వచ్చింది ఇలా**

గ్రామాల వారిగా పాలమిత్రులు సేకరించిన పాలను మొదట శీతలీకరణ కేంద్రానికి తరలిస్తారు. రెండు మూడు రోజులకు ఒకసారి పాలను ట్యాంకర్ల ద్వారా నిజామాబాద్‌కు పంపిస్తారు. సేకరించిన పాలకు విజయ డెయిరీ ఆధ్వర్యంలో ప్రతి 15 రోజులకు ఒకసారి పాడి రైతులకు చెల్లింపులు జరుగుతాయి. గత ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి రైతులకు చెల్లింపులు జరగలేదు. ఒక్కో యూనిట్‌కు గరిష్ఠంగా రూ.2 లక్షలకు పైగా చెల్లింపులు నిలిచిపోయేసరికి పశువులకు దాణ, మందులు, ఇతర అవసరాల కోసం పాడి రైతులు తమకు డబ్బులు చెల్లింపులు జరిగేలా చూడాలని మేనేజర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేష్‌కు విన్నవించారు. ప్రధాన కార్యాలయం నుంచి డబ్బులు రాలేదని ఆయన కొంత కాలం బుకాయించినట్లు రైతులు చెబుతున్నారు. విసిగిన రైతులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి యత్నించడంతో ట్యాంకర్ల ద్వారా తరలించిన పాలు చెడిపోయినందున డబ్బులు చెల్లించే అవకాశం లేదని తేల్చిచెప్పాడు.

**చోద్యం చూస్తున్న అధికారులు**

చెల్లింపులు జరగడం లేదన్న విషయాన్ని పాడి రైతులు గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రైతుల ఫిర్యాదు మేరకు డీఆర్డీవో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ స్వర్ణలత గతంలో లక్సెట్టిపేట పాలశీతలీకరణ కేంద్రానికి వచ్చి విచారణ నిర్వహించారు. అక్రమాలపై జిల్లా పాలనాధికారి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు నవంబర్‌లో ఆడిటింగ్ నిర్వహించారు. అక్రమాలు వెలుగులోకి వచ్చి తమ డబ్బు చేతికి వస్తుందని భావించిన రైతులకు నిరాశే ఎదురైంది. విచారణ జరిగి రెండునెలలు గడుస్తున్నా ఎలాంటి ఫలితం లేకపోవడం, మరో వైపు పులిమీద పుట్రలా పాల కేంద్రాన్నే మూసి వేయడంతో రైతులకు దిక్కు తోచని పరిస్థితి నెలకొంది.



పాల కేంద్రం మూసి వేయడంతో పాలమిత్రులు తాము గ్రామాల్లో సేకరించిన పాలను ప్రతిరోజు ఇలా ఆటోలో నిర్మల్‌లోని ఓ హోటల్‌కు తరలిస్తున్నారు. లక్సెట్టిపేట మండలంలోని వెంకట్రావుపేట, దౌడేపల్లి, దండేపల్లి మండలం రాజంపేట, తాళ్లపేట గ్రామాల్లో సేకరించిన 400 లీటర్ల పాలను దూరాభారం లెక్క చేయకుండా పాలమిత్రులు ఇలా తరలిస్తున్నారు. కేవలం నాలుగు గ్రామాల నుంచి సేకరించిన పాలు 400 లీటర్లు. అలాంటిది ఏకంగా 35 గ్రామాల నుంచి పాలు సేకరించే కేంద్రం కునారిల్లడం అధికారుల వైఫల్యానికి అద్దం పడుతోంది.

**దశాబ్దాలుగా పాడిని నమ్ముకున్నాం**

**- టి.సుబ్బారావు, పాల ఉత్పత్తిదారు, లక్సెట్టిపేట**



మూడు దశాబ్దాలుగా పాడిని నమ్ముకుని 500లకు పైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ప్రతి రోజూ పాల కేంద్రానికి పది లీటర్ల పాలు సరఫరా చేసేవాడిని. అర్ధాంతరంగా కేంద్రాన్ని మూడివేయడం అన్యాయం. కేంద్రాన్ని తిరిగి తెరిపించి పాడి రైతులకు న్యాయం చేయాలి.

**వెంటనే తెరిచేలా చర్యలు తీసుకోవాలి**

**- గోపతి వినోద్, వెంకట్రావుపేట**



కేంద్రాన్ని మూసి వేసి పాల ఉత్పత్తిదారులను నిలువునా ముంచారు. వెంకట్రావుపేట, దౌడేపల్లి గ్రామాల పరిధిలో ప్రతిరోజు 150 లీటర్లకు పైగా పాలను సేకరించి కేంద్రానికి తరలించేవాడిని. ప్రస్తుతం నాకు రూ.94 వేల వరకు డెయిరీ బకాయి పడింది. అప్పులు చేసి కేంద్రానికి పాలు పోస్తే ఇలా మోసం చేయడం ఎంత వరకు సమంజసం. పాడి రైతులు, డెయిరీలో పని చేసిన సిబ్బందికి బకాయిలు చెల్లించి డెయిరీని తిరిగి తెరిపించాలి.

**సంక్రాంతిలోగా పరిష్కారం**

**జి.స్వర్ణలత, ప్రాజెక్టు మేనేజర్, డీఆర్డీవో, మంచిర్యాల**

పాడి రైతులకు బిల్లుల చెల్లింపుతో పాటు పాల కేంద్రంలో జరిగిన అక్రమాలపై ఆడిట్ రిపోర్టు జిల్లా పాలనాధికారికి అందజేశాం. అక్రమాలపై రెండు మూడు రోజుల్లోచర్యలు తీసుకునే అవకాశం ఉంది. నిర్వహణలో ఇబ్బందుల దృష్ట్యా నేరుగా విజయ డెయిరీ ఆధ్వర్యంలో పాల కేంద్రం నడిపేందుకు ఇప్పటికే తీర్మానం చేశాం. సంక్రాంతిలోగా పూర్తిస్థాయిలో నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.

---

# మద్యం తాగి నడిపితే.. ప్రమాదం తథ్యం..

**మంచిర్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే:** మంచిర్యాల జిల్లాలో 69 మద్యం దుకాణాలు, ఆరు బార్లు, ఒక క్లబ్‌లో రోజుకు సుమారు రూ. కోటి కంటే ఎక్కువే మద్యం విక్రయాలు జరుగుతున్నాయి.

✦ చివరి నెల డిసెంబరులో రూ.35.93 కోట్లతో 2016 కంటే రూ.10 కోట్లు ఎక్కువగా విక్రయాలు జరిపి ఎప్పుడు లేనంతగా రికార్డులు నమోదు చేసుకుంది.

✦ అక్టోబరులో దసరాతో పాటు సింగరేణి ఎన్నికలు తోడవ్వటంతో ఆ నెలలో రూ. 37.51 కోట్ల విక్రయాలు చోటుచేసుకున్నాయి.



డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న పోలీసులు

గుడిపేట మద్యం డిపో నుంచి జిల్లాలోని వ్యాపారులకు ఇన్వాయిస్ ధరపై రూ.366.50 కోట్ల విలువైన మద్యం సరఫరా చేయగా వీటిని వ్యాపారులు 21 శాతం కలుపుకొని ఎంఆర్‌పీ ప్రకారం విక్రయించాల్సి ఉంటుంది. ఈ మొత్తం ఎంఆర్‌పీ ధరల ప్రకారం లెక్కగడితే సుమారుగా రూ. 443.5 కోట్లుగా అధికారులు ధ్రువీకరిస్తున్నారు.

**మద్యం మత్తు ప్రమాదాలకు ఊతం..**

జిల్లాలో 2017లో రోడ్డుప్రమాదాల ద్వారా 125 మంది మృత్యువాత పడగా వీరిలో 65 మంది మృతికి మద్యం తాగడమే కారణమని పోలీసులు గుర్తించారు.

జరుగుతున్న ప్రమాదాలు ఎక్కువగా రాత్రి సమయాల్లోనే జరుగుతున్నాయి. అది కూడా మద్యం మత్తులో అతి వేగంతో వాహనాలు నడిపి ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నారు. మద్యం తాగడం ద్వారా రోడ్డు ప్రమాదాలతో పాటు అనారోగ్యానికి గురవుతున్న వారు వేలల్లోనే ఉన్నారు.

**జిల్లాలో గతేడాది జనవరి నుంచి డిసెంబరు వరకు నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు**


| నెల | నమోదైన కేసులు |
|---|---|
| జనవరి | 197 |
| ఫిబ్రవరి | 87 |
| మార్చి | 201 |
| ఏప్రిల్ | 141 |
| మే | 185 |
| జూన్ | 126 |
| జూలై | 91 |
| ఆగష్టు | 141 |
| సెప్టెంబరు | 90 |
| అక్టోబరు | 115 |
| నవంబరు | 622 |
| డిసెంబరు | 529 |
| **మొత్తం** | **2525** |

---

# ప్రజల కోసమే పార్టీ కార్యాలయం ఏర్పాటు

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** ప్రజలకోసమే పార్టీ కార్యాలయాలు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి జోగురామన్న తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న షాదీముబారక్, కల్యాణ లక్ష్మీ వంటి పథకాలతోపాటు ఇతర పథకాలు ప్రజల దరిచేలా ఈ కార్యాలయాలు పనిచేస్తాయని వివరించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ కాలనిలోని ఏర్పాటుచేసిన తెరాస కార్యాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. పథకాల లబ్ధి పొందేందుకు దరఖాస్తు ఫారాలు నింపడం తెలియని వారికి ఈ కార్యాలయాలు ఉపయోగపడతాయని వివరించారు. మార్కెట్‌యార్డు సమీపంలోనూ ఆ ప్రాంత వాసుకోసం మరో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆరె రాజన్న, స్త్రీ, శిశుసంక్షేమశాఖ నిర్వాహకురాలు కస్తాల ప్రేమల, పార్టీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ సాజిదొద్దీన్, జహుర్, సిరాజ్‌ఖాద్రీ, జహీర్‌రంజాని, అతర్, బాశంవర్గింగ్, కాలనీ నాయకులు మక్బూల్, జాఫర్, ముబీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'స్వచ్ఛ సర్వేక్షణ్'.. కావాలి సాకారం






- వందశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న బల్దియాలు
- రేపటి నుంచి పురపాలికల్లో పర్యటించనున్న కేంద్ర బృందాలు
- 4 వేల మార్కుల ఆధారంగా సర్వే ● పురస్కారం సొంతం కావాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే


పైలట్ ప్రాజెక్ట్ కింద నిర్మించిన వీబోర్డు మరుగుదొడ్డి

మహిళల ఆత్మగౌరవానికి భంగం కలగకూడదని, బహిరంగ మల, మూత్ర విసర్జనతో వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యానికి గురవుతుండడంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్‌కు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలోనే మూడేళ్ల కిందట వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రారంభించింది. అన్ని పురపాలికలు, గ్రామాల్లో వందశాతం నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచడం కోసం స్వచ్ఛంద సంస్థలు, ఐకేపీ సభ్యులు, విద్యార్థులతో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. దీంతో ప్రజల ఆలోచనల్లోనూ గణనీయమైన మార్పు రావడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని బల్దియాల్లో దాదాపు వందశాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. మొదట విడతగా క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటించి ప్రశంసాపత్రాలు అందిస్తున్నాయి. రెండో విడత కింద 'స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారం' ఎంపిక కోసం కేంద్ర బృందాలు గురువారం నుంచి అన్ని పురపాలికల్లో పర్యటించనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకోవడానికి మన బల్దియాలు సిద్ధం కావాల్సిన అవసరంపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

## పురస్కారానికి ఎంపిక ఇలా

- ఈ సర్వేలో మొత్తం 4 వేల మార్కులు ఉంటాయి
- స్వచ్ఛతపై కిందిస్థాయి అధికారుల పనితీరుకు 1400 మార్కులు (సకాలంలో చెత్తను సేకరించుట, తరలించుట, తడి, పొడిచెత్తలను ఎరువుగా మార్చే ప్రక్రియ, బహిరంగ మల, మూత్ర విసర్జన తదితర అంశాలు)
- సర్వే బృందం స్వయం పరిశీలన 1200 మార్కులు ( సర్వే బృందం ఎంచుకున్న 12 చోట్ల తనిఖీలు, 12 చోట్ల సామూహిక మరుగుదొడ్లు, 2 చోట్ల మార్కెట్ ప్రాంతాల్లో పరిశీలన)
- స్థానికుల అభిప్రాయాలు 1400 మార్కులు


మందమర్రిలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధికారులు

(స్వచ్ఛత ర్యాంకింగ్ కోసం బల్దియా పోటీలో ఉన్న విషయం, పారిశుద్ధ్య పరిస్థితి మెరుగు, చెత్త సేకరణపై సంతృప్తి, వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకోవడం వల్ల బహిరంగ మలమూత్ర విసర్జన నిర్మూలనపై 5 ప్రశ్నలు సంధిస్తారు.. పరిశీలనలో వీటికి సంతృప్తికరమైన సమాధానాలు లభిస్తే స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారానికి ఎంపిక చేశారు.

| పురపాలకపేరు | దరఖాస్తులు | అర్హులు | పూర్తి అయినవి | శాతం | మొదటి విడత సర్వే |
|---|---|---|---|---|---|
| 1) మందమర్రి | 2527 | 1912 | 1912 | వంద | పూర్తి |
| 2) మంచిర్యాల | 3666 | 3352 | 3352 | వంద | పూర్తి |
| 3) బెల్లంపల్లి | 2187 | 1527 | 1527 | వంద | పూర్తి |
| 4) కాగజ్‌నగర్ | 4045 | 2660 | 2660 | వంద | లేదు |
| 5) నిర్మల్ | 3353 | 1724 | 1724 | వంద | లేదు |
| 6) ఆదిలాబాద్ | 5011 | 4211 | 4211 | వంద | పూర్తి |
| 7) భైంసా | 3200 | 2630 | 2630 | వంద | పూర్తి |

### మందమర్రి: స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు

మూడోగ్రేడ్ బల్దియా మందమర్రిలో 24 వార్డులు ఉన్నాయి. సింగరేణి పరిధిలో 8, మిగిలిన 16 వార్డులు పురపాలిక పరిధిలో ఉన్నాయి. పట్టణంలో 12,865 ఇళ్లు ఉండగా అందులో 52,381 మంది నివసిస్తున్నారు. గతేడాది ఆగస్టు నాటికి 1912 మంది మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకున్నారు. అంతకు ముందు నిర్మాణాలను చేపట్టలేని 42 మందికి యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ సొసైటీ, జీవనధార స్వచ్ఛంద సంస్థ సహకారంతో సిమెంట్, ఫైబర్‌ల మిశ్రమం రూపొందించిన సామగ్రి, భారరహిత గోడలు (లైట్‌వేయిట్), గమ్ సిమెంట్‌ను ఉపయోగించి పర్యావరణహిత మరుగుదొడ్డిని నిర్మించి ఇచ్చారు. ఇదే సమయంలో పట్టణంలోని ఐదుగురు గుత్తేదారులతో చర్చించి ప్రభుత్వం అందించే రూ. 12 వేలకే మరుగుదొడ్డి పూర్తిగా నిర్మించేలా వారిని ఒప్పించారు. మరుగుదొడ్డి నిర్మించుకోలేని 200 మంది నిరుపేద లబ్ధిదారులను ఎంపిక చేశారు.

### బెల్లంపల్లి: ప్రత్యేక బృందాల పర్యవేక్షణ

రెండో గ్రేడ్ పురపాలిక బెల్లంపల్లిలో 34 వార్డుల్లో 14,200 గృహాలు ఉన్నాయి. అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించడంతో ప్రభుత్వం నిర్దేశించిన నాటికి లక్ష్యాన్ని చేరుకున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ అధికారులు మొదటి విడత సర్వే నిర్వహించారు.

### మంచిర్యాల: ప్రణాళికతో ముందుకు

మొదటిగ్రేడ్ బల్దియా మంచిర్యాలలో 32 వార్డుల్లో 17,500 నివాస గృహాలు ఉన్నాయి. గత డిసెంబర్ నాటికి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ప్రతివార్డుకు ఒక పురపాలిక ఉద్యోగిని ఇన్‌ఛార్జిగా నియమించి నిత్యం సమీక్షించారు. రంగంపేట, అండాలమ్మ కాలనీలో మరుగుదొడ్డి నిర్మించుకోలేని 80 మందిని గుర్తించారు. ఐకేపీ ద్వారా నిధులు సమీకరించి గుత్తేదారులతో నిర్మాణాలను పూర్తి చేయించారు.

### కాగజ్‌నగర్: అధికారుల తడబాటు

మూడోగ్రేడ్ పురపాలిక కాగజ్‌నగర్‌లో 28 వార్డుల్లో 12,638 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడ వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే అధికారులు పూర్తయినట్లు ఆగస్టులో ప్రకటించారు. లబ్ధిదారులకు ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. మరికొంత మంది లబ్ధిదారులు మరుగుదొడ్లను నిర్మించుకోలేదు రూ.1.20 కోట్లు నిధులున్నా మంజూరు చేయడంతో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.



*పాలకవర్గం లేని మందమర్రి పురపాలికలో ముందుగా వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు నత్తనడక సాగాయి. దీంతో అప్పటి పురపాలిక కమిషనర్ గంగాధర్ ప్రత్యేక చొరవ చూపారు. పట్టణంలోని ఐకేపీ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, యువకుల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించి లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకువచ్చారు. 217 మంది లబ్ధిదారులు మరుగుదొడ్లను నిర్మించుకునేందుకు రూ. 32 లక్షలు రుణం ఇచ్చి ఆదర్శంగా నిలిచారు.*



కాగజ్‌నగర్ 24వ వార్డుకు చెందిన సయ్యద్ హర్షద్, వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకునేందుకు రూ. 15 వేలు అప్పు చేశారు. ఇంత వరకు బిల్లు చెల్లించలేదు. దీంతో బిల్లుల కోసం మూడు నెలలుగా చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు. అయినా అధికారులెవ్వరు పట్టించుకోలేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధం అవుతున్నారు.

### నిర్మల్: ముందడుగు..

రెండోగ్రేడ్ బల్దియా నిర్మల్ పురపాలికలో 17546 ఇళ్లు ఉన్నాయి. ప్రతి ఇంట్లో మరుగుదొడ్ల నిర్మించుకోవాలంటూ విద్యార్థులు, ఐకేపీ, స్వచ్ఛంద సంస్థల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించడం సత్ఫలితాలు ఇచ్చింది. వందశాతం నిర్మాణాలు పూర్తి అయినట్లు అధికారులు ప్రకటించిన అనంతరం మరో 48 మంది దరఖాస్తు చేసుకున్నారు.

### ఆదిలాబాద్: ఐకేపీ తోడ్పాటుతో పూర్తి

మొదటిగ్రేడ్ పురపాలిక ఆదిలాబాద్‌లో 25 వేల కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయడంతో సకాలంలో వందశాతం నిర్మాణాలు పూర్తయ్యాయి. మరుగుదొడ్డి నిర్మించుకోలేని కొంత మంది లబ్ధిదారులకు ఐకేపీ నుంచి రూ.50 లక్షల రుణం ఇప్పించారు. బిల్లులు వచ్చిన అనంతరం లబ్ధిదారులు అప్పుగా తీసుకున్న డబ్బులను తిరిగి చెల్లించారు.

### భైంసా: తిరుగులేని ప్రశంస

మూడోగ్రేడ్ పురపాలిక భైంసాలో 9800 నివాసాలు ఉన్నాయి. గతేడాది జనవరి నాటికే వందశాతం నిర్మాణాలను పూర్తి చేయడంతో కేంద్ర ప్రభుత్వ అధికారులు సర్వే నిర్మించి ప్రశంసాపత్రానికి ఎంపిక చేశారు. ఇక్కడ ఇళ్లు చిన్నవిగా ఉండడం, స్థలం లేకపోవడంతో అధికారులు 48 చోట్ల సాముహిక మరుగుదొడ్లను నిర్మించారు. ఆరు చోట్ల సులభ్ కాంప్లెక్స్, రెండు షి మరుగుదొడ్లను నిర్మించారు.


భైంసాలో సామూహిక మరుగుదొడ్లు

# చేప చిక్కాలి.. కడుపు నిండాలి



- నీరు కరవు.. బతుకు బరువు
- ఎడారిలా గోదావరి, నెమ్మదించిన ప్రాణహిత
- జీవనపోరాటంలో మత్స్యకారులు

**గలగల.. పారే గోదావరి.. నీరు లేక నిర్జీవంగా మారింది. చకచకా.. పరుగులు తీసే ప్రాణహిత ప్రవాహం మందగిస్తోంది. వర్షాభావ పరిస్థితులకు చెరువులు, కుంటల్లో నీరు రోజురోజుకు అడుగంటుతోంది. జల వనరులను ఆధారంగా చేసుకొని చేపలవేటతో జీవనోపాధి సాగించే ఎంతో మంది మత్స్యకారుల కుటుంబాల బతుకు భారంగా మారుతోంది. జిల్లాకు తూర్పున ప్రాణహిత, దక్షిణాన ప్రవహించే గోదావరి నదుల్లో చేపలవేట సాగిస్తూ జీవనం గడిపే మత్స్యకారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న దీనస్థితి, వారి జీవన విధానంపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం.**

కోటపల్లి, న్యూస్‌టుడే

రెక్కాడితే కాని డొక్కాడని నిరుపేద కుటుంబాలకు చెందినవారు వారంతా. కేవలం కులవృత్తినే జీవనాధారంగా చేసుకొని మరో ఉపాధిలేక కడుదైన్య పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. రాత్రిపూట దీపం వెలుతురులో సాగించే వేటలో నాలుగు చేపలు చిక్కితే అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకునే వారి పరిస్థితి రోజురోజుకు అత్యంత దయనీయంగా మారుతోంది.. బతుకు మార్గం చూపిన గోదావరి, ప్రాణహితలు నానాటికి ఎండుముఖం పడుతుండటంతో వీటిపై ఆధారపడ్డ అనేకమంది మత్స్యకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## పరివాహకం కన్నీటిసంద్రం

జిల్లాలో గోదావరి పరివాహక ప్రాంతాలైన ఎర్రాయిపేట్ మొదలు బోరంపల్లి, కొల్లూర్, రాంపూర్, దేవులవాడ, లక్ష్మిపూర్, మరో వైపు ప్రాణహిత సరిహద్దు గ్రామాలైన అర్జునగుట్ట, అన్నారం, సిర్సా, జనగామ, వెంచపల్లి, సూపాక గ్రామాలతో పాటు సరిహద్దు వేమనపల్లి మండలంలోని కల్మలపేట్, గ్రామాలకు చెందిన అనేక మంది మత్స్యకారులు చేపలవేటను సాగిస్తూ తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. సుమారు 500కు పైగా కుటుంబాలు రెండు నదుల ద్వారా ఏటా ఆరు నెలల పాటు చేపలవేటను సాగిస్తూ ఉపాధి పొందుతున్నారు.

- ఈసారి గోదావరి చుక్కనీరులేక వెలవెలబోతుండడంతో చేపలవేట పూర్తిగా కనుమరుగైంది.
- కేవలం మత్స్యకారుల కోసమేనన్నట్లు ఎండాకాలంలో సైతం తన ప్రవాహాన్ని కొనసాగిస్తూ మరో మూడు నెలలు పాటు ఉపాధి కల్పించే ప్రాణహిత నదిలో సైతం నీరు మందగిస్తుండటం వారిని కూలీ పనులకు వెళ్లేలా చేసింది.
- చేపలవేట నిలిచి ప్రత్యామ్నాయంగా మరో పనిలేక ఆ కుటుంబాల వారు నదుల ఒడ్డున ఉన్న వ్యవసాయక్షేత్రాల్లో కూలీపనులకు వెళ్తున్నారు.
- డిసెంబరు మొదలు మే నెల చివరి వరకు నదులనే ఆధారంగా జీవించేవారు రెండు నెలలకే తమ ఇళ్లకు తిరుగుముఖం పడుతున్నారు.


చేపలవేటలో తల్లిదండ్రులు..ఆటల సందడిలో పిల్లలు (నదీ తీరంలో చిన్నారుల ఆటలు)


చీర అడ్డం ఉంటేనే అన్నం ఉడికేది (నదీతీరంలో వంట చేస్తున్న మహిళ)


మీకు సైతం ఏర్పాట్లు (నదిలో కోడి పిల్లల కోసం ఏర్పాటుచేసిన గూళ్లు)


ప్రాణహిత నదిలో క్రమేపి తగ్గుతున్న నీటిప్రవాహం


చుక్కనీరులేక బోసిపోయి కనిపిస్తున్న గోదావరి

### ఆరు నెలలు ఇంట్లో ఆరు నెలలు నదీతీరంలో



డిసెంబరు ప్రారంభమవుతుందటే చాలు ముల్లె మూటను సర్దుకొని, పిల్లపాపలను చంకనబెట్టుకొని నదుల వైపు పయనిస్తారు. తిరిగి వర్షాలు మొదలయ్యే జూన్ వరకు ఇంటి వైపు చూడరు. పురుగు పుట్ర.. చలి, ఎండకు ప్రకృతితో ఎదురీదుతూ చేపలవేటను కొనసాగిస్తారు. రాత్రి తొమ్మిదైతే చాలు గజగజ వణికే చలిలో నదిలో దిగి నీటినంతా తెలియాడితే నాలుగు చేపలు వలలో చిక్కితేనే తెల్లారి కడుపు నిండేది.

### ఒకరికొకరు తోడుగా..



చేపలవేట ఆషామాషి కాదన్నది వారుపడేకష్టాన్ని ప్రత్యక్షంగా చూస్తేనే తెలిసేది. నీటి ప్రవాహం ఎదురీతకు ఒకరు.. పడవను తోలేందుకు మరొకరు. ఇలా పడవలో బయలుదేరి నదీలో వలను విసురుతారు. ఇలా ఓ అరగంటపాటు వేచిచూసి వలనుపైకి ఇగ్గుతారు. ఈ క్రమంలో చేపచిక్కితే చిక్కినట్లు లేకుంటే లేదు. ఇలా పలుమార్లు నదిలో వలలు వేయడం, పైకి ఇగ్గడంతో భుజాలు నొప్పులు పెడుతుండగా ఈ క్రమంలో వలల తీగలు చేతులకు గీరుకుపోయి ఎవరి చేతులను చూసినా గాయాతోనే కనిపిస్తాయి. చేపలవేటలో భార్య..భర్తలు తోడైతేనే ఆ రోజు గట్టేక్కేది. కుటుంబంలో ఒకరికొకరు సహకరించుకుంటూ చేపలవేటతో కుటుంబాన్ని నెట్టుకొస్తారు.

### కాయకష్టం దళారులపాలు



ఆకలి, నిద్రకు దూరమై రాత్రంతా నదిలో తిరిగితే నాలుగు చేపలు చిక్కుతాయి. వాటిని అమ్ముకునేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడం దళారులకు కలిసివస్తోంది. జాలరులకు కిలోకు రూ. 80 దక్కితే దళారులకు రూ. 250 వరకు చేతికి అందుతుంది. స్థానికంగా విక్రయించే వెసులుబాటు లేకపోవడం, రవాణా ఖర్చులకు సాహసించే పరిస్థితులు లేకపోవడంతో చివరికి రోజువారీ కూలీకూడా గిట్టుబాటు కాదని వారు చెప్పేమాటలు వినేవారికి కంటనీరు తెప్పిస్తుంది.

### ప్రభుత్వం ఆదుకోవాలి



**మంచర్ల పోచం, జాలరి**

మా గ్రామంలోని వారంతా చేపలవేటపైనే ఆధారపడి బతుకుతున్నారు. గంటల తరబడి కష్టపడితే నాలుగు చేపలు చిక్కితే అమ్ముకొని కుటుంబాలను పోషించుకునేవాళ్లం. కరవు ఈ విధంగా వస్తుందని ఊహించలేకపోయాం. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మేము జీవించడం కష్టంగా మారింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

### కూలీ పనులకు వెళ్తున్నాం



**బోరే గంగక్క, మత్స్యకారిణి**


ప్రాణహితలో నీటి ప్రవాహం తగ్గడంతో చేపలవేట నిలిచిపోయి నాలుగు నెలల పాటు దొరికే ఉపాధి కోల్పోయాం. కేవలం చేపలవేటను సాగించే మాకు మరో పనిలేక పోవడంతో పత్తి తీసేందుకు నది ఒడ్డున ఉన్న పంటచేలలోకి కూలీపనులకు వెళ్తున్నాం. చేపలవేటతో ఇప్పుడు నాలుగు పైసలు సంపాదిస్తేనే వర్షాకాలం గడిచేది. అలాంటిది చేపలవేట నిలిచిపోవడం పస్తులుంచేలా చేస్తోంది.

### గుడారాల్లోనే గడపాలి



వెంచపల్లి మొదలు అర్జునగుట్ట వరకు సుమారు 50 కిలోమీటర్ల మేర ప్రాణహిత నది పొడవునా ఆరు నెలల కాలంలో నదిలో ఎక్కడచూసినా జాలరుల గుడారాలే కనిపిస్తాయి. చిన్నపాటి కొయ్యలను ఆధారంగా చేసుకొని గుడిసే మాదిరిగా తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేసుకుంటారు. వంట చేసుకునేందుకు, స్నానాలు చేసేందుకు వేర్వేరుగా వసతులను ఏర్పరచుకొని నది ప్రాంతాన్ని తమ ఆవాసాలుగా మలుచుకుంటారు.

### ఏటా రూ.20 వేల పెట్టుబడి తప్పదు..



చేపలవేట కుల వృత్తి అన్నమాటే గాని పెట్టుబడి పెడితేనే ఆ గౌరవం దక్కేది అన్నట్లు మారింది మత్స్యకారుల జీవితం. నదిలో నాలుగైదు కిలోమీటర్లు తిరిగేందుకు పడవల అవసరం ఎంతుంటుందో చేపలను పట్టేందుకు వలల పనిసైతం అంతే ఉంటుంది. ఒక్కో పడవకోసం రూ. 25 వేలు ఖర్చవుతుండగా వలల కోసం ఏటా మరో 20 వేల చొప్పున పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. చేపలకోసం నదిలో వలలు వేసే సమయంలో రాయి, రప్పలకు తట్టుకొని చిరగడం, తీగలు సాగడం తదితర ఇబ్బందులు ఉండనే ఉంటాయి. సంవత్సరానికి ఓ సారి వలలు మార్చడం తప్పనిసరి.

# సృజనశీల.. నృత్యబాల

- మయూరాలను మరిపించేలా నృత్యం
- గిన్నీస్, తెలుగు, ఇండియన్ టాలెంట్ రికార్డుల్లో పేరు లిఖించుకున్న చిన్నారులు

మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే


సామూహిక నృత్య ప్రదర్శనలో చిన్నారులు

**వారందరూ పది నుంచి పన్నెండేళ్లలోపు చిన్నారులే. వారు నృత్యం చేస్తుంటే కనురెప్ప వాల్చలనిపించదు. ముఖ కవళికలతో కట్టిపడేస్తారు. నాట్యంతో మంత్రముగ్ధుల్ని చేస్తారు. అంతరిస్తున్న శాస్త్రీయ నృత్యాలను వారి ప్రతిభతో వెలుగులోకి తీసుకొస్తూ మైమరపిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలు జాతీయ, అంతర్జాతీయ సంస్థల ఎదుట తమ నృత్యాన్ని ప్రదర్శించి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణలో తెలుగు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డుతో పాటు ఇండియన్ టాలెంట్ రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఆయా ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నారు. ఇందులో అంధ విద్యార్థులు ఉండటం విశేషం. కూచిపూడి నృత్యాలతో అలరిస్తూ రికార్డుల పరంపర కొసాగిస్తున్న నాట్య మయూరాల గురించి 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం...**

### మహాలక్ష్మి మనసంతా నాట్యంపైనే



మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన కల్వకోట భవాని-శ్రీరాం దంపతుల కుమార్తె మహాలక్ష్మి స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. 6వ ఏటా నుంచే తల్లిదండ్రుల కోరిక.. నాట్యంపై తనకున్న మక్కువతో స్థానిక ఓ శిక్షకుడి వద్ద చేరింది. రాష్ట్రస్థాయి క్లాసికల్ నృత్య పోటీల్లో మొదటిస్థానం కైవసం చేసుకుంది. 2016లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు కోసం భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సిలికానంధ్ర సంయుక్తంగా విజయవాడలో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో భాగస్వాము రాలైంది. గత డిసెంబరులో వరంగల్ జిల్లాలో భాష సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన నృత్యాభిషేకంలో తన ప్రదర్శన అలరించింది. తెలుగు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు ఇండియన్ టాలెంట్ రికార్డులో తన పేరును లిఖించుకుంది.

### సునాయసంగా సునయన



మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సుగుణ-శ్రీనివాస్ దంపతుల కుమార్తె సునయన నృత్యాలను సునాయసంగా నేర్చేసుకుంటుంది. స్థానిక పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది శాస్త్రీయ నృత్యాలపై మక్కువతో గతేడాది నుంచి శిక్షణ తీసుకోవడం ప్రారంభించింది. కూచిపూడిలోని అన్ని భంగిమలు అవలీలగా వేస్తూ ఆకట్టుకుంటుంది. పలు సంస్థల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన నృత్య పోటీల్లో ప్రశంసలు అందుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి సన్నిధి పుట్టపర్తిలో ఇచ్చిన ప్రదర్శనతో ఆస్వామి ఆశీస్సులు తీసుకుంది. ఇటీవల వరంగల్ జిల్లాలో జరిగిన ఓరుగల్లు నృత్యోత్సవంలో పాల్గొని ఆకట్టుకుంది. రికార్డు కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శన తన పేరును సుస్థిరం చేసుకుంది.

### ప్రతిభకు అడ్డురాని అంధత్వం..



చెన్నూర్ మండలం నర్సక్కపేట గ్రామానికి చెందిన అంజలి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడికి చెందిన దీపికలు పుట్టుకతోనే అంధులు ఇది చూపుకే గానీ ప్రతిభకు అడ్డురాదని నిరూపిస్తున్నారు. స్థానిక సాయి అంధుల పాఠశాలలో తొమ్మిది, ఏడో తరగతి చదువుతున్న వీరు వివిధ రంగాల్లో రాణిస్తూ అబ్బురపరుస్తున్నారు. తమ గురువు సహాయంతో విద్యలో రాణిస్తూనే యోగా, జానపద, శాస్త్రీయ నృత్యాల్లో సత్తాచాటుతున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఈ చిన్నారులు తమ స్వరకంఠంతో గీతాలు ఆలపిస్తూ ఆశ్చర్యపరుస్తున్నారు. అంధురాలైనా ఇటీవల జరిగిన ఓరుగల్లు నృత్యోత్సవంలో పాల్గొని ప్రతిభతో ఆహుతులను అలరించారు. తమ నృత్యంతో ఔరా అనిపించారు. జిల్లాలో వివిధ వేదికలపై ప్రదర్శనలతో ఆకట్టుకున్న అంజలి, దీపికలు తెలుగు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు ఇండియన్ టాలెంట్ రికార్డులో పేరు నమోదు చేసుకుని సత్తాచాటుతున్నారు. కళారంగంలో రాణిస్తూనే ఒకరు ఉపాధ్యాయురాలిగా, మరొకరు ఇంజినీర్‌గా స్థిరపడాలని, ఆదిశగా కృషి చేస్తామని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు.

### మొదటి ప్రయత్నంలోనే చర్విత చరిత్ర



ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమరేందర్‌రెడ్డి-రజిత దంపతులు కూతురు చర్విత మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 5వ తరగతి చదువుతోంది. చిన్ననాటి నుంచే నృత్యాలంటే చాలా ఇష్టపడేది. టీవీలో చూస్తూ నృత్యం నేర్చుకునేది. అలా శిక్షణ పొందుతూ.. పలు వేదికల్లో, పాఠశాలల్లో ప్రదర్శన ఇచ్చేది. తన కూతురు నృత్యంపై చూపిస్తున్న ఆసక్తిని చూసి గత ఏడాది జులైలో స్థానిక శిక్షకుడి వద్ద శిక్షణ ఇప్పించారు. నృత్యంపై ఇష్టంతో ఐదు నెలల్లోనే పట్టు సాధించింది. మొట్టమొదటిసారిగా ఇతర జిల్లాకు వెళ్లి ప్రదర్శన ఇవ్వడంతో పాటు రాష్ట్ర, జాతీయస్థాయి సంస్థలో చోటు సంపాదించుకుంది. చర్విత ప్రతిభ చూసి సంస్థ ప్రతినిధులు అభినందించారు.

### అరుణసరయుకు అడ్డేలేదు..



ఓవైపు చదువులో ప్రథమస్థానం సాధిస్తూనే మరో వైపు తనకిష్టమైన నృత్యలో రాణిస్తోంది అరుణసరయు. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన విశాలి-ఏవీ రావు దంపతుల కూతురైన సరయు స్థానిక పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. ఏడాది నుంచి శాస్త్రీయ నృత్యంపై మక్కువతో శిక్షణ తీసుకొంటుంది. పాఠశాలల్లో ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాల్లో తన ప్రదర్శనతో ఆకట్టుకుంటూ అలరిస్తోంది. చందమామలాంటి ముఖంతో ఆకట్టుకునే విధంగా నాట్యం చేస్తూ అలరిస్తోంది తొలిసారిగా ఇతర జిల్లాలో ప్రదర్శన ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. కోదండరాముడి గీతాలకు నృత్యాభిషేకం చేసి ఆహుతులను, గుర్తింపు పొందిన పలు సంస్థల ప్రతినిధులతో ప్రశంసలు అందుకుంది. అతిథుల చేతులమీదుగా సన్మానంతో పాటు జ్ఞాపికలను అందుకుంది.




## సమస్యల పరిష్కారానికి చర్యలు

**గోదావరిఖని:** తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్జీ-1 జీఎం విజయ్‌పాల్‌రెడ్డి వెల్లడించారు. మీట్ యువర్ జీఎం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జీఎం కార్యాలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కార్మికులు, మహిళా ఉద్యోగులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. 12 మంది కార్మికులు వివిధ సమస్యలను విన్నవించారు. నివాస గృహాల మరమ్మతులు, బదిలీలు.. ఉపరితల విభాగాల్లో పని కల్పించే సమస్యలను జీఎం దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరిస్తానని వెల్లడించారు.

# సీఎండీ చూపు కోల్‌ఇండియా వైపు

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే

**ప్రపంచంలోనే అతి పెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన కోల్ ఇండియా (సీఐఎల్) ఛైర్మన్ పదవి కోసం సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ దరఖాస్తు చేసుకున్నారు. ఇంతకు ముందు కోల్ ఇండియాలో ప్రతిష్ఠాత్మకమైన ఛైర్మన్ పదవికి సింగరేణి నుంచి ఇద్దరు ఉన్నతాధికారులు ఎంపికయ్యారు. ఇప్పుడు తాజాగా శ్రీధర్ చేరనున్నారా అనే ఊహాగానాలపై 'న్యూస్‌టుడే' కథనం**


జాతీయ స్థాయిలో ఉత్తమ యాజమాన్య అవార్డుతో సీఎండీ శ్రీధర్

### ఇంతకు ముందు ఇద్దరూ ఇక్కడివారే

గతంలో సింగరేణి సీఎండీలుగా పనిచేసిన ఎస్. నర్సింగ్‌రావు, సుతీర్థ భట్టాచార్యలు కోల్ ఇండియాకు ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. ఇప్పుడు తాజాగా ఎన్. శ్రీధర్ కూడా వారి బాటలోనే పయనించనున్నారా? అనే ప్రశ్నకు త్వరలో సమాధానం లభించనుంది. శ్రీధర్ కన్నా ముందు సింగరేణి సీఎండీగా పనిచేసిన సుతీర్థ భట్టాచార్య కోల్‌ఇండియాకు ఛైర్మన్‌గా వెళ్లారు. ఆయన 2017 ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఈ పోస్టుకు ఖాళీ ఏర్పడింది. భట్టాచార్య పదవి విరమణ పొందిన అనంతరం కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి ఛైర్మన్ నియామకం కోసం వేట మొదలు పెట్టింది. ప్రస్తుతం తాత్కాలిక ఛైర్మన్‌గా సెంట్రల్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (సీసీఎల్) సీఎండీగా పనిచేస్తున్న గోపాల్ సింగ్‌కు సీఐఎల్ ఛైర్మన్‌గా అదనపు బాధ్యతల్ని కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ అప్పగించింది.

### అన్వేషణకు అందని అర్హులు

కోల్ ఇండియా ఛైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకోవాలని గతంలో బొగ్గు మంత్రిత్వశాఖ జారీ చేసిన ప్రకటనకు పెద్దగా స్పందన లభించలేదని సమాచారం. దేశంలో ఉత్పత్తి అయ్యే బొగ్గులో 80 శాతానికిపైగా కోల్ ఇండియాదే కావడంతో ప్రభుత్వం సమర్థులైన అధికారులను ఎంపిక చేయాలని ప్రభుత్వరంగ సంస్థ ఎంపిక బోర్డు పీఈఎస్‌బీ (ద పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్)కు సూచించింది. ఈ పదవి కోసం నలుగురు కోల్ ఇండియా అనుబంధ పరిశ్రమల నుంచి, మరో ఇద్దరు ఇతర ప్రభుత్వరంగ సంస్థల అధికారులను ఇంటర్వ్యూ చేయగా ఒక్కరు కూడా ఎంపిక కాలేదు. కోల్ ఇండియా చరిత్రలో ఇలాంటి ఘటన జరిగి ఉండకపోవచ్చని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం మరోసారి కొత్తగా ఎంపిక ప్రక్రియను చేపట్టింది. ప్రతిష్ఠాత్మకమైన సీఐఎల్ ఛైర్మన్ పదవికి ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులే కాకుండా, ప్రైవేటు సంస్థలకు చెందినవారిని కూడా కేంద్రం ఆహ్వానించింది. ప్రైవేటు సంస్థల నుంచి కనీసం ఒక్కరు కూడా ముందుకు రాలేదు. తాత్కాలిక ఛైర్మన్‌గా కొనసాగుతున్న సీసీఎల్ సీఎండీ గోపాల్ సింగ్‌తోపాటు, కోల్ ఇండియా అనుబంధ సంస్థలకు చెందిన సీఎండీలలో ఆర్ ఆర్ మిశ్రా (డబ్ల్యూసీఎల్), ఏకే ఝా (ఎంసీఎల్), ఎస్. సరన్ (సీఎంపీడీఐ), ఇతర ప్రభుత్వరంగ పరిశ్రమలకు చెందిన ఆర్థిక విభాగం డైరెక్టర్ కె. బిస్వాల్ (ఎన్టీపీసీ), ఎన్ఎండీసీ డైరెక్టర్ (కమర్షియల్) టీఆర్ రావులను కోల్ ఇండియా పూర్తిస్థాయి ఛైర్మన్ పదవి కోసం పీఈఎస్‌బీ ఇంటర్వ్యూ చేసింది. వీరిలో ఏ ఒక్కరూ ఎంపిక కాకపోవడంతో మరోసారి కేంద్ర బొగ్గు మంత్రిత్వశాఖ దరఖాస్తులను ఆహ్వానించడంతో, సింగరేణి సీఎండీ శ్రీధర్ కోల్ ఇండియా వైపు చూస్తున్నట్లు సమాచారం.

### విద్యుత్తు కేంద్రం నిర్మాణంలో కీలకపాత్ర

2016 జనవరి 1న సీఎండీగా బాధ్యతలు చేపట్టిన శ్రీధర్ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలోనే కాకుండా, విద్యుత్తు కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణకు సత్వరం విద్యుత్తును అందించాలనే సంకల్పంతో మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద నెలకొల్పిన 2×600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రం నిర్మాణం పనులను వేగవంతం చేశారు. సీఎం కేసీఆర్ ఆశయానికి అనుగుణంగా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష సమావేశాలు నిర్వహించి అతి తక్కువ సమయంలో నిర్మాణం పనులు పూర్తయ్యేలా కృషి చేశారు. ఇప్పుడు సింగరేణి విద్యుత్తు కేంద్రం దేశంలోని అగ్రగామి థర్మల్ విద్యుత్తు కేంద్రాల్లో నాలుగో స్థానంలో నిలిచింది.

### సమర్థుడిగా గుర్తింపు

1997 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ సమర్థవంతమైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన క్షేత్రస్థాయిలో గనుల్లోకి దిగి పరిస్థితిని సమీక్షించడమే కాకుండా, కార్మికుల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. ఇవన్నీ ఆయనకు కలిసి వచ్చే అంశాలుగా కనిపిస్తున్నాయి. ఐదేళ్లపాటు కోల్ ఇండియాకు ఛైర్మన్‌గా పనిచేసే అవకాశం ఉన్న ఈ పదవికి శ్రీధర్ అర్హుడేనంటూ రాష్ట్ర ప్రభుత్వం కూడా భావిస్తోంది. ఈయనపై ఎలాంటి అభియోగాలులేవంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ సిఫారసు చేశారు. శ్రీధర్ కోల్ ఇండియాకు ఎంపికైతే సింగరేణి నుంచి వరుసగా మూడోసారి (హ్యాట్రిక్) అవుతుంది.

## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు

**రెబ్బెన, న్యూస్‌టుడే:** రెబ్బెన మండల కేంద్రంలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆసిఫాబాద్ మార్కెటు కమిటీ ఉపాధ్యక్షురాలు కుందారపు శంకరమ్మ కేకు కోసి సంబరాలు ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే స్వయం ఉపాధి కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నూతన సంవత్సరంలో మహిళలు సంతోషంగా ఉంటూ, సింగరేణి ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు స్వావలంబన దిశగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు దీక్ష, రజిత, పద్మ, లక్ష్మి, ఎం. పద్మ, స్వర్ణలత, జయ, ఉషారాణి, అరుణ, మణి, సంగీత, భవానీ, అనూష పాల్గొన్నారు.


కేకు కోస్తున్న మార్కెటు కమిటీ ఉపాధ్యక్షురాలు కుందారపు శంకరమ్మ

## సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర

**మందమర్రి పట్టణం:** తెలంగాణ సామాజిక ప్రజా సంఘాల ఐక్య వేదిక (టీమాస్) మండల సమావేశం మంగళవారం మందమర్రి పాతబస్టాండ్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఫోరం జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు దుర్గం గోపాల్ పాల్గొని మాట్లాడారు. ఈ నెల 3 నుంచి 10 వరకు ప్రతి గ్రామం, కాలనీలో పాదయాత్రలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాసర్ల రాజలింగు, జీ. బాలజీ, బి. పోశం, ఎండి జలావుద్దీన్, జీ. బుచ్చయ్య, బీ. రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గోపాల్

## 'మాజీ కార్మికుల గోడు పట్టించుకోరా?'

**యైటింక్లయిన్‌కాలనీ, న్యూస్‌టుడే:** సింగరేణి యాజమాన్యం మాజీ కార్మికుల గోడు పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ సీనియర్ నాయకులు కొండ్ర సత్యనారాయణ, గుంపుల కొమురయ్య, పులి కొమురయ్య, బాలయ్య తదితరులు పేర్కొన్నారు. మంగళవారం వారు కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ సకల జనుల సమ్మె వేతనాలు ఇవ్వలేదని సీఎంపీఎఫ్, ఈపీఎఫ్‌తో పాటు ట్రాన్స్‌పోర్టు అలవెన్సు ఇవ్వడం లేదన్నారు. అలాగే ఆరు నెలల్లో యాజమాన్యానికి అప్పగించాల్సిన కంపెనీ క్వార్టర్లను పక్షం రోజుల్లోనే అప్పగించే విధానం తెచ్చారని, సంస్థలో పని చేసినన్ని రోజులు కార్మికుల కృషి ఫలితంగా సంస్థ అభివృద్ధి చెందిందని తమను పొగిడిన యాజమాన్యం ఉద్యోగ విరమణ పొందగానే విస్మరించడం సరికాదని పేర్కొన్నారు. మాజీ కార్మికుల విషయంలో యాజమాన్యం తక్షణమే స్పందించాలని, లేనిపక్షంలో సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు.



కార్మికులకు పదోన్నతి ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న అధికారులు

## కార్మికులకు పదోన్నతి ఉత్తర్వులు అందజేత

**తాండూరు, న్యూస్‌టుడే:** కార్మికులకు రావాల్సిన ప్రతి సౌకర్యాన్ని సంస్థ సకాలంలో అందిస్తుందని బెల్లంపల్లి ఏరియాలోని బీపీఏ ఓసీ2, గోలేటి1ఏ గనుల మేనేజర్లు రమేష్, మహేష్ అన్నారు. ఏరియాలోని బీపీఏ ఓసీ2 గనిలో 10మందికి, గోలేటి1ఏ గనిలో నలుగురికి సర్వీసు ఆధారిత పదోన్నతులు రాగా, వారికి పదోన్నతి పత్రాలను వారు అందజేశారు. అనంతరం 2018 వార్షిక కాలసూచికను వారు కార్మికులకు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఏరియా వ్యాప్తంగా కార్మికులకు రావాల్సిన పదోన్నతులు, ఇంక్రిమెంట్లు సకాలంలో ఇస్తున్నట్టు తెలిపారు. కార్మికుల క్షేమమే లక్ష్యంగా సంస్థలో సంస్కరణలు అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గనుల అధికారులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మూతపడిన భూగర్భ గనులను తెరిపించాలి

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** మందమర్రిలో ఇంటింటికి బీఎస్పీ కార్యక్రమాన్ని మంగళవారం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగపిండి రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. స్థానిక మార్కెట్‌లోని దుకాణాలు, ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ, పార్టీ చేపట్టే ఉద్యమాలను వివరిస్తూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ చెన్నూరులో మూతపడిన సింగరేణి భూగర్భ గనులను తెరిపించాలని, ఆర్టీసీ డిపోకు స్థలం కేటాయించి డిపో ఏర్పాటుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. మందమర్రి మున్సిపల్ ఎన్నికలు త్వరగా జరిగేలా చూడాలని, నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పులిపాక శ్రీనివాస్, కాంపెల్లి వినయ్, చిప్పకుర్తి రమేష్, గరిగె వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మందమర్రిలో ఇంటింటికి తిరుగుతూ విరాళాలు సేకరిస్తున్న బీఎస్పీ నాయకులు

## కార్మికుల కోసం పని చేసే సంఘంలో చేరాలి

### ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

**రెబ్బెన, న్యూస్‌టుడే:** ఒప్పంద, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కుమురం భీం ఒప్పంద కార్మిక సంఘం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం ఖైరిగూర ఓసీపీ మట్టి వెలికి తీసే పనులు నిర్వహిస్తున్న డీబీఎల్ కంపెనీలో జిల్లా ఒప్పంద కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒప్పంద కార్మికుల కోసం పని చేసే సంఘంలో చేరి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందరూ అండగా నిలువాలన్నారు. సంస్థ అభివృద్ధి కోసం అహర్నిషలు కష్టపడుతున్న కార్మికులకు త్వరలో బోనస్ ఇప్పిస్తామని, వేతన పెంపుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. అనంతరం డీబీఎల్ కంపెనీ యాజమాన్యం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు చర్చించారు. ఈనెల 20లోపు బోనసు చెల్లించాలని, జనవరి వేతనంలో కార్మికుల జీతాలు పెంచే విధంగా చూడాలని యాజమానానికి సూచించారు. లైట్ మోటర్ వెహికల్ డ్రైవర్లకు త్వరలో వేతనాలు పెంచాలని, ప్రమాదాలు చేశారనే పేరుతో ఉద్యోగాల నుంచి తొలగించిన వారిని తిరిగి వెంటనే ఉద్యోగాలు కల్పించాలని, గతంలో బీజీఆర్‌లో పని చేసిన వారితో పాటు స్థానికంగా కొత్త ఉద్యోగాలు ఇవ్వాలని సూచించారు. దీనికి యాజమాన్యం సానుకూలంగా స్పందించించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీపీ కార్నాథం సంజీవ్‌కుమార్, జడ్పీటీసీ సభ్యురాలు కమల, తెబొగకాసం కేంద్ర కార్యదర్శి మల్రాజు శ్రీనివాస్, మార్కెటు కమిటీ ఉపాధ్యక్షురాలు కుందారపు శంకరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పర్లపల్లి వనజ, నాయకులు జగదీష్, మల్లికార్జున్, మోడెం సుదర్శన్‌గౌడ్, పూదరి మొండయ్య, గజ్జెల సత్యనారాయణ, కుందారపు నగేష్, మహేష్, సంతోష్, రమేష్, శంకర్, అస్లాం పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్

## విద్యార్థికి సన్మానం

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** కరాటే, కిక్‌బాక్సింగ్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైన మందమర్రి మండలం అందుగులపేట గ్రామానికి చెందిన చిప్పకుర్తి స్వదేశ్‌రాజ్‌ను మంగళవారం సాయంత్రం ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం గ్రామంలో ఏర్పాటుచేసిన సన్మాన సభలో విప్ ఓదెలు మాట్లాడారు. 5వ తరగతి చదువుతున్న స్వదేశ్‌రాజ్ చిన్న వయస్సులోనే అనేక పతకాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. మున్ముందు విద్యార్థికి చేయూతనందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. విద్యార్థులు ఒక్క చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని పిలుపునిచ్చారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.


స్వదేశ్‌రాజ్‌ను సన్మానిస్తున్న విప్ నల్లాల ఓదెలు

# జూనియర్ ఇన్‌స్పెక్టర్‌కు ఘనంగా సన్మానం


రాబిన్‌సన్ దంపతులను సన్మానిస్తున్న కె.కె-ఓసీపీ పీవో వి.రామూర్తి, డీజీఎం గోవిందరాజు

**మందమర్రి, న్యూస్‌టుడే:** సింగరేణి సెక్యూరిటీ విభాగంలో జూనియన్ ఇన్‌స్పెక్టర్‌గా రాబిన్‌సన్ ఎంతో క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, కె. కె-ఓసీపీ పీవో వి. రాంమూర్తి అన్నారు. మంగళవారం మందమర్రిలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో జూనియన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన రాబిన్‌సన్-మేరిఅతల్యా దంపతులను వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సెక్యూరిటీ విభాగంలో చురుకైన పాత్రను పోషించారని ఇతర ఉద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం ఎస్అండ్‌పీసీ విభాగం అధికారులు, జవానులు దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ పి.గోవిందరాజు, సీనియర్ సెక్యూరిటీ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు

# పోటీల ఏర్పాట్లను పరిశీలించిన విప్

**రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే:** రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ 4వ మాస్టర్ వెటరన్ అథ్లెటిక్స్ పోటీల ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు పరిశీలించారు. మంగళవారం సాయంత్రం స్టేడియంలో వివిధ క్రీడాంశాల కోసం నిర్మిస్తున్న కోర్టులను చూశారు. అనంతరం పోటీల నిర్వహణపై నిర్వాహకులతో చర్చించారు. విప్ వెంట మందమర్రి జడ్పీటీసీ సభ్యుడు కంబగోని సుదర్శన్‌గౌడ్, తెరాస పట్టణ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య తెబొగకాసం నేత బోయినపల్లి నర్సింగరావు, బైరమల్ల మొగిలయ్య, కుమ్మం సురేందర్, జిలకర మహేశ్, మాస్టర్ వెటరన్ అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు రాజేశ్వర్‌రావు, రాజబద్రి తదితరులు పాల్గొన్నారు.

### *జిల్లా యువజన, క్రీడల అధికారి సందర్శన*

రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీల కోసం చేపట్టిన ఏర్పాట్లను జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీకాంత్, రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు తనయుడు, కేసీఆర్ సేవాదళం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లాల క్రాంతికుమార్‌లు పరిశీలించారు. పోటీల నిర్వహణపై వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో క్యాతన్‌పల్లి సర్పంచి జాడి శ్రీనివాస్, జడ్పీటీసీ కంబగోని సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యాలయంలో సిబ్బందిని మందలిస్తున్న జీఎం సుభాని

# కార్యాలయాల పరిశుభ్రత ఉద్యోగుల బాధ్యత

● శ్రీరాంపూర్ జీఎం సుభాని


**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** శ్రీరాంపూర్‌లోని సంస్థ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందని శ్రీరాంపూర్ జీఎం సుభాని సూచించారు. మంగళవారం ఏరియా జీఎం కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేసిన ఆయన విభాగాల్లో అసంపూర్తిగా ఉన్న సివిల్, విద్యుత్తు పనులను చూసి అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయంలో విద్యుత్తు వైరింగ్ సరిగ్గా లేదని, గదులకు సున్నాలు వేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతిఒక్క అధికారి అవసరం లేని ఫైళ్లను, అనవసర సామగ్రిని తొలగించి పరిశుభ్రత పాటించాలన్నారు. ఇప్పటికీ గదుల్లో పూర్తికాని పనులు ఉంటే వాటిని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛ్‌హే సేవా, స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని స్వచ్ఛ సింగరేణికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇకపై ఏరియాలోని కార్యాలయాలను క్రమంతప్పకుండా తనిఖీలు నిర్వహించి శుభ్రత పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, డీవైజీఎం(పీ) చిత్తరంజన్‌కుమార్, డీవైజీఎం(సీ) శ్రీనివాసరావు, ఎస్ఈ(సీ) రామకృష్ణ, ఎస్ఈ(ఈఅండ్ఎం) కృష్ణారెడ్డి, డీవైపీఎం ఆజ్మీరా తుకారాం, అనిల్‌కుమార్, ఉదయ్‌మోహన్, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సెక్టార్-3 పాఠశాలలో విద్యా విషయక సమావేశం

**యైటింక్లయిన్‌కాలనీ:** కాలనీలోని సెక్టార్-3 సింగరేణి పాఠశాల ఆవరణలో మంగళవారం విద్యా విషయక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలకు చేరుకున్న డీజీఎం(పర్సనల్) ఎన్వీ రావు ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రతి విద్యార్థి అత్యుత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సబ్జెక్టుల వారీగా ప్రణాళికలు పూర్తయ్యాయా? లేదా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. సిలబస్ పూర్తయిన వారు రివిజన్ చేయాలని సూచించి ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.




# ఉత్పత్తిపై దృష్టి



శ్రీరాంపూర్, న్యూస్‌టుడే

**ఏటా నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ వస్తున్న సింగరేణి, ఈ ఏడాది కూడా అదే ఒరవడిని కొనసాగించే దిశగా కృషి చేస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం మూడు నెలలు మాత్రమే మిగిలి ఉండటంతో, ఇప్పటి నుంచి ప్రతి రోజూ ప్రతి గంట సంస్థకు ఎంతో కీలకం కానుంది. ఇప్పటి వరకు లక్ష్య సాధనలో కొంత వెనుకబడి ఉన్న సింగరేణి ఈసారి సమస్యను ఎలా అధిగమిస్తుందనే నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.**

● ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు నెలలే గడువు

● రోజుకు సగటున 3 లక్షల టన్నుల లక్ష్యం

సింగరేణి సంస్థ 1998-99 నుంచి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతలో ఏటా మెరుగుపర్చుకుంటూ లక్ష్యాలను చేరుకుంటూ వస్తోంది. కొన్ని సందర్భాల్లో కొంత తడబడినా, చివరికి ఆశించిన లక్ష్యాన్ని అందుకొంటుంది. గతంలో ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు, నాలుగు నెలలు ఉందనగా, ఒక్కసారి అన్ని గనుల్లో హడావుడి పెరిగి ఉత్పత్తిపై దృష్టి సారించి, చివరికి హమ్మయ్య అనిపించేవారు. ఈ పరిస్థితి 2008 వరకు కొనసాగింది. దీనివల్ల చివరి మూడు నెలల్లో ఉత్పత్తి చేయాలనే ఒత్తిడిలో గని ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకునేవి. యాజమాన్యం ఉత్పత్తిపై పెట్టిన శ్రద్ధ రక్షణపై పెట్టడంలేదని కార్మిక సంఘాలు తరచుగా ఆరోపించేవి. కార్మికుల్లోనూ ఇదే అభిప్రాయం బలపడేలా ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యకు తెరదించుతూ అప్పట్లోనే యాజమాన్యం ఏ రోజు నిర్దేశించిన ఉత్పత్తిని ఆరోజే సాధించడం ద్వారా ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఉత్పత్తి కోసం ఇటు అధికారులు, అటు కార్మికులు ఒత్తిడికి గురికావాల్సిన అవసరం ఉండదనే ఉద్దేశంతో ఏడాది పొడవునా ఒకే విధంగా వ్యవహరించడం మొదలు పెట్టింది. ఈ ప్రయోగం సింగరేణిలో విజయవంతం అయింది.

### *ఏరోజు పని ఆరోజే..*

2008-09లో 445.46 లక్షల టన్నుల ఉత్పత్తి చేసిన సింగరేణి, 2010-11లో ఏకంగా 504.25 లక్షల టన్నుల ఉత్పత్తి చేసింది. ఒక్క ఏడాదిలోనే ఎలాంటి ఒత్తిడికి,



తడబాటుకు గురి కాకుండా ఉత్పత్తిలో 12 శాతం మేరకు వృద్ధిని నమోదు చేసింది. ఆ తర్వాత కొద్దికొద్దిగా వార్షిక వృద్ధిరేటును నమోదు చేసిన సంస్థ, 2014-15లో 525.36 లక్షల టన్నుల ఉత్పత్తి చేసింది. 2015-16లో తిరిగి ఏకంగా 15 శాతం మేరకు వృద్ధితో 2015-16లో 603.8 లక్షల టన్నుల అత్యధిక ఉత్పత్తి చేసి మరోసారి తన రికార్డును తానే తిరగరాసుకుంది. దేశంలోని ఏ బొగ్గు పరిశ్రమలోనూ ఈ విధంగా ఉత్పత్తిలో వృద్ధిరేటును సాధించలేదు. గతేడాది 613.36 లక్షట టన్నులు ఉత్పత్తి చేసిన సింగరేణి, ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశిత లక్ష్య సాధనలో కొంత వెనుకబడి ఉంది. డిసెంబరు నెలాఖరునాటికి 472.06 లక్షల టన్నుల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 416 లక్షల మేరకు ఉత్పత్తి సాధించింది. గతేడాది ఇదే సమయానికి 420 లక్షలకు పైగా ఉత్పత్తిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి ఉత్పత్తి పడిపోయింది. ఇక మిగిలిన మూడు నెలల కాలంలో 244 లక్షల టన్నులకు పైగా ఉత్పత్తి సాధించాలంటే, నెలకు సగటున దాదాపు 82వేల టన్నులు చేయాల్సి ఉంటుంది. ఆదివారం, ఇతర పండగ సెలవులను మినహాయిస్తే మిగిలిన పని దినాల్లో రోజుకు సగటున 3 లక్షల టన్నుల చొప్పున ఉత్పత్తి చేయగలిగితేనే లక్ష్యాన్ని చేధించగలుగుతుంది. ప్రస్తుతం 2,40,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకోగా, సగటున 2.08 లక్షల మేరకు ఉత్పత్తి జరుగుతోంది. ఈ మూడు నెలల కాలంలో ఇటు ఉపరితల గనులు, అటు భూగర్భ గనుల్లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేయడంతో పాటు, అదే స్థాయిలో బొగ్గు రవాణా చేయడం సవాల్‌గా మారింది. సంస్థ 660 మిలియన్ టన్నుల మైలురాయిని అధిగమిస్తుందా లేదా? అనేది కార్మికవర్గాన్ని ఉత్కంఠకు గురి చేస్తోంది.

### *లక్ష్యసాధనలో 19 గనులు*

సింగరేణిలో మొత్తం 29 భూగర్భ గనులు, 18 ఉపరితల గనులు ఉండగా, అందులో 19 గనులు మాత్రమే ఇప్పటి వరకు నిర్దేశించిన ఉత్పత్తిని అధిగమించాయి. ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిన గనుల్లో 12 ఉపరితల గనులు ఉండగా, ఏడు భూగర్భ గనులు ఉన్నాయి. ఉపరితల గనులు లక్ష్యాన్ని మించి ఉత్పత్తి చేయడం పరిపాటిగా వస్తోంది. పూర్తిస్థాయిలో అధునాతన యంత్రాలతో బొగ్గు ఉత్పత్తి చేస్తుండటంతో, ఉపరితల గనులు అవసరమైతే రెట్టింపు పనిసామర్థ్యాన్ని చూపిన సందర్భాలు అనేకం ఉన్నాయి. భూగర్భ గనులు మాత్రం లక్ష్యాన్ని సాధించడం అత్యంత కష్టం. దీనికి భిన్నంగా శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్న ఎనిమిది భూగర్భ గనుల్లో ఐదు గనులు వంద శాతానికి మించి ఉత్పత్తిని నమోదు చేయడం విశేషం. మందమర్రి ఏరియాలోని రెండు భూగర్భ గనులు సైతం ఇదే విధంగా అధికోత్పత్తిని నమోదు చేశాయి. శ్రీరాంపూర్ ఏరియా భూగర్భ గనులు వరుసగా మూడేళ్ల నుంచి ఉత్పత్తి లక్ష్యాలను చేరుకుంటూ సింగరేణికే ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఇదే ఒరవడిని మిగతా గనుల్లో కొనసాగితే సింగరేణి సంస్థ నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడం నల్లేరుపై నడకే అవుతుంది. ఉత్పత్తి లక్ష్యాలు అధిగమించిన భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆర్కే-5(111శాతం), ఆర్కే-6(111 శాతం), ఎస్సార్పీ-1 (130 శాతం), ఎస్సార్పీ-3 (100 శాతం), ఐకే-1ఏ (104 శాతం), మందమర్రి ఏరియాలోని కేకే-1 గని (113 శాతం), కేకే-5 గని (102 శాతం) చొప్పున ఉత్పత్తి చేశాయి.

# సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

● ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు టి.శ్రీనివాస్

**శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే:** సంస్థలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఇఫ్టూ జాతీయ అధ్యక్షుడు టి.శ్రీనివాస్ డిమాండు చేశారు. మంగళవారం నస్పూర్ కాలనీలో ఒప్పంద కార్మికుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన సీసీసీలో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయన్నారు. ప్రస్తుతం సింగరేణిలో 25 వేల మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. శాశ్వత కార్మికులు చేయాల్సిన పనులను యాజమాన్యం ఒప్పంద కార్మికులతో చేయిస్తూ తక్కువ వేతనాలు చెల్లించి శ్రమదోపిడికి పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. ఒక పరిశ్రమలో రెండు రకాల వేతనాలు ఉండరాదని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని 2016 అక్టోబర్‌న తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. దీన్ని ఇప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సంస్థలోని ఒప్పంద కార్మికులను శాశ్వతం చేయాలని ఆయన కోరారు. సమాన


సమావేశంలో మాట్లాడుతున్న టి.శ్రీనివాస్

వేతనం కోసం చేస్తున్న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఇఫ్టూతోపాటు మరో 9 సంఘాలతో ఈ నెల 28న చెన్నైలో అఖిల భారత సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికి సింగరేణి ప్రాంతానికి చెందిన ఒప్పంద కార్మికులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్‌సీసీడబ్ల్యూయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.బ్రహ్మానందం, నాయకులు కె.నర్సయ్య, బి.యాదగిరి, ఎం.శంకర్, డి.పోషం, నూనె రమేష్, వి.రాజయ్య, ఆర్.పోషం, ఎం.రాజేందర్, ఆర్.రాజకళ, జి.శోభ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణకు ఉద్యమం

**గోదావరిఖని, న్యూస్‌టుడే:** సింగరేణిని కాపాడుకునేందుకు ఉద్యమిస్తామని ఐఎన్‌టీయూసీ నాయకులు బి.జనక్‌ప్రసాద్ వెల్లడించారు. సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇటు ప్రభుత్వం, అటు సింగరేణి ఛైర్మన్ తమ జేబు సంస్థగా వ్యవహరిస్తూ విధానపరమైన నిర్ణయాలను తుంగలో తొక్కుతున్నారన్నారు. దీనివల్ల సంస్థ మళ్లీ నష్టాల బాటలోకి వెళ్లే అవకాశం ఉందని, దీని కోసం సంస్థను కాపాడుకునేందుకు జనవరి నుంచి జూన్ వరకు దశల వారీగా ఉద్యమిస్తామన్నారు. దానికి ప్రతి గనిపై కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవడంతో పాటు సంస్థ నిర్వహణ విషయాలను కార్మికులకు అవగాహన కలిగిస్తామన్నారు. కంపెనీ బాగుంటేనే కార్మికులకు ఉపాధి ఉంటుందని, అలాంటి కంపెనీని పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా పాలన సాగుతుందన్నారు. ప్రస్తుతం సింగరేణిలో పనిచేస్తున్న ఉన్నతాధికారులకు ఎవరికి జవాబుదారి తనం లేదని, మొక్కుబడిగా ఎవరికి వారు తమ నిర్ణయాలను తీసుకుంటు సంస్థపై రుద్దుతున్నారన్నారు. సంస్థను కాపాడుకోవడానికి ఉద్యమిస్తామని, త్వరలోనే గనులపైకి వెళ్లి కార్మికులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పూర్తిగా నష్టం చేస్తున్న గుర్తింపు సంఘం గెలిచిన తర్వాత కూడా తమ ఉనికిని చాటుకునే పరిస్థితి లేకుండా పోయిందన్నారు.

# BANK EXAMS

## GENERAL AWARENESS

ప్రతిభ

# Present CEO of NCDEX is ...?



Writer: Veeraswamy. A
Subject Expert

★ Bank of Maduhra Limited merged with ....... A: 2
1) HDFC bank 2) ICICI
3) Andhra Bank 4) Bank of Baroda 5) Axis Bank

★ Which bank merged with Oriental Bank of Commerce in 2004? A: 3
1) Bank of Calcutta 2) Bank of Rajasthan
3) Global Trust Bank Limited 4) Bank of Upper Shimla
5) Bank of Maharashtra

**1.** PCA framework initiated by RBI to monitor certain performance indicators of the banks. In this context, PCA stands for ........
1) Prompt Corrective Action
2) Punitive Corrective Action
3) Punish Corrective Action
4) Punctual Corrective Action
5) Preference Coercive Action

**2.** Prompt Corrective Action is triggered by RBI when banks breach certain regulatory requirements like CRAR , ROA and NPA. In this context, CRAR, ROA and NPA stand for .......
1) Capital to Risk (Weighted) Assets Ratio, Return On Assets and Non-Performing Assets
2) Capital to Risk (Weighted) Assets Ratio, Rotation On Assets and Non-Performing Assets
3) Capital to Risk (Weighted) Assets Ratio, Return On Assets and Notable-Performing Assets
4) Capital to Random (Weighted) Assets Ratio, Return On Assets and Non-Performing Assets
5) Capital to Risk (Weighted) Assets Ratio, Ruin Of Assets and Non-Performing Assets

**3.** On 20th December 2017, RBI puts Bank of India under Prompt Corrective Action. Who is the present MD & CEO of Bank of India?
1) Rajanish Kumar
2) Usha Ananthasubramanian
3) Aditya Puri 4) M.K.Sharma
5) Dinabandhu Mohapatra

**4.** The Non-Executive Chairman of Bank of India is .......
1) Ravi Venkatesan 2) Ashwani Kumar
3) T.C. Venkat Subramanian
4) T C A Ranganathan 5) G. Padmanabhan

**5.** Which among the following bank so far not cover under Prompt Corrective Action by 20th December 2017?
1) IDBI 2) UCO bank
3) State Bank of India 4) Dena Bank
5) Central Bank of India

**6.** On 22 December 2017, Loksabha was informed by Shiv Pratap Shukla that 'the amount lost on account of frauds during 2016-17 was Rs 16,789 crore' in banks and select financial institutions. In this context, who is Shiv Pratap Shukla?
1) Chairman , SEBI
2) Chairman,Economic Advisory Council to the Prime Minister
3) Finance Secretary
4) Deputy Governor, RBI
5) Union Minister of State for Finance

**7.** By the end of September 2017, as government informed Loksabha, the Gross Non-performing Assets (NPAs) of banks crossed .......
1) Rs 6.50 lakh crore 2) Rs 8.50 lakh crore
3) Rs 9.50 lakh crore 4) Rs 5.50 lakh crore
5) Rs 10.50 lakh crore

**8.** HDFC Bank's Artificial Intelligence (AI)-based chatbot is .......
1) Inka 2) Laxmi100 3) Eva
4) Trail 5) GoogBot

**9.** Shashi Arora stepped down as the CEO and Managing Director of ....... after controversy over Aadhaar e-KYC
1) India Post Payment Bank
2) Vodafone M-Pesa 3) FINO PayTech
4) Airtel Payments Bank
5) Paytm Payment Bank

**10.** CCEA (Cabinet Committee on Economic Affairs) SCBTS scheme of Rs.1300 crore for Capacity Building in .......
1) Leather Sector
2) Information Technology
3) Textile Sector 4) Jute Industry
5) Coal Sector

**11.** Cabinet Committee of Economic Affairs (CCEA) headed by .......
1) Finance Minister 2) Governor, RBI
3) Prime minister of India
4) Minister of State for Finance
5) Minister of Corporate Affairs

**12.** SEBI raised the investment limit for FPIs in central government securities. The term FPI stands for .......
1) First Portfolio Investors
2) Front Portfolio Investors
3) Foreign Position Investors
4) Foreign Portfolio Investors
5) Folio Portfolio Investors

**13.** World Bank committed $125 million loan to India for the STRIVE scheme. STRIVE stands for .......
1) Skills Suggestion for Industrial Value Enhancement
2) Skills Strengthening for Industrial Vote Enhancement
3) Skills Strengthening for Industrial Value Enhancement
4) Skills Strengthening for Initiation Value Enhancement
5) Skills Store for Industrial Value Enhancement

**14.** Which Bank announced signing MOU with Sahaj e-Village for extending its banking service in remote areas through Business Correspondent Agent (BC) model?
1) Karnataka Bank
2) Kotak Mahindra Bank
3) AU Small Finance Bank
4) Bank of Baroda
5) Equitas Small Finance Bank

**15.** RBI imposed a penalty of Rs 5 crore on ....... for non-compliance with its directions on 'Cheque Purchase or Discounting, Bill Discounting, and KYC' norms on 12th December 2017?
1) SBI 2) Union Bank of India
3) Syndicate Bank 4) Bank of India
5) Kotak Mahindra Bank

**16.** HDFC Realty and HDFC Developers acquired by ....... for Rs.357 crore
1) UBER 2) Paytm 3) Quikr
4) OLA 5) Amazon

**17.** Finance Minister on 7 December 2017 said that FDRI Bill protects the rights of depositors of the banks. In this context, FRDI Bill stands for .......
1) Financial Resolution and Deposit Insurance Bill
2) Financial Revolution and Deposit Insurance Bill
3) Financial Resolution and Deposit Investigation Bill
4) Fund Resolution and Deposit Insurance Bill
5) Financial Reduction and Deposit Insurance Bill

**18.** Bhavantar Bhugtan Yojana (Price deficit financing scheme) launched by which state?
1) Uttar Pradesh 2) Madhya Pradesh
3) Bihar 4) Arunachal Pradesh 5) Goa

**19.** In Bhavantar Bhugtan Yojana, Madhya Pradesh government would pay the farmers the difference between modal rate (the average prices in major mandis) and the MSP for the kharif crops if the latter prices could not be fetched by them. In this context, MSP stands for .......
1) Minimum Slow Price
2) Model Support Price
3) Minimum Standard Price
4) Minimum Support Price
5) Maximum Support Price

**20.** National Investment and Infrastructure Fund (NIIF) inks pact worth ....... with Abu Dhabi Investment Authority
1) $2 billion 2) $1.5 billion 3) $3 billion
4) $1 billion 5) $1 million

**21.** NIIF is a fund created by the Government of India for enhancing infrastructure financing in the country. Present CEO of NIIF is.......?
1) Rajiv Dhar 2) Srinivas Jain
3) Subramanayam Amara 4) Sujoy Bose
5) Saurabh Jain

**22.** USA central bank raised the bench mark interest rate to 1.25 % - 1.5 % recently. Present chair person of the US Federal Reserve is.......
1) Janet Yellen 2) Jim-Yong-Kim
3) Christine Lagarde 4) Suma Chakrabarti
5) Werner Hoyer

**23.** The deadline for linking Aadhaar with financial investments/ instruments extended till .......
1) March 1, 2018 2) January 31, 2018
3) December 31, 2018 4) April 30, 2018
5) March 31, 2018

**24.** Which among the following became the first-ever broking arm of a bank to take membership of a commodity exchange by registering itself with NCDEX on 4 December 2017?
1) HDFC Securities
2) Kotak Mahindra Securities
3) Axis Securities 4) ICICI Securities
5) SBI Securities

**25.** National Commodity & Derivatives Exchange Limited (NCDEX) is an online multi commodity exchange. It was incorporated in .......
1) 2000 2) 1999 3) 2010 4) 2003 5) 2012

**26.** Where is the headquarters of NCDEX?
1) Delhi 2) Pune 3) Mumbai
4) Kolkata 5) Hyderabad

**27.** Present CEO of NCDEX is .......
1) Samir Shah 2) Sujay Bose
3) T.S.Vijayan 4) Santosh Kumar Gangwar
5) Arun Jaitley

**28.** Punch line of NCDEX is .......
1) Pragati Ka Solid Exchange
2) Experience The New
3) The edge is Efficiency
4) Stock of the Nation
5) Reap The Opportunity

**29.** Government of India engaged which bank to enable online payments at 470 mandis integrated with national portal of electronic National Agriculture Market (e-NAM)?
1) HDFC bank 2) ICICI bank
3) United bank of India 4) Yes bank
5) Bank of Baroda

**30.** World Bank and ....... releases the Financial Sector Assessment (FSA) and Financial System Stability Assessment (FSSA) respectively.
1) AIIB 2) ADB 3) IMF
4) NDB 5) US Federal Bank

**31.** Union Government on 30 October 2017 set up Alternative Mechanism panel, to consider and oversee mergers among the country's 21 state-run banks. The panel headed by .......
1) Arun Jaitley 2) Urjith Patel
3) P. Radhakrishnan 4) Shiv Pratap Shukla
5) Rajiv Shukla

**32.** Which committee in 1991 recommended that the actual numbers of public sector banks need to be reduced?
1) Y.V.Reddy 2) Raja Challiah
3) M. Narasimham 4) Bimal Jalan
5) Manmohan Singh

**33.** In 2014, which committee suggested that government either merge or privatize state-owned banks?
1) Chidambaram 2) Rangarajan
3) Usha Thorat 4) P.J.Nayak
5) Syamala Gopinath

**34.** Which Bank merged with Kotak Mahindra Bank in 2014?
1) ICICI Bank 2) Axis Bank
3) ING Vysya 4) Indus Ind Bank
5) Karnataka Bank Limited

**35.** In 2010, which Associate of SBI merged with SBI?
1) State Bank of Hyderabad
2) State Bank of Mysore
3) State Bank of Patiala
4) State Bank of Indore
5) State Bank of Bikaner and Jaipur

**36.** State Bank of Saurashtra merged with which Bank in 2008?
1) Bank of Baroda 2) Bank of Saurashtra
3) ICICI Bank 4) SBI
5) Union Bank of India

**37.** RBI has discretionary powers to approve the voluntary amalgamation of two banking companies under the provisions of ....... of the Banking Regulation Act, 1949.
1) Section 32A 2) Section 14A
3) Section 44A 4) Section 34A
5) Section 4A

### Answers

| | | | |
|---|---|---|---|
| 1-1 | 11-3 | 21-4 | 31-1 |
| 2-1 | 12-4 | 22-1 | 32-3 |
| 3-5 | 13-3 | 23-5 | 33-4 |
| 4-5 | 14-3 | 24-3 | 34-3 |
| 5-3 | 15-3 | 25-4 | 35-4 |
| 6-5 | 16-3 | 26-3 | 36-4 |
| 7-2 | 17-1 | 27-1 | 37-3 |
| 8-3 | 18-2 | 28-1 | |
| 9-4 | 19-4 | 29-2 | |
| 10-3 | 20-4 | 30-3 | |

*Teaching is a continuous process. In the process of teaching and learning careful selection of a method or approach is significant. A good teacher always in search of a good method or approach for his/her successful teaching. In fact the selection of a right method or approach paves the way for efficient learning.*

# Oral fluency is the hall mark of...?



Writer:
Sk. Rahamatulla
Subject Expert

### METHODS OF TEACHING ENGLISH
### APPROACHES, METHODS AND TECHNIQUES

*'A language teaching method is a single set of procedures which teachers are to follow in the class room. Methods are usually based on a set of beliefs about the nature of language and learning.'*
*- DAVID NUNAN (2003)*

There are variety of terms which are sometimes used interchangeably in the same sense. Method, approach and technique are the terms that have created a lot of confusion in the minds of teachers of language. It is worthwhile to define these terms before the discussion of different methods, approaches and techniques can be taken up.

**METHOD**
1. An overall procedure for an orderly presentation of language material.
2. Concerned with 'How to teach'?
3. Involves selection, grading, presentation and repetition of instructional material.
Eg: GT Method, Direct Method, Bilingual Method.

**APPROACH**
1. Refers to the nature of language.
2. It is axiomatic
3. Needs no support to justify its effectiveness.
4. States a point of view or philosophy or an assumption.
Eg: Structural Approach, Communicative Approach

**TECHNIQUE**
1. Refers to a class room device, a trick or strategy to achieve the objective of teaching.
2. It is implementational.
Eg: Using flash cards, Using substitution tables, Language games etc

### METHODS OF TEACHING ENGLISH

### GT- METHOD

★ This method was mainly advocated by the German scholars Johann Seidenstucker, Karl Plotz, HS OllenDorf and Johann Meidienger
★ Grammar is believed to be the starting point of instruction

**Characteristic features:**

★ Also known as Classical method/ Prussian method (USA).
★ Foreign phraseology can be learnt through translation.
★ Word-for word translation is the focus.
★ Vocabulary is taught through bilingual list.
★ Grammar is taught deductively (Rules first-Examples next).
★ Structures of English are learnt by comparing and contrasting with that of mother tongue.
★ Priority is given to accuracy and completeness of sentences.

**Advantages:**

★ Establishes a bond between foreign phraseology (new ideas) and mother tongue (old ideas). Proceeds from known to unknown.
★ Not required by the teacher to use sophisticated or extensive A.V.Aids.
★ Rapid expansion of vocabulary is possible.

**Limitations:**

✪ Literal translation (word for word translation) ruins the sense and sometimes becomes ridiculous.
✪ Natural order of language learning (LSRW) is not followed. The teacher takes up reading first followed by writing.
✪ No scope for the students to learn English quickly, the mother tongue influence becomes the hurdle.
✪ Oral practice is neglected.

### DIRECT METHOD

*'A language could best be taught*
*By using it actively in the class room' -Franke*

**Characteristic features:**

★ Establishes a direct bond between word, idea and experience.
★ Translation in every form is banished from the class room.
★ Attaing oral fluency (speech training) is the prime focus.
★ Vocabulary is taught by means of objects/ natural context.
★ Grammar is taught inductively (Examples first Rules-next)
★ Unit of teaching is a sentence.
★ Extensive use of AV aids.

**Advantages:**

★ Makes the pupils think in English.
★ Cramming of words is discouraged (memorisation).
★ An English atmosphere is created in the class room.

**Limitations:**

✪ Concentrates on oral aspect of language learning and ignores reading and writing.
✪ Laborious method as it needs lot of preparation by the teacher.
✪ Complete banishment of use of M.T is not possible.
✪ According to Thomson & Wyatt we cannot for bid the child to think in his mother tongue.
✪ Expensive method as it needs lot of AV Aids.

### Bilingual method

★ Invented by Professor C.J. Dodson of Wales University.
★ Mother tongue is used to activate the target language by the teacher.
★ A mid way approach between GT- Method and Direct Method.

**Characteristic Features:**

★ Mother tongue equivalents of English words are told to the class.
★ Rules of grammar are not taught separately.
★ Word for word translation is not done by the teacher. When the meaning of a word is difficult to explain it is translated into mother tongue.
★ The use of mother tongue is made only at the initial stages. This practice is dropped as soon as students develop sufficient vocabulary of foreign language.
★ Sentence is the unit of teaching.

**Advantages:**

★ Less expensive than direct method.
★ Not necessary to use costly aids.
★ Easy for the language teacher to deal with a heterogeneous class.

**Limitations:**

✪ Careless handling of this method would end up as GT method.
✪ May be suitable for adult learners.
✪ Students are likely to develop an undesirable habit of language mix ups that may last long.

### Dr. West's New Method

*'Learning to read a language is by far*
*The shortest road to speak and write it.'*
*- Dr.West*

★ This method is also known as Reading method or Text Book method.
★ Dr. M.P.West, the former Director of Education and Principal of Training College in Bengal in Pre Independent India was the propounder of this method.
★ Dr.West says 'the bilingual child does not so much need to speak his second language (English) but rather to read it.'

**Characteristic features:**

★ A revolt against Direct method.
★ As there are more chances of hearing in correct English for the Indian students, this method therefore envisages emphasis on 'Reading skills'.
★ It gives due importance to Text Books and Readers.
★ Permits the use of mother tongue wherever necessary.
★ Dr.West laid emphasis on silent Reading.

**Advantages:**

★ Reading helps to make the writing easy.
★ It helps to increase the vocabulary of the students.
★ This method is economical in terms of time and money.

**Limitations:**

✪ Dr.West's notion that ability to read should be developed before developing the ability to speak does not seem sound because reading has some inner speech in it.
✪ Emphasis on reading rather than speech is against the Psychological principle that we always learn a new language by first speaking it.

### TOTAL PHYSICAL RESPONSE

★ Total Physical Response is established by James Asher, an experimental Psychologist.
★ Listening comprehension plays a vital role in language learning.

**Characteristic features:**

★ Learners learn by doing things.
★ Imperative drills (command) make the learners to acquire the language.
★ This method believes in the fact that children develop Listening competence before they gain speech and expression.
★ This method believes in the Psychological principle advocated by Jean Piaget who holds that child acquires language through motor movement.
★ Grammar is taught inductively.

**Advantages:**

★ Practice in the target language makes young children speak. Adhering to instructions (following commands) paves the way to acquire the target language.
★ Learning is made permanent as it is experienced.
★ It is more enjoyable and less stressful.

**Limitations:**

✪ The whole of language cannot be taught through commands.
✪ It is difficult to teach Reading and writing skills through TPR.

### MODEL QUESTIONS

**1.** Oral fluency is the hall mark of ..........
1) GT method 2) Direct method
3) Bilingual method 4) Dr.West's method

**2.** 'Imperative drills in the class room'- is the chief tenet of ..........
1) Direct method 2) Reading method
3) Prussian method 4) TPR

**3.** The learners cannot be confident in speech in the target language when the teacher seeks to adopt ..........
1) GT method 2) Direct method
3) TPR 4) Bilingual method

**4.** To make students speak and write fluently and accurately in the target language is the basic idea of ..........
1) Bilingual method 2) Direct method
3) GT method 4) Reading method

**5.** A reaction to GT method is ..........
1) TPR 2) Bilingual method
3) Prussian method 4) Direct method

**6.** 'Learning to read a language is by far the shortest road to speak and write' applies to ..........
1) Dr.West's New method 2) TPR
3) Direct method 4) GT method

**7.** The restricted use of M.T by the teacher is the principle of ..........
1) GT method 2) Prussian method
3) Bilingual method 4) Reading method

**8.** Use of bilingual lists to teach vocabulary prevails in ..........
1) Reform method
2) Prussian method
3) Text Book Method
4) Total Physical method

**Answers**

1-2 2-4 3-1 4-2 5-4 6-1 7-3 8-2



అనగనగా ఓ ఊరుంది... అక్కడంతా బోలెడు వజ్రాలు.... ఎన్నంటే టన్నులకు టన్నులు... ఏ గోడ చూసినా వజ్రాలే... ఏ గుంజ చూసినా అవే... అయితే వాటిని ఎవ్వరూ తియ్యరు... అస్సలు పట్టించుకోరు... ఎందుకో? ఏంటో?

# తళుకుల్ బెళుకుల్... ఊరంతా వజ్రాల్!



ఎక్కడైనా వజ్రాలు దొరుకుతాయంటే అంతా వెళ్లి గబగబా ఏరేసుకుందాం అనుకుంటాం. అయితే ఓ చిన్న టౌనుంది. ఎక్కడంటే జర్మనీలో. చూస్తే మామూలు టౌనుల్లానే ఉంటుంది ఇదీనూ. ఇక్కడ బోలెడన్ని వజ్రాలుంటాయి. ఎన్నంటే ఏకంగా 72,000 టన్నుల వరకూనట. అయినా చిత్రంగా వాటిని ఎవ్వరూ పట్టించుకోరు.

■ ఈ ఊరి పేరు నోర్డ్‌లింగన్. వజ్రాల్ని పొదుముకున్న టౌననీ దీన్ని పిలుస్తారు. ఇక్కడుండే గోడలు, దుమ్ము... ఇలా అన్ని చోట్లా వజ్రాలు నిక్షిప్తమై ఉంటాయి. కావాలని ఎవరూ వీటినిలా నిక్షిప్తం చెయ్యలేదు.

■ తొమ్మిదో శతాబ్దానికి ముందు నుంచే ఇక్కడ నివాసాలు ఉన్నాయి. అయితే అందుకు పూర్వం ఇక్కడ ఒక అగ్నిపర్వత బిలం ఉండేది. 15 మిలియన్ సంవత్సరాల క్రితం ఇక్కడో గ్రహ శకలం వచ్చి భూమిని బోలెడు ఒత్తిడితో ఢీకొంది.

■ దీంతో అక్కడ రసాయన సమ్మేళనాలు జరిగి చాలానే ఖనిజాలు పుట్టాయి. వీటిల్లో వజ్రాలూ ఉన్నాయి. అయితే అవి మైక్రోస్కోప్‌లో పెట్టి చూస్తే గాని కనిపించనంత బుల్లి బుల్లి రేణువుల్లా ఉంటాయి. ఇక్కడి దుమ్ములో కలిసిపోయి ఉంటాయి.

■ కనీసం కంటికి కనిపిస్తే వాటిని మనం ఆభరణాల్లోనో, మరో విధంగానో వాడుకుంటాం. కానీ రేణువుల్లా కంటికి కనిపించకుండా ఉండే వాటిని ఏం చేసుకుంటాం. అందుకే వాటికి మార్కెట్ విలువా అంతంత మాత్రమే.

■ అందుకే వీటిని ఇక్కడ ఎవ్వరూ పట్టించుకోరన్నమాట. అయితే రెండో ప్రపంచ యుద్ధం సమయంలో జర్మనీలో భీకర వాతావరణం ఉండేది. ఎప్పుడూ యుద్ధాలు జరుగుతుండేవి. ఈ ఊరిని రక్షించుకునేందుకు ఇక్కడి వారు ఆ పక్క పక్కన దొరికే ఇసుక, మట్టిని ఉపయోగించి గోడలు కట్టుకున్నారు. దానితోనే ఇక్కడ కొన్ని ఇళ్లు కూడా కట్టుకున్నారు.

■ సూర్యరశ్మి ఎప్పుడైనా ఏటవాలుగా ఆ గోడలపై పడితే వజ్రాలు ధగధగమని మెరుస్తూ మనకు కనిపిస్తాయి తప్ప ఒట్టిగా అయితే అవి కనే కనిపించవు.

■ ఇక్కడి అగ్ని పర్వత బిలం దాదాపుగా 25 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉండేదట. దీంతో ఆ చోటంతా ఇలా చిన్న రేణువుల్లాంటి వజ్రాలు నిక్షిప్తమయ్యాయట.

■ ఈ వివరాలన్నీ తెలిపేలా ఇక్కడ ఒక మ్యూజియం కూడా ఉంది. పేరు రైస్ క్రేటర్ మ్యూజియం. ఆ అగ్ని పర్వతం పేరు మీదే దీనికీ పేరు పెట్టారు.

■ దీంతో ఈ చిత్రమైన ఊరుని, మ్యూజియంని చూడటానికి ఇక్కడికి ఏటా బోలెడు మంది పర్యాటకులు వస్తుంటారు. తమాషాగా ఉన్న ఈ వివరాలన్నీ వినడానికైతే భలేగా ఉన్నాయి కదూ!

■ వజ్రాలు చిన్న చిన్న రాళ్లలా కాకుండా ఇలా రేణువుల్లా ఎందుకు మారిపోయాయబ్బా? అని ఎవ్వరికైనా సందేహం కలుగుతుంది కదూ! అంతకు ముందు ఇక్కడ గ్రహశకలం పడటం వల్ల పుట్టిన ఒత్తిడికే ఇవిలా రేణువుల్లా మారిపోయాయని కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి.

## హాయ్! బుజ్జీ!!

### నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Bomb - బామ్

Climb - క్లైమ్

### ఆణిముత్యం

శక్తి అనేది డబ్బులో లేదు, మంచితనం, పవిత్రతల్లో ఉంటుంది

- స్వామి వివేకానంద

## చిటపట చినుకులు!

**కథ**

పిల్లగాలి తెమ్మెరొకటి రాలడానికి సిద్ధంగా ఉన్న వాన చినుకుతో కబుర్లకు దిగింది. మబ్బులోని ఆ చినుకు దిగాలుగా ఉంది. కారణమడిగిన గాలితో 'ఎక్కడ రాలతానో, నా బతుకేంకానుందో' అంది దిగులుగా. 'చక్కగా మట్టిలోనో, చెరువులోనో పడతావంతేగా' అంది గాలి.

'అంటే పురుగులు, క్రిములు ఉండే మట్టిలోకో, నాచు నిండిన చెరువులోకో పడి పతనం కావాలా నేను?' అంది చినుకు ఏడుపు ముఖంతో.

'పోనీ ఏ వేడి పదార్థంపైనో పడి ఆవిరవుదువుగానీలే' అంది గాలి ఓదార్పుగా. 'అంటే పుట్టి క్షణం గడవకముందే బతుకు కడతేరిపోతుందా?' అంది చినుకు గాభరాగా.



'ఏమో! ముత్యపు చిప్పలో పడే అదృష్టం పొందుతావేమో దిగులెందుకు' అంది గాలి.

'అంటే నింగిలో స్వేచ్ఛగా విహరించిన నన్ను చిప్పలోను, తర్వాత నగలో పొదిగి బంధీగా పడి ఉండమనా?' అంది చినుకు ఉక్రోషంగా. దాని దిగులును పోగొట్టే ఆఖరి ప్రయత్నంగా గాలి 'పోనీ తళతళమంటూ స్వచ్ఛంగా తామరాకు మీద నిల్చుందువులే' అంది.

'ఛీ.. నిలిచి ఉన్న ఆకునైనా తాకలేని బతుకూ ఓ బతుకేనా?' అంది చినుకు చీదరింపుగా.

సంతోషమే లేని ఆ చినుకు ధోరణికి గాలి నిట్టూర్చింది. పక్కకు చూసింది. ఎంతో కుతూహలంతో నేలను తాకాలని తహతహలాడుతోంది ఓ చినుకు. దాని ముఖమంతా ఉత్సాహం పరుచుకుని ఉంది. ఆశ్చర్యంతో దాన్ని పలకరించింది గాలి.

'నీకు మట్టిలో కలిసిపోతానని భయం లేదా?' అడిగింది.

'ఎందుకూ! అప్పుడు నేను మట్టిలో ఖనిజ లవణాల్ని కరిగించుకుంటాను. చెట్లు నన్ను పీల్చుకోగానే వాటిని అందించగలను. ఎంత మంచి అవకాశం' అంది చినుకు కులాసాగా.

'మరి ఏ వేడి వస్తువుపైనో పడి వెంటనే ఆవిరైపోతే' అంది గాలి.

'మరీ మంచిది. మళ్లీ నింగిలోకి ప్రయాణం. మబ్బు తునకలో భాగంగా స్వేచ్ఛా విహారం' అంది చినుకు తేలిగ్గా.

'ముత్యపు చిప్పలో పడి ముత్యమైపోతావేమో, నింగికెగిరే అవకాశం లేకుండా' అంది గాలి జాలిగా.

'ఆహా! ఎంత భాగ్యం. అప్పుడే కదా. జన్మకు సార్థకత. శాశ్వతత్వం' అంది చినుకు మురిసిపోతూ.

'తామరాకుపై నిలుస్తావనిపిస్తోంది నాకు' అంది గాలి చివరిగా.


'ఎంత చల్లని మాట చెప్పావ్. స్వచ్ఛతను కోల్పోని సంతోషపు బతుకు అప్పుడు' అంది చినుకు చలాకీగా.

ఆ ఆలోచనా ధోరణికి ముగ్ధురాలైంది గాలి. 'ఒకే మబ్బులో పుట్టిన రెండు చినుకులకీ ఎంత తేడా ఉంది? ఆనందమో, విచారమో... మన బతుకు తీరు తేల్చేది మన ఆలోచన విధానమే కదా' అనుకుంది గాలి.

- గుడిపూడి రాధికారాణి


### నీడేది?

మొదటి బొమ్మ నీడను పట్టుకోండి




### సబ్జెక్ట్ ల్యాబ్ గణితం

బొమ్మలు, అంకెలు, గుర్తుల్ని బట్టి లెక్క చేయగలరా?




### స్కూల్ సవాల్

కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?

1. కలర్‌టీవీని కనిపెట్టిందెవరు?
2. ప్రపంచంలో అతి పెద్ద ఎడారి?
3. డైనమోని కనిపెట్టిందెవరు?



- డీఎస్ రాజేష్, పదో తరగతి, ఎస్‌కేఆర్‌ఐఎమ్ స్కూల్, గోరంట్ల, అనంతపురం జిల్లా

జవాబులు: స్కూల్ సవాల్: 1. జాన్ లోగీ బైర్డ్ 2. సహారా ఎడారి 3. మైఖేల్ ఫారడే నీడేది: 2 సబ్జెక్ట్ ల్యాబ్- గణితం: 22 (నీలం గ్లాసు-8, పసుపు గ్లాసు-20, ఎర్ర గ్లాసు-10)

# కాలసూచీ ఆవిష్కరణ


గజిటెడ్ అధికారుల సంఘం కాలసూచీని ఆవిష్కరిస్తున్న పాలనాధికారిణి దివ్య

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** గజిటెడ్ అధికారుల సంఘం రూపొందించిన కాలసూచీని పాలనాధికారిణి దివ్య మంగళవారం తన ఛాంబరులో ఆవిష్కరించారు. తొలుత సంఘ నాయకులు ఆమెకు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంనాయక్, రాజేందర్ దేశ్‌పాండే, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ, ఉపాధ్యక్షులు అశ్రఫ్, శివకుమార్, రమేష్, డీటీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేపు లూయి బ్రెయిల్ జయంతి వేడుకలు

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** అంధుల ఆశాజ్యోతి లూయి బ్రెయిల్ 209వ జయంతి వేడుకలు 4వతేదిన ఉదయం 11 గంటలకు జిల్లా పాలనాధికారి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు స్త్రీ, శిశు, వికలాంగుల జిల్లా సంక్షేమాధికారి కె.మిల్కా తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పాలనాధికారి దివ్యా దేవరాజన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని వివరించారు. జిల్లాలోని అంధ విద్యార్థులు, అంధ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరు పాల్గొని వేడుకలను విజయవంతం చేయాల కోరారు.

# అథ్లెటిక్స్ పోటీలకు రేపు క్రీడాకారుల ఎంపిక

**శాంతినగర్, న్యూస్‌టుడే:** జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు గురువారం విద్యార్థులను ఎంపిక చేస్తున్నట్లు అథ్లెటిక్ క్రీడల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్ల రాజేష్ తెలిపారు. 10, 12, 14 సంవత్సరాల బాలబాలికలకు పరుగు పందెం, షాట్‌పుట్, లాంగ్‌జంప్, 4×100 పరుగుపందెం పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 4వ తేదీన జిల్లాకేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని మైదానంలో వీరి ఎంపిక జరుగుతుందన్నారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈనెల 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి మైదానంలో రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 4న ఇందిరాప్రియదర్శిని మైదానంలో 9గంటల్లోపు సంప్రదించాలన్నారు.

## ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: ఏ నక్షత్రంవారు ఏయే వ్యాపారాలు చేస్తే లాభదాయకం...?, మానసిక ప్రశాంతతకు వాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: టాలీవుడ్ టైమ్స్, 09-00: ఈనాడు సినిమా: ఆదిత్య 369 (బాలకృష్ణ, మోహిని).

**మధ్యాహ్నం**

12-00: తెలుగు'రుచి': మసాలా వంటలు 'చింతకాయ చికెన్', 'గ్రీన్ మసాలా ఫిష్', కారం కారంగా "పొటాటో ఎగ్‌ఆమ్లెట్', చెఫ్స్ స్పెషల్ 'ఆవకాయ మటన్' తయారుచేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి–2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 06-00: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

## ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

| | |
|---|---|
| 12:00 | జబర్దస్త్ రిమిక్స్ |
| 01:00 | మహాతల్లి రిపీట్ |
| 01:15 | ఫ్రూట్స్ రిపీట్ |
| 01:30 | పటాస్ రిపీట్ |
| 02:00 | అల్లరే అల్లరి రిపీట్ |
| 02:30 | సరదాగా కాసేపు రిపీట్ |
| 03:00 | తారక్ మామా అయ్యోరామ రిపీట్ |
| 03:30 | క్రేజీ కిడ్స్ రిపీట్ |

సాయంత్రం

| | |
|---|---|
| 04:30 | నా షో నా ఇష్టం రిపీట్ |
| 05:00 | జిల్ జిల్ జిగా |
| 06:00 | అమృతం రిపీట్ |
| 06:30 | ఎక్స్‌ప్రెస్ రాజా |
| రాత్రి 07:30 | తారక్ మామా అయ్యోరామ |
| 08:00 | అల్లరే అల్లరి |
| 08:30 | సరదాగా కాసేపు |
| 09:00 | పటాస్ |
| 10:00 | అమ్మాయి క్యూటు అబ్బాయి నాటు |
| 10:15 | పిట్టగోడ |
| 10:30 | సినిమా చూపిస్త మావ రిపీట్ |
| 11:30 | ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్ |

## ఈటీవీ లైఫ్

- ★ మానస: సాఫ్ట్ స్కిల్స్ ఎవరికి ఎంత అవసరం - పార్ట్2 (ఉ. 6:00, రా. 11:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా. 6:00, రా. 10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 6:30, రా. 10:00)
- ★ అమృతం: సూపర్ ఎగ్స్ (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 1:00, రా. 8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ. 1:30)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్: స్త్రీలలో మూత్రనాళ సమస్యలా? ఎటువంటి జాగ్రత్తలు అవసరం? (ఉ. 9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (మ. 2:00, రా. 7:00)
- ★ అంతరంగం: మీ పిల్లల ఫోన్లను చెక్ చేయాలనుకుంటున్నారా? మరి వారిని ఎలా మ్యానేజ్ చేయాలి? (ఉ. 10:00)
- ★ సుఖజీవనం (మ. 2:30, రా. 9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. రక్తంలో పూడికలు ఏర్పడడానికి కారణాలు, 2. మనం హోటళ్ళో తినగా మిగిలిన ఆహారాన్ని ప్యాక్ చేసి ఇంటికి తీసుకొని వెళ్లడం మంచిదేనా?, 3. శరీరంలో వాపుల వెనుక దాగున్న వాస్తవాలు (ఉ. 10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి వివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (మ. 3:00, రా. 9:00)
- ★ డా. ఈటీవి: మధుమేహం (ఉ. 11:00)
- ★ డా. ఈటీవి: ENT (ఉ. 11:15)
- ★ డా. ఈటీవి: క్యాన్సర్ కేర్ (మ. 3:30, రా. 7:30)
- ★ డా. ఈటీవి: దంత సంరక్షణ (మ. 3:45, రా. 7:45)

## ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: గృహప్రవేశం (మోహన్‌బాబు, జయసుధ) 10-00: మార్నింగ్ షో: విచిత్ర వివాహం (గుమ్మడి, భానుమతి) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: రాజేంద్రుడు–గజేంద్రుడు (రాజేంద్రప్రసాద్, సౌందర్య) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: మొగుడుగారు (వినోద్‌కుమార్, రోజా) రాత్రి: 7-00: ఫస్ట్ షో: అదృష్టవంతులు (ఏఎన్నార్, జయలలిత) 10-00: సెకండ్ షో: మంచుపల్లకీ (చిరంజీవి, సుహాసిని).

## ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - స్ప్రౌట్స్ చపాతీ ఛాట్ & గోధుమగడ్డి పుట్టగొడుగుల ఉప్మా, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలిచెనా బొరుగుల ఉప్మా & పచ్చిమిర్చి మొక్కజొన్న మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - అవలక్కి ఎర్రియప్ప, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - రాగి అండ్ ఓట్స్ ఇడ్లీ, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - అల్లం స్మూతీ, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - ఉసిరి కొబ్బరికాయ అన్నం & గుమ్మడికాయ దప్పలం, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - టూటీ ఫ్రూటీ కేక్, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ - వెజిటబుల్ జ్యూస్ పిప్పి తో రోటి, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - వేరుశెనగ బఠానీల ఛాట్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పారిస్ క్యూసైన్) - కొలంబి పాపిటో టెట్రాలో & శాలి బోటి, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) పచ్చి కందుల చికెన్ కర్రీ, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ - చాకో చిప్ కుకీస్ & పొటాటో స్ట్రిప్స్, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - పెరుగు మిర్చి మటన్ బిర్యానీ & కాజు మటన్ ఫ్రై, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - మసాలా బఠానీ, మ.2.45, రా.10.30: ఎట్‌హోమ్ - స్ట్రాబెర్రీ జెల్లీ & స్పైసీ మింట్ యోగర్ట్, మ.3.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా మూర్గ్.

## ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రిపీట్), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ అయ్యప్పస్వామి ఆలయం, గొల్లపూడి, విజయవాడ, 05-00 ఘంటారావం, 05-30 వాణిజ్య కార్యక్రమం, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్).

## ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం 03-30 తీర్థయాత్ర: శ్రీ అయ్యప్పస్వామి ఆలయం, కామారెడ్డి, కామారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 వాణిజ్య కార్యక్రమం, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీసంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

## ఏ ఛానల్లో ఏముంది.. 03-01-2018

**SVBC** — **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (సహస్ర కలశాభిషేకం), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయె - వినాయకుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 శ్రీకృష్ణ ఆలయదర్శిని, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 విలువలు - విజ్ఞానం (ప్రణయకాల ఉత్సవం - తిరుమల), 05-00 లైవ్ ప్రణయకాల ఉత్సవం - తిరుమల, 06-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల, 06-30 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు + భక్తిచైతన్యం, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - ప్రసన్న సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

**భక్తి TV** — **ఉదయం:** 06-00 శ్రీలలితాసహస్రం, 06-30 హనుమాన్‌చాలీసా, 07-00 అర్చన, 07-30 శ్రీకనకధారాస్తోత్రం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 09-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మ సందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీకనకధారస్తోత్రం, 5-30 హనుమాన్‌చాలీసా, 6-00 శ్రీలలితాసహస్రం, 7-00 భక్తివిశేషాలు, 7-30 అమృతకలశం, 8-00 అయ్యప్ప పడిపూజ, 08-30 శ్రీమద్భగవద్గీత, 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

**ZEE తెలుగు** — **ఉదయం:** 07-00 టెలీషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: సైనికుడు, 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 రారండోయ్ వేడుకచేద్దాం, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 కళ్యాణ వైభోగం రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ రీరన్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 రారండోయ్ వేడుకచేద్దాం (రిపీట్).

**maa** — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: అతడు, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్ర బంధం, 10-00 నీలికలువలు, 10-30 దసర వచ్చిందయ్య (రిపీట్).

**GEMINI** — **ఉదయం:** 06-00 టెలీషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: పెళ్లిచేసుకుందాం, 11-30 నాగిని 2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆర్య, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జైజై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 జూలకటక- డబుల్ డోస్, 10-30 సినిమా: నేనున్నాను.

**HBO** — **ఉదయం:** 06-00 మ్యూనిక్, 08-47 ది ఎకౌంటెంట్, 11-00 ట్రాన్స్‌ఫార్మర్స్: డార్క్ ఆఫ్ ది మూన్, **మధ్యాహ్నం:** 01-47 టవర్ ఆఫ్ డెత్, 03-25 బీథోవెన్, **సాయంత్రం:** 05-01 ఐరన్ మ్యాన్, **రాత్రి:** 07-12 ది టుక్సెడో.



# సమస్యాత్మక భూముల్లో వరి సాగు



రబీ సీజన్‌లో బావులు, బోర్ల కింద సాగుచేసే వరిపైరు చౌడు ఉన్న భూముల్లో సరిగా నిలదొక్కుకోలేక ఎర్రబడి ఎదుగుదల లోపిస్తుంది. ఇలాంటి భూముల్లో వరి నాటుకు ముందు సరైన మెలకువలు పాటిస్తే సమస్యను అధిగమించి మంచి దిగుబడులు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్త టి.యాదగిరిరెడ్డి సూచించారు.

**మెలకువలు:** ఈ భూముల్లో నీరు ఇంకే స్వభావం తక్కువ కాబట్టి పొలం చుట్టూ మురుగునీరు వెళ్లడానికి కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. మట్టిపరీక్ష చేయించి అవసరం మేరకు జిప్సం వాడాలి. సున్నం పాలు ఎక్కువగా ఉంటే గంధకం వేసుకోవాలి. పచ్చిరొట్ట పైర్లు వేసి పూత సమయంలో నేలలో కలియదున్నాలి. రబీలో అవకాశం లేని చోట కంపోస్టు ఎరువులు వేసుకోవాలి. లేదా పశువుల ఎరువు ఉంటే ఎక్కువగా వేసుకోవచ్చు. భూమిని ఎక్కువగా దమ్ము చేయకూడదు. ఎక్కువ సార్లు దమ్ముచేస్తే పొలం బుడుగెత్తి మొక్కలు సరిగా నిలదొక్కుకోలేవు. ముదురు నారు నాటుకోవాలి. దగ్గర దగ్గరగా నాటుకోవాలి. కుదురుకు కనీసం 4 మొక్కలు నాటుకోవాలి. మొక్క తొలిదశలో, పొట్ట దశలో లవణాల వల్ల వరి మొక్కలకు హాని కలుగుతుంది కాబట్టి నీరు ఎక్కువగా పెట్టాలి. అప్పుడప్పుడు పాత నీరు తీసేస్తూ కొత్త నీరు పెట్టాలి. చెరకు కర్మాగారాల నుంచి వ్యర్థ పదార్థాలను తెచ్చి జిప్సమ్‌కు బదులుగా వాడుకోవచ్చు. ఎకరాకు 1 టన్ను ప్రెస్‌మడ్‌ను వేసుకోవచ్చు. ఈ భూమిలో జింక్ లోపం బాగా కన్పిస్తుంది. కాబట్టి ఎకరానికి 20 నుంచి 40 కిలోల జింకు సల్ఫేట్ వేసుకోవాలి. పైపాటుగా పైరుపై జింక్‌లోపం గమనిస్తే లీటరు నీటికి 2 గ్రాముల జింక్‌సల్ఫేట్ కలిపి పిచికారి చేసుకుని జింక్ లోపాన్ని నివారించుకోవచ్చు. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు వాడాలి. భాస్వరం, సూపర్‌ఫాస్ఫేట్ రూపంలో వేయాలి. ఇందులో కాల్షియం, గంధకం ఉండి చౌడు విరగడానికి ఉపయోగపడుతుంది. పాలచౌడు నేలలైతే మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయకూడదు. రైతులు సమస్యాత్మక భూముల్లో సాగు చేసేటపుడు వరి రకాలను ఎంచుకోవడంలోనూ జాగ్రత్తలు పాటించాలి.

– న్యూస్‌టుడే, గరిడేపల్లి

# వ్యాధి సోకిన జీవాలకు చికిత్స



జీవాలకు వ్యాధి సోకినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని సంగారెడ్డి జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రామారావు రాథోడ్ తెలిపారు.

★ సన్న జీవాలకు వ్యాధిని తట్టుకునే శక్తి తక్కువ. అందుకే వ్యాధి సోకినట్లు అనుమానం వచ్చిన వెంటనే చికిత్స ప్రారంభించటం మంచిది. ఎంత త్వరగా చికిత్స ప్రారంభిస్తే అంత త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

★ వ్యాధి సోకిన జీవాలను మంద నుండి వేరుచేసి ప్రత్యేకంగా చికిత్స చేయాలి. మందతో పంపించటం వల్ల వ్యాధి తీవ్రత ఎక్కువవుతుంది. వ్యాధి ముదిరితే చికిత్స కష్టంగా మారుతుంది.

★ వ్యాధి సోకినప్పుడు యాంటిబయాటిక్ ఇంజక్షన్లు వైద్యుల సలహా ప్రకారం వాడాలి.

★ జ్వరం తగ్గటానికి పారాసిటమాల్ ఇంజక్షన్లు, నొప్పులు, వాపులు తగ్గటానికి తగిన మందులు వాడాలి.

★ నీరసం, ఆకలిలేమి తగ్గటానికి, మేత మేయటానికి బీ-కాంప్లెక్స్, లివర్‌కు సంబంధించిన ఇంజక్షన్లు వాడితే ప్రయోజనం ఉంటుంది.

★ డీహైడ్రేషన్ తగ్గటానికి డెక్ట్రోజ్ సెలైన్ రక్తనాళాల్లోకి ఎక్కించాలి.

★ నోటిపుండ్లను 1 శాతం పొటాషియం పర్మాంగనేటు ద్రావణంతో శుభ్రంచేసి, జింక్ ఆక్సైడ్ ఆయింట్‌మెంట్ పూయాలి. ముఖంపైన, కాళ్ల పైన పుండ్లకు ఈగ, దోమలు వాలకుండా వేపనూనె వంటివి వాడాలి.

★ జీవాలు వ్యాధులకు గురయినపుడు మేత మేయక నీరసంతో చనిపోతుంటాయి. ఈ జీవాల సంరక్షణపై ప్రత్యేకదృష్టి సారించకపోతే ఇబ్బందులు తలెత్తుతాయి. రాగి, జొన్న జావ లేదా అరటిపళ్లు తినిపించాలి. అందులో చిటికెడుఉప్పు, కొద్దిగా బెల్లంకలిపి ఇవ్వాలి. నమిలేందుకు వేపాకు లేత కొమ్మలు అందుబాటులో ఉంచాలి. విరేచనాలతో బాధపడుతూ, మరీ నీరసంగా ఉన్న జీవాలకు కొబ్బరి నీళ్లు తాగించాలి.

★ యాంటిబయాటిక్ మందుల్ని విచక్షణారహితంగా వాడకూడదు. యాంటిబయాటిక్ మందులను వాడటం ప్రారంభిస్తే 3-5 రోజుల పాటు వరుసగా వాడాలి. అలాకాకుండా మధ్యలో వేరే యాంటిబయాటిక్ వాడకూడదు.

★ పొటాషియం పర్మాంగనేటు ద్రావణాన్ని చిక్కగా తయారుచేసి వాడితేనే ప్రయోజనం ఉంటుందన్నది అపోహ మాత్రమే. ఎక్కువ మోతాదులో వాడితే దుష్ఫలితాలు ఉంటాయి.

– న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

# ఆదివాసీలంటే గౌరవం..

## ఆందోళనలపై నా వ్యాఖ్యలు వక్రీకరించడం బాధకలిగించింది ✤ మంత్రి జోగు రామన్న

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** ఆదివాసీలంటే గౌరవమని.. జిల్లా వాసిగా వారి సాధకబాధలన్నీ తెలుసు. ఆదివాసీల ఆందోళన వెనుక మాజీ మావోయిస్టులు ఉన్నారని తాను అనలేదని మంత్రి జోగు రామన్న పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని అటవీ శాఖ విశ్రాంతి భవనంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గిరిజనుల ఆందోళన చాలా సున్నితమైందని వివరించారు. అలాంటి ఆందోళనలపై తన మాటలు వక్రీకరించడం చాలా బాధేసిందన్నారు. ఆదివాసీలు దిష్టిబొమ్మ దహనం చేయడం తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులపై తనకు అపార ప్రేమ ఉందని వివరించారు. ఆదివాసీలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని వెల్లడించారు. గిరిజనుల సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. అందుకనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని జిల్లాకు పంపించిందని తెలిపారు. ఇందులో భాగంగానే కొంతమంది అధికారులను బదిలీ చేశారని గుర్తుచేశారు. చర్చల ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. తాను ఆత్మగౌరవం ఉన్న వ్యక్తినని తెలిపారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆరె రాజన్న, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ నిర్వాహకురాలు కస్తాల ప్రేమల, పార్టీ పట్టణ అధ్యక్షుడు సాజిదొద్దీన్, పెందూర్ దేవన్న, నైతం శుక్లాల్, పార్టీ రైతు విభాగం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు భోజారెడ్డి, లింగారెడ్డి, అశోక్ స్వామి, బండారి సతీష్, అందె శ్రీదేవి, మేకల అశోక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



తెరాస నేతలతో కలిసి విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జోగురామన్న

## చనకా-కోర్ట భూసేకరణకు రూ.54 కోట్లు కావాలి

### ప్రభుత్వాన్ని కోరిన పాలనాధికారిణి దివ్య

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని పెన్‌గంగా నదిపై నిర్మిస్తున్న చనాకా-కోర్ట ప్రాజెక్టు కింద భూసేకరణకు ఇంకా రూ.54కోట్లు అవసరమని పాలనాధికారిణి దివ్య పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం సచివాలయం నుంచి జిల్లాల వారీగా దూరదృశ్య సమీక్ష నిర్వహించిన ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జోషి దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటివరకు ప్రాజెక్టు కింద 1023 ఎకరాలను సేకరించి పరిహారం కింద రూ.62 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. ఇంకా 800 ఎకరాలు సేకరించాల్సి ఉందని, ఇందుకు రూ.54 కోట్లు కావాల్సి ఉంటుందని వివరించారు. ఇప్పటివరకు వెచ్చించిన నిధులకు సంబంధించిన వినియోగపత్రాలను త్వరలో సమర్పిస్తామని పేర్కొన్నారు. సమీక్షలో జిల్లా సంయుక్త పాలనాధికారి కె.కృష్ణారెడ్డి, ఆర్డీవో సూర్యనారాయణ, నీటిపారుదలశాఖ ఎస్ఈ హుస్సేన్, ఈఈ సుశీల్‌కుమార్, డీఈలు రమణ, రవిందర్, పాలనాప్రాంగణ పర్యవేక్షకులు అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న పాలనాధికారిణి దివ్య

# పాత్రికేయ వృత్తి కత్తి మీద సామే!

- ✦ వృత్తిపరంగానే కాదూ.. ఆరోగ్యంపైనా జాగ్రత్త వహించండి
- ✦ అరుణ్‌సాగర్ స్మారక పురస్కార ప్రదానోత్సవంలో మంత్రి హరీష్‌రావు సూచన
- ✦ 'ఈటీవీ' ఆదిలాబాద్ విలేకరి మణికేశ్వర్‌కు పురస్కారం

**నారాయణగూడ, న్యూస్‌టుడే:** విధి నిర్వహణలోనే కాకుండా ఆరోగ్య పరిరక్షణలో కూడా పాత్రికేయులు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరమని మంత్రి హరీష్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సీనియర్ జర్నలిస్టు అరుణ్‌సాగర్ స్మారక ఉత్తమ జర్నలిస్టు పురస్కారాల ప్రదానోత్సవం మంగళవారం రాత్రి హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో నిర్వహించారు. ప్రాణ భయంతో అడవిలో జీవనం సాగిస్తున్న తండ్రి, కూతుళ్ల జీవితాన్ని సజీవంగా ఆవిష్కరించిన 'ఈటీవీ' ఆదిలాబాద్ రిపోర్టర్ మణికేశ్వర్ తృతీయ బహుమతి అందుకున్నారు. ఇదే వేదికపై ప్రముఖ కవి గోరటి వెంకన్నను సాహితీ పురస్కారంతో సత్కరించారు. ముఖ్యఅతిథి హరీష్‌రావు మాట్లాడుతూ.. వార్తా సేకరణ, సమాచార సేకరణలో పగలు, రాత్రి అనే తేడా లేకుండా అహర్నిశలు శ్రమించే పాత్రికేయులు అంకితభావంతో విధి నిర్వహణ చేస్తుంటారన్నారు. ప్రతిభావంతుడైన పాత్రికేయుడు అరుణ్‌సాగర్ చిన్న వయసులోనే అకాల మరణం చెందడం దురదృష్టకరమని ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలోని చింతూరు మండలంలోని గిరిజన తండాలు, ఆదివాసీల జీవితాలు ప్రత్యక్షంగా చూసిన అరుణ్‌సాగర్ తన రచనల్లో వాటిని ప్రతిబింబింపజేశారని కొనియాడారు. తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు అల్లం నారాయణ పురస్కార గ్రహీతలను ప్రకటించారు. పత్రికా రంగంలో పర్కలా కిష్టయ్యకు మొదటి బహుమతి, శివరామకృష్ణకు ద్వితీయ బహుమతి, కట్టానరేంద్రచారి, కోలా నాగేశ్వరరావులకు తృతీయ బహుమతి అందజేశారు. ప్రసార మాధ్యమాల్లో యాజులుకు ప్రథమ బహుమతి, నరేంద్రచారికి ద్వితీయ, మాణికేశ్వర్‌కు తృతీయ బహుమతి అందించారు. పార్లమెంట్ సభ్యులు బాల్క సుమన్, ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ కవులు గోరటి వెంకన్న, శివారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు. జ్యూరీ సభ్యులు ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, నమస్తే తెలంగాణ సంపాదకులు కట్టా శేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.



మణికేశ్వర్‌ను సన్మానిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ మీడియా అకాడమీ అధ్యక్షులు అల్లంనారాయణ తదితరులు

## జాతీయస్థాయి పోటీలకు పెండ్‌వాడ విద్యార్థులు

**జైనథ్, న్యూస్‌టుడే:** జైనథ్ మండలం పెండల్‌వాడ గ్రామానికి చెందిన విద్యార్థులు రాకేష్, పొచ్చిరాం ఈ నెల 3 నుంచి 9 వరకు న్యూ దిల్లీలో జరిగే అండర్ -17 తాడాట జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరినట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేష్ తెలిపారు. పదో తరగతి చదువుతున్న వీరు అక్టోబర్‌లో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి వెండి పతకాలు సాధించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల వ్యాయామ ఉపాధ్యాయుడు సాయికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



ఉపాధ్యాయులతో విద్యార్థులు రాకేష్, పొచ్చిరాం

## శుభ లేఖలు కావివి.. నూతన సంవత్సర శుభాకాంక్షలు

**ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే:** కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలుపుతు మంత్రి జోగు రామన్న ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులకు లేఖలు పంపుతున్నారు. వారందరికి ఆ లేఖలు అందేలా జడ్పీ కార్యాలయానికి పంపించారు. జడ్పీ నుంచి నాలుగు జిల్లాకేంద్రాలకు పంపితే అక్కడినుంచి ఎంపీడీఓ సిబ్బంది తీసుకెళ్లి ఆయా మండలాల్లో ప్రజాప్రతినిధులకు పంచనున్నారు. ఇలా మంత్రి స్వగృహం నుంచి మంగళవారం జిల్లాపరిషత్ కార్యాలయానికి వచ్చిన నూతన సంవత్సర కార్డులు ఎక్కువ సంఖ్యలో ఉండడం మూలాన శుభ లేఖలను తలపించడంతో తొలుత సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఉమ్మడి జిల్లాలోని 536 ఎంపీటీసీలు, 52 మంది జడ్పీటీసీలు 866 మంది సర్పంచిలకు ఇవి అందజేయాలి. జడ్పీకి వచ్చిన లేఖల చిత్రాలివీ.




సీఎం కేసీఆర్, మంత్రి రామన్న చిత్రపటాలతో ఉన్న లేఖలు

### ఈనాడు-ఈటీవీ తెలంగాణ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీలో జనవరి I విజేతలు

1. జి.సరిత, మందమర్రి; 2. కె. స్వరూప, సెంటెనెరీ కాలనీ, పెద్దపల్లి; 3. కె. లావణ్య, నిజామాబాద్; 4. ఎస్. ఆకాంక్ష, నారాయణఖేడ్; 5. కె. కరుణ, హైదరాబాద్; 6. ఎం. నిరోష, మందమర్రి; 7. కె.వరలక్ష్మి, హైదరాబాద్, 8. ఎస్.సరస్వతి, గోపాల్‌పూర్; 9. ఎస్.స్రవంతి, భూపాలపల్లి; 10. స్వప్న, హన్మకొండ. విజేతల వివరాలను ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

# బదిలీ పాలనాధికారులకు పోస్టింగులు

## బెల్లంపల్లికి సబ్‌కలెక్టర్‌గా యువ ఐఏఎస్

**పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే:** ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పనిచేస్తూ ఇటీవల ఒకేసారి బదిలీవేటుకు గురైన ముగ్గురు పాలనాధికారులకు ప్రభుత్వం మంగళవారం పోస్టింగులు ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఆవిర్భవించిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రెవెన్యూ డివిజన్‌కు యువ ఐఏఎస్‌ను సబ్‌కలెక్టర్‌గా నియమించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారిగా పనిచేసిన బుద్ధప్రకాష్‌ఎం.జ్యోతికి ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా, నిర్మల్ పాలనాధికారిగా పనిచేసిన కె. ఇలంబరిదిని సమాచార శాఖ కార్యదర్శిగా, ఆసిఫాబాద్ పాలనాధికారిగా పనిచేసిన ఎం.చంపాలాల్‌ను సైనిక సంక్షేమశాఖ సంయుక్త కార్యదర్శిగా నియమించగా.. ప్రస్తుతం మంచిర్యాల జిల్లా పాలనాధికారిగా ఉన్న ఆర్.వి. కర్ణన్‌కి జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా పాలనాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదేమాదిరి ఉమ్మడి జిల్లాలో ఏడాది కిందట శిక్షణ ఐఏఎస్‌గా పనిచేసిన అనురాగ్ జయంత్‌ని బోధన్ సబ్‌కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్.పి.సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. ఇదిలా ఉంటే బదిలీ వేటుపడ్డ పాలనాధికారులకు మంచి పోస్టింగ్‌లు లభించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

### బెల్లంపల్లి సబ్‌కలెక్టర్‌గా రాహుల్‌రాజ్

**బెల్లంపల్లి, బెల్లంపల్లి పట్టణం:** బెల్లంపల్లి సబ్‌కలెక్టర్‌గా పి.ఎస్. రాహుల్‌రాజ్‌ను నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. బెల్లంపల్లి ఆర్డీఓ జి.వీరన్నను బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఐఏఎస్ 2015 బ్యాచ్‌కు చెందిన రాహుల్‌రాజ్‌ను నియమించారు. రాహుల్‌రాజ్ నిజామాబాద్ జిల్లాలో, రాష్ట్ర ఆరోగ్య శాఖలో పనిచేశారు. కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం బెల్లంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం మొదటి సారిగా ఐఏఎస్ అధికారిని సబ్‌కలెక్టర్‌గా నియమించింది.



# బెల్లంపల్లి

## కస్తూర్బా పాఠశాలలో దోమతెరల పంపిణీ

**నెన్నెల, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకులంలో మంగళవారం దోమ తెరలను ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచి ఆస్మా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా దోమ తెరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు సైతం దోమ తెరల ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఇబ్రహీమ్ పధానోపాధ్యాయురాలు పద్మజ, ఆరోగ్యశాఖ పర్యవేక్షులు మెర్సి వెంకటరమణ పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దారు ఎదుట హాజరుపరచిన అనుమానితులు

## సారా తయారీ అనుమానితుల బైండోవర్

**తాండూరు, న్యూస్‌టుడే:** తాండూరు మండలంలోని పలు గ్రామాల్లో నాటు సారా తయారీదారులుగా అనుమానిస్తున్న పలువురు వ్యక్తులను మంగళవారం బైండోవర్ చేసినట్టు ఆబ్కారీ సీఐ దీపక్ తెలిపారు. తాండూరు మండలం తంగళ్లపల్లి, కిష్టంపేట, కన్నెపల్లి మండలంలోని కిష్టాపూర్ గ్రామాలకు చెందిన ఐదుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని తాండూరు తహసీల్దారు ఎదుట హాజరు పరచినట్టు ఆయన తెలిపారు. నాటు సారా తయారీదారులుగా అనుమానిస్తున్న వ్యక్తుల స్థావరాలపై ఆబ్కారీ ఎస్సై నర్సింహాచారి, ప్రభాకర్, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించి వారిని అదుపులోకి తీసుకుని హాజరు పరచినట్టు సీఐ తెలిపారు.



నగదు అందజేస్తున్న తెరాసవి జిల్లా సమన్వయకర్త బడికెల శ్రావణ్

## క్రీడాకారిణికి సాయం

**బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన జాడి సుప్రియను తెరాసవి జిల్లా సమన్వయకర్త అభినందించారు. మారుమూల గ్రామం నుంచి వచ్చి కరాటే పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగడం చూస్తుంటే గ్రామీణప్రాంతాల్లోనూ నైపుణ్యం కలిగిన క్రీడాకారులు ఉన్నారని శ్రావణ్ చెప్పారు. శ్రావణ్ తన తండ్రి బడికెల వెంకటస్వామి జ్ఞాపకార్థంగా రూ.5వేలు సుప్రియను ఖర్చుల నిమిత్తం అందజేశారు. కార్యక్రమంలో శిక్షకుడు ఆవుల రాజనర్సు, తెరాసవి నాయకులు రాజేష్‌లు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి టీకా తప్పనిసరిగా వేయాలి

**నెన్నెల, న్యూస్‌టుడే:** పశువులకు గాలి కుంటు వ్యాధి కోసం టీకాలు తప్పని సరిగా వేయాలని పశువైద్యాధికారి దిలీప్ తెలిపారు. మండలంలోని నందులపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమంలో పాల్గొని రైతులతో మాట్లాడారు.. ముందస్తుగా పశువులకు గాలికుంటు టీకాలు వేస్తే వ్యాధి రాకుండ ఉంటుందన్నారు. ప్రభుత్వం ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి సాగర్‌గౌడ్, సిబ్బంది శంకర్ పలువురు రైతులు పాల్గొన్నారు.

### గ్యాస్ సమాచారం

| ఏజెన్సీ పేరు | ఫోన్ నెం. | క్లియరెన్స్ తేదీ |
|---|---|---|
| అరవింద్(భారత్) | 08735 222210 | 03.01.2018 |
| సింగరేణి(ఇండేన్) | 08735 222168 | 01.01.2018 |

## నేడు మాలమహానాడు సంఘం సమావేశం

**బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని మాలమహానాడు సంఘం సమావేశం బుధవారం ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని ఆ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల యాదగిరి తెలిపారు. అంబేడ్కర్ ఫెలోషిప్ ఆవార్డు గ్రహీతలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల రాంమూర్తి హాజరవుతారని తెలిపారు.

## చైతన్యం స్ఫురించేలా ముగ్గులు వేసిన విద్యార్థులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

**పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో నాటుకున్న ఆలోచనలే భవిష్యత్తుకు దారి చూపిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. సామాజిక చైతన్యం తీసుకురావడం, ఆ దిశలో మిగతా విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగేలా చూడడం ఆలోచించదగ్గ పరిణామం. నూతన సంవత్సర వేడకలు మొదలుకుని సంక్రాంతి, ఉగాది, దీపావళి ఇలా ప్రతి పండగకు ఓ ప్రత్యేకత ఉంటుంది. ప్రత్యేకత సందర్భం ఏదైనా సామాజిక చైతన్యం నింపేలా ముగ్గులు వేయడం కస్తూర్బా విద్యార్థినులు అలవర్చుకున్నారు. పాఠశాలలో ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు వినూత్నంగా ఆలోచిస్తారు. సమాజానికి ఉపయోగపడే ముగ్గులు వేయడం, నినాదాలు రాయడం ఇక్కడి విద్యార్థినులకు అలవాటుగా మారింది. బెల్లంపల్లి కస్తూర్బా గాంధి విద్యాలయంలో విద్యార్థినుల ముగ్గుల నైపుణ్యంపై 'న్యూస్‌టుడే' కథనం**



ఆడపిల్లల చదువుపై ముగ్గు

పండగల సీజన్ వచ్చిందంటే కస్తూర్బా విద్యార్థినులు ముగ్గులు వినూత్నంగా వేయడానికి పోటీ పడతారు. ముగ్గుల్లో సామాజిక చైతన్యానికే ప్రాధాన్యం ఇస్తారు. ముగ్గువేసిన తర్వాత స్ఫూర్తినిచ్చేలా ఏదో ఒక నినాదం ఉంటుంది. 200మంది విద్యార్థినులు ఉన్న ఈ పాఠశాలలో ప్రతి ఒక్కరు ముగ్గుల పోటీల్లో పాల్గొనడానికి ఉత్సుకత చూపుతారు. ఇలాచేయడంతో విద్యార్థినుల దృష్టంతా సామాజిక నేపథ్యం చుట్టే తిరగుతుంది. సమాజంలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి విద్యార్థినులకు మంచి అవకాశం దక్కుతుంది. పాఠశాల ప్రత్యేకాధికారిణి లలిత కూడా ప్రత్యేక చొరవ తీసుకుని ఇలాంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నారు.

### స్ఫూర్తి రగిలించేలా ముగ్గులు

ఆడపిల్లలకు చదువు ఎందుకు అవసరం అంటూ వారిని ఇంటికే పరిమితం చేశారు ఆనాడు. ఈనాడు మాత్రం ఆడపిల్ల చదువుకుంటనే భవిష్యత్తని ముగ్గులతో విద్యార్థినులు ప్రచారం చేస్తున్నారు. ఆడపిల్ల చదువు ఇంటికి వెలుగు అన్న సూక్తిని ముగ్గుల వేసి చూపించారు. ఆడపిల్లలను బతికించండి అంటూ విద్యార్థినులు చేసిన నినాదం ఆకట్టుకుంది. బంగారు తెలంగాణ సాధించాలంటూ ఆకాంక్షిస్తూ వేసిన ముగ్గులు ఆసక్తి రేపాయి. అన్ని మతాలు సమానమే అన్న భావన నాటుకునేలా ముగ్గు వేశారు. ప్రకృతి సమాజానికి ఎంత ప్రధానమో ముగ్గుల ద్వారా వివరించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతంటూ నినాదమిచ్చారు.

### విద్యార్థుల ఆలోచనలకు కొదవలేదు

**- లలిత, ప్రత్యేకాధికారిణి**



ఆడపిల్లలు అద్భుతాలను సృష్టించగలరు. ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసేలా వారి ఆలోచనలు ఉంటున్నాయి. ఏ పోటీ నిర్వహించినా వారి ఆలోచనల్లో ప్రతిసారి మార్పు వస్తుంది. సమాజానికి దోహదం చేసే అంశాలను జోడించి ముగ్గులు వేయడం వారికున్న సామాజిక స్పృహకు అద్దం పడుతోంది. చిన్నతనంలో సమాజం అంటే ఏమిటో తెలిస్తే జీవితంలో విజయం సాధించగలరు. చాలా మంది విద్యార్థినులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు.





భారత్ లౌకికవాదదేశమంటూ వేసిన ముగ్గు



ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు

## అక్రమ నిర్మాణాలపై బల్దియా కన్నెర్ర

### ■ కూల్చివేతకు యత్నించిన అధికారులు

**బెల్లంపల్లి, న్యూస్‌టుడే:** బెల్లంపల్లి పురపాలకసంఘం పరిధిలోని కాల్‌టెక్స్, స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందున్న భూముల్లో అక్రమంగా నిర్మాణాలు లేఅవుట్లు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు మంగళవారం ఆ ప్రాంతాల్లో బల్దియా అధికారులు పర్యటించారు. మున్సిపల్ కమిషనర్ జి.రాజు, ఆర్.ఓ.మల్లారెడ్డి, టీపీఎస్ సంపత్, ఇతర సిబ్బంది ముందుగా కాల్‌టెక్స్‌లోని సర్వేనెం.109 లో చేస్తున్న లేఅవుట్ దగ్గరకు వెళ్లి అక్కడ పాతిని సిమెంట్ దిమ్మెలను తొలగించారు. భూమికి సంబంధించిన అన్నీ కాగితాలను కార్యాలయంలో సమర్పించే వరకు ఏలాంటి పనులు చేయరాదని కమిషనర్ సంబంధిత లేఅవుట్ యజమానులకు తెలిపారు. అనంతరం స్థానిక సింగరేణి ఏరియా ఆసుపత్రి ముందున్న సర్వే నెం. 170 భూమిలో ఏలాంటి మున్సిపల్ అనుమతి లేకుండా అక్రమంగా నిర్మాణం చేసిన కట్టడాలను కూల్చివేయడానికి పొక్లెయిన్‌తో అధికారులు వెళ్లారు. అక్కడ ఇష్టారాజ్యాంగా ఏలాంటి అధికారికి అనుమతులు, పత్రాలు లేకుండా నిర్మాణం చేసినన వాటిని వారు కూల్చేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో కొందరు అక్రమార్కులకు మద్దతుగా ప్రజాప్రజాప్రతినిధులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో తగిన ఆధారాలు,పత్రాలు తీసుకుని కార్యాలయానికి రావాలని వారికి అధికారులు చెప్పారు. దీంతో ఇక్కడ కొంచెం సేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా కమిషనర్ జి.రాజు మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడ నిర్మాణాలు చేసినా వారికి అధికారిక అనుమతి ఉండాలన్నారు. లేకుంటే వాటిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఏరియా ఆసుపత్రి ముందు వెలిసిన అక్రమ నిర్మాణాలు



ఖాళీ స్థలం చుట్టూ ప్రహరి నిర్మాణం



ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులతో ప్రధానోపాధ్యాయులు థామస్ చిరాయిల్

## అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

**బెల్లంపల్లి పట్టణం:** గత నెల 29, 30 తేదీల్లో బెల్లంపల్లి తిలక్ మైదానంలో నిర్వహించిన మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సెయింట్ మేరిస్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందని ముగ్గురు ఉపాధ్యాయులు సత్తాచాటారు. పీఈటీ అనిల్‌కుమార్ 400, 100మీటర్లలో బంగారు పతకాలు, హామర్ త్రోలో కాంస్య పతకం సాధించాడు. 4,100 విభాగంలో ఎండీ.సుల్తానా బంగారు పతకం, 400 మీటర్ల విభాగంలో, లాంగ్‌జంప్‌లో బంగారు పతకాలను సాధించారు. 4,100 విభాగంలో కె.శ్రీలత బంగారు పతకం, జావెలన్‌లో వెండి పతకం, హామర్ త్రో, డిస్కస్ త్రోలో కాంస్య పతకాలను దక్కించుకుంది. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు థామస్ చిరాయిల్ అభినందించారు.

### నిన్నటి కూరగాయల ధరలు

**కిలో రూపాయల్లో:** టమాట 10, వంకాయలు 30, బెండకాయలు 30, బీరకాయలు 40, క్యాబేజీ 30, అలసంద 30, దొండకాయ 40, చిక్కుడు కాయ 60, కాకరకాయ 40, పచ్చిమిరపకాయలు 40, కాలిఫ్లవర్ 40, బంగాళదుంప 20, గోరు చిక్కుడు 30.

# బెల్లంపల్లి



## ఆదివాసీల గ్రామ కమిటీ ఎన్నిక

**బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** బెల్లంపల్లి మండలం తాళ్లగురిజాల గ్రామంలో మంగళవారం ఆదివాసీల గ్రామకమిటీని ఎన్నుకున్నట్లు గౌరవ అధ్యక్షుడు మారాలు తెలిపారు. గ్రామ అధ్యక్షుడిగా కొదిని రవి, ఉపాధ్యక్షుడిగా కృష్ణం రాజు, భీమేష్, సంతోష్, రాజమణి, మహేష్, నాయిని విజయ, తదితరులను గ్రామ కమిటీలో నియమించినట్లు తెలిపారు.



అల్పాహారం అందచేస్తున్న జనహిత సేవాసమితి సభ్యులు

## అనాథ పిల్లలకు అల్పాహారం పంపిణీ

**బెల్లంపల్లి పట్టణం:** జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో కాల్‌టెక్స్ అమ్మ అనాథ శరణాలయంలో పిల్లలకు అల్పాహారం అందజేశారు. జనహిత సేవా సమితి సభ్యులు గోలివాడ హేతల్, నరేష్‌కుమార్‌ల పెళ్లిరోజు సందర్భంగా అనాథ పిల్లలకు అల్పాహారం, పాలు పంపిణీ చేశారు. బూడిదగడ్డబస్తీకి చెందిన భవాని అనే దివ్యాంగురాలుకు దుస్తులు అందజేశారు. జనహిత సేవ సమితి జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జలపతి, కార్యదర్శి కార్యదర్శి ఇప్ప రవి, సభ్యులు గుమ్మల చందు, జాబిలిరాం, భాస్కర్, సంపత్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు జైలు

**బెల్లంపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే:** తాండూర్ మండలంలోని ప్రధాన రహదారిపై నిర్వహించిన వాహన తనిఖీల్లో తాగివాహనం నడిపి పట్టుబడిన వ్యక్తులకు నాలుగు రోజులు జైలుశిక్షను బెల్లంపల్లి న్యాయమూర్తి విధించినట్లు తాండూర్ ఎస్సై రవి తెలిపారు. ఆదివారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అతిగా మద్యం సేవించి లారీలు నడిపిన ఇద్దరిని పట్టుకున్నట్లు తెలిపారు. తాండూర్ మండలం పోచంపల్లికి చెందిన రాజయ్య, మహారాష్ట్రకు చెందిన అతుల్‌కు శిక్షను ఖరారు చేసినట్లు వివరించారు.

## 7న లయన్స్ జిల్లా గవర్నర్ రాక

**బెల్లంపల్లి, న్యూస్‌టుడే:** లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఎ.ప్రమోద్‌కుమార్‌రెడ్డి ఈనెల 7న అధికారిక పర్యటన కోసం బెల్లంపల్లికి వస్తున్నట్లు అధ్యక్షుడు డి.కె.రాజలింగం, కార్యదర్శి పి.రాజన్న తెలిపారు. ఈ రోజు సాయంత్రం 6 గంటలకు బెల్లంపల్లిలోని పద్మశాలీ భవన్‌లో జరిగే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు.

## పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

**కాసిపేట గ్రామీణం:** పీఆర్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడిగా కాసిపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సాంబారి శ్రీనివాస్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షులు ఇన్నారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డికి, మండల కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధాన దారి విస్తరణకు శ్రీకారం

**బెల్లంపల్లి, న్యూస్‌టుడే:** బెల్లంపల్లి పట్టణంలోని చౌడేశ్వరి కూడలి నుంచి ప్రధాన రహదారిని వెడల్పు చేయడానికి పురపాలక సంఘం అధికారులు శ్రీకారం చుట్టారు. బాలికల గురుకుల పాఠశాల దగ్గర ప్రయాణ ప్రాంగణం నిర్మాణం చేసినా అక్కడకు బస్సులు వెళ్లి నిలపడానికి అవకాశం లేకుండాపోయింది. దీంతో దారి పక్కను ఉన్న పెద్ద వృక్షాలను పొక్లెయిన్‌తో తొలగించారు. టీపీఎస్ సంపత్, ఎస్.ఐ.రాజ్‌కుమార్ సిబ్బంది ఈ పనులు పర్యవేక్షించారు.

## అబ్కారీ దాడుల్లో నిందితుల అరెస్టు

**బెల్లంపల్లి:** బెల్లంపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ దాడుల్లో పలువురు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ దీపక్ తెలిపారు. పరారీలో ఉన్న చామన్‌పల్లికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 10 లీటర్ల నాటుసారా, ఒక హీరోహోండా ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిలో బుక్యా సంపత్, బుక్యా నారాయణ, మలోత కుమార్ ఉన్నారన్నారు. ముగ్గురు నిందితులను అబ్కారీ ప్రత్యేక కోర్టులో హాజరు పర్చినట్లు తెలిపారు. కన్నెపల్లి, తాండూరు మండలం కిష్టాపూర్, తంగళ్లపల్లి గ్రామాలకు చెందిన నాటుసారా అనుమానితులను గుర్తించి ఐదుగురిని అరెస్టు చేసి తహసీల్దార్ రామచంద్రయ్య ముందు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. వీరిలో ఎం.సూరక్క, ఎం. సాగర్, ఎం. శంకర్, డి.లింగయ్య ఉన్నారన్నారు. నిందితులను ఒక్కొక్కరికి రూ. లక్ష పూచీకత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు టి.నర్సింహాచారి, బి.ప్రభాకర్, సిబ్బంది రాజేంద్రప్రసాద్, సతీష్, మహేష్, దిలీప్, శిరీష పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

**కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే:** గ్రామాల అభివృద్ధితోనే బంగారు తెలంగాణ సాధ్యమని ప్రభుత్వం ఆ దిశగా కార్యక్రమాలు చేపడుతుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఎమ్మెల్యే దత్తత గ్రామం మల్కపల్లిలో గ్రామ కమాన్(ముఖద్వారం)ను, రూ. 5లక్షల నిధులతో సీసీ రహదారి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో రహదారులు, ఆలయ నిర్మాణం, క్రీడాకారులకు మైదానం, చెరువులకు కాలువలు, కమ్యూనిటీహాల్ తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మల్కపల్లి గ్రామంలో సీసీ రహదారి నిర్మాణం కోసం రూ. 40 లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో ప్రతి సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గత ప్రభుత్వాలు గ్రామాలను పట్టించుకోలేదని, తెలంగాణ ప్రభుత్వం హయంలోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు పింఛన్లు పెంచిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను మల్కపల్లి గ్రామంలోని యువకులు సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ శివీవేరు నర్సింగం, సహకారసంఘం అధ్యక్షులు వంశీధర్‌రావు, జడ్పీటీసీ రౌతుసత్తయ్య, తెరాస మండల అధ్యక్షులు రమణారెడ్డి, సర్పంచి మడావి ప్రభాత్‌రావు, ఎంపీటీసీ మంజుల రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ హై, మల్కపల్లి యూత్ అధ్యక్షులు రమేష్, రాజు, దిలీప్, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యువకులు

**బెల్లంపల్లి గ్రామీణం:** ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలును పటిష్ఠంగా చేస్తున్నట్లు, అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మంగళవారం బెల్లంపల్లి మండలం చిన్నబూద గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మిషన్ కాకతీయతో చెరువులకు మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. మూడో విడతలో మంజూరైన చెరువుల్లో పనులు ఆలస్యంగా ప్రారంభించినట్లు తెలిపారు. రైతులకు సాగునీరుతో పాటు భూగర్భజలాల పెంపునకు పూడికతీత పనులు దోహదం చేస్తాయన్నారు. అంతేకాకుండా రైతులకు పంటలసాగుకు నిరంతర విద్యుత్తు సరఫరా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. వీటితో పాటు మిషన్ భగీరథతో ఇంటింటికి శుద్ధ జలం అందించడానికి చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని అక్కాచెల్లెళ్ల చెరువు మరమ్మతులకు భూమిపూజ చేశారు. చెరువు మరమ్మత్తులకు రూ. 32లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింగం, ఎంపీపీ సుభాష్‌రావు, సర్పంచి కృష్ణమూర్తి, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలుంటే చెప్పండి.. క్షణాల్లో మీముందుంటాం..

- ఏసీపీ బాలు జాదవ్
- దుగ్గల్ హామీ మేరకు అనుసంధాన రోడ్డు పనులు ప్రారంభం

**తాండూరు, న్యూస్‌టుడే:** గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే పోలీసులకు చెబితే క్షణాల్లో గ్రామాల్లో ఉంటామని బెల్లంపల్లి ఏసీపీ బాలు జాదవ్ అన్నారు. తాండూరు మండలం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని అబ్బాపూర్, బెజ్జాల, బీర్సాయిగూడ గ్రామాల్లో నిర్వహించిన జనమైత్రి గ్రామ సభలకు ఆయన హాజరైనారు. ఇటీవల ఈగ్రామాల్లో రామగుండం పోలీస్ కమీషనర్ విక్రం జీత్ దుగ్గల్ ఈగ్రామాల్లో పర్యటించిన సమయంలో ఇక్కడి ప్రజలు మెరుగైన రోడ్డు సౌకర్యం కోసం విన్నవించారు. అత్యవసర పరిస్థితుల్లోనూ వాహనాలు రావడం లేదని వారు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈమేరకు స్పందించిన ఆయన అబ్బాపూర్ నుంచి బెజ్జాల, బీర్సాయిగూడెం గ్రామాలకు అంతర్గత రోడ్డు చేపట్టే విధంగా చర్యలు తీసుకున్నారు. సింగరేణి సహకారంతో ఈరోడ్డు పనులను మంగళవారం ఏసీపీ, సింగరేణి అధికారులు కలిసి ప్రారంభించారు. అబ్బాపూర్ నుంచి బీర్సాయిగూడెం వరకు నాలుగు కిలోమీటర్ల రెండు వరుసల మట్టి రహదారిని ఇక్కడ చేపడుతున్నారు. ఈ సందర్భంగా బెజ్జాలలో నిర్వహించిన గ్రామసభలో ఏసీపీ మాట్లాడారు. గిరిజనులు సమస్యలు, మౌలిక సదుపాయాల ఇబ్బందులుంటే పోలీసులకు చెప్పుకోవాలన్నారు. ఈసందర్భంగా వారు కొన్ని ప్రధాన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పోడు భూములకు పట్టాలు, పింఛన్లు, తాగునీటి సౌకర్యాలు, ఉపాధి కార్యక్రమాలు కావాలని వారు విన్నవించారు. అయితే గిరిజన యువత కోసం వెంటనే మోటారు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. అర్హులైన వారికి పింఛన్లు ఇప్పించే విధంగా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడతామన్నారు. అయితే పోడు భూముల సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు తదుపరి చర్యలుంటాయని తెలిపారు. సింగరేణి సంస్థ ద్వారా గ్రామాల్లో అత్యవసర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయిస్తామని ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో తాండూరు సీఐ జనార్దన్‌రెడ్డి, బీపీఏ ఓసీ2 గని ప్రాజెక్టు అధికారి చింతల శ్రీనివాస్, మేనేజరు రమేష్, మాదారం, తాండూరు ఎస్సైలు రాములు, రవి, రామగుండం ఎస్‌బీ ఎస్సై ఆంజనేయులు, తహసీల్దారు రామచంద్రయ్య, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




రోడ్డు పనులు ప్రారంభిస్తున్న అధికారులు



బెజ్జాలలో మాట్లాడుతున్న ఏసీపీ బాలు జాదవ్

## జిల్లా కార్యదర్శి రాజేష్‌కు సన్మానం

**బెల్లంపల్లి, న్యూస్‌టుడే:** జనగాం జిల్లాలో ఫోటోగ్రాఫర్ల సంఘం ప్రమాణస్వీకారోత్సవంలో అతిథిగా పాల్గొన్న మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజేష్‌ను అక్కడి నాయకులు శాలువాతో సన్మానించారు. జనగాం జిల్లా అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్, ఇతర ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఫోటోగ్రాఫర్ల సమస్యల కోసం అందరం పాటుపడాలని రాజేష్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్‌గౌడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు వి.నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.



రాజేష్‌ను సన్మానిస్తున్న నాయప్రతినిధులు

## జాతీయ స్థాయి పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుడి ఎంపిక

**నెన్నెల, న్యూస్‌టుడే:** నెన్నెల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సిరంగి గోపాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి శ్రీధర్ స్వామి తెలిపారు. గత నెల 29, 30 తేదీలలో బెల్లంపల్లిలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈయన పాల్గొన్నారు. అథ్లెటిక్స్, లాంగ్‌జంప్‌, డిస్కస్‌త్రో, షాట్‌పుట్ నాలుగు విభాగాల్లో పాల్గొని పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందడంతో బెంగళూర్‌లో ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు నిర్వహించే పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టు తరపున ఆడనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఉపాధ్యాయుడు గోపాల్

## టీయూటీఎఫ్ కాలసూచీ ఆవిష్కరణ

**కాసిపేట గ్రామీణం:** టీయూటీఎఫ్ కాలసూచీని మంగళవారం మండలంలోని మల్కపల్లిలో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి ప్రేంరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ నర్సింగం, సహకారసంఘం అధ్యక్షులు వంశీధర్‌రావు, జడ్పీటీసీ సభ్యుడు సత్తయ్య, రమణారెడ్డి తదితరులున్నారు.

**నెన్నెల:** తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) 2018 కాలసూచీని మండల విద్యావనరుల కార్యాలయంలో విడుదల చేశారు. శాఖ అధ్యక్షులు పద్మారావు, మండల విద్యాధికారి శ్రీధర్ స్వామి, మైలారం జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగయ్య పాల్గొన్నారు.



టీయూటీఎఫ్ కాలసూచీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

# చెన్నూరు

## కూరగాయల ధరలు

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** నిన్నటి ధరలు:, కిలో రూపాయల్లో: టమాట 10, వంకాయ 30, మిర్చి 30, బెండకాయ 50, అల్చింత 30, దొండ 30, క్యాబేజీ 40, కాలిఫ్లవర్ 50, కాకర 40, బోడ కాకర 150, క్యారెట్ 70, బీర 80, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, సొరకాయ 15, పాలకూర 20, తోటకూర 20, చుక్కకూర 30, కొతిమీర్ 30, ఆలు 12, ఉల్లిగడ్డ 35.

## నేడు సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు

**చెన్నూరు, న్యూస్‌టుడే:** చెన్నూరులోని ఎమ్మార్సీ కార్యాలయంలో డీటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 3 గంటలకు సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తి సంతోష్, పొలాస సత్యనారాయణలు తెలిపారు. కార్యక్రమానికి మహిళలు, ఉపాధ్యాయులు, ప్రజా సంఘాల నాయకులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# 'నవోదయ' చిన్నారుల జీవితాల్లో శుభోదయం

- పోటీ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఫిబ్రవరి 10న పరీక్ష

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:
గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం నవోదయ విద్యాలయాలను నిర్వహిస్తోంది. వీటిల్లో ప్రవేశానికి ఒక్కో సీటుకు వంద మందికి పైగా పోటీ పడుతున్నారు.. ప్రవేశ పరీక్షలో విజయం సాధించేందుకు చిన్నారులు ప్రత్యేక శిక్షణ సైతం పొందుతున్నారు. గత నాలుగు నెలలుగా ప్రణాళికబద్ధంగా చదువుతున్నారు. ఓవైపు తమ చదువులను కొనసాగిస్తూనే మరోవైపు పోటీపరీక్షకు సంసిద్ధులవుతున్నారు. కఠినతరమైన సబ్జెక్టులపై పట్టు సాధించి నవోదయలో సీటు పొందే లక్ష్యంతో పరీక్ష సన్నద్ధమవుతున్నారు. చెన్నూరు నియోజకవర్గం నుంచి వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1010 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో పలువురు విద్యార్థులు నవోదయలో సీటు పొందేందుకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ఫిబ్రవరి 10న నవోదయ ప్రవేశపరీక్ష రాసే వివిధ పాఠశాలలకు చెందిన ఐదోతరగతి విద్యార్థుల మనోగతం..



నవోదయ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ పొందుతున్న విద్యార్థులు

### కఠినమైన సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ

**- గెల్లు రాజ్‌కుమార్, రచ్చపల్లి గ్రామం, న్యూలయోల పాఠశాల-చెన్నూరు**



నవోదయ పాఠశాలలో సీటు పొందేందుకు కోసం కఠినమైన సబ్జెక్టులపై శ్రద్ధ వహిస్తున్నాను. ఇందుకోసం ప్రత్యేక శిక్షణ తీసుకొంటున్నాను. ప్రధానంగా గణితం, మనోసామర్థ్యం విషయాలపై ఉపాధ్యాయులు సూచించిన విధంగా దృష్టి కేంద్రీకరించాను. నవోదయలో సీటు సాధిస్తాననే నమ్మకం ఏర్పడింది.

### నాలుగుగంటలు కేటాయిస్తున్నా

*- బానోతు కళ్యాణి, కృష్ణవేణి టాలెంట్ స్కూల్-చెన్నూరు*



నవోదయలో సీటు పొందేందుకు ప్రతిరోజు నాలుగు గంటల సమయం కేటాయిస్తున్నాను. ఆంగ్ల భాషలో చదువుతున్న నాకు గత పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల ఆధారంగా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. సీటు పొందాలనే దృఢ సంకల్పంతో పరీక్షకు సిద్ధమవుతున్నాను. పరీక్షలో ఎక్కువ మార్కులుండే మనోసామర్థ్యంపైనే ఉపాధ్యాయులు దృష్టిసారించి అందులోని అంశాలను ఎక్కువగా బోధిస్తున్నారు..

### పేద విద్యార్థులకు వరం

*-పెండ్యాల కార్తికేయ, యూపీఎస్(టీ)-చెన్నూరు*



మాది పేద కుటుంబం. నవోదయలో సీటు పొందితే ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఉచితంగా విద్య, వసతి అందుతుంది. మాలాంటి పేద విద్యార్థులకు నవోదయ ఓవరం లాంటిదే. కచ్చితంగా సీటు సాధించేందుకు ప్రణాళికతో చదువుతున్నాను.. ప్రాథమిక స్థాయిలో పోటీ పరీక్షలు రాయడం ద్వారా భవిష్యత్తులో పోటీ పరీక్షలు రాయడం సులభతరం అవుతుంది.

### ఉన్నతమైన స్థానం కోసమే

*-హేమచంద్ర, చిన్నమున్షి పాఠశాల-చెన్నూరు*



భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయి. నవోదయ పాఠశాలలో ప్రవేశం పొందే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుసుకొని ప్రవేశ పరీక్ష రాసేందుకు శిక్షణ పొందుతున్నాను. పరీక్షలో విజయం సాధించేందుకు సరైన ప్రణాళికతో కష్టపడి చదువుతున్నా.. మూడు నెలలుగా శిక్షణ తీసుకుంటున్నాను.

### సీటు సాధించాలనే లక్ష్యంతో

*-సిరంగి వైష్ణవి, న్యూస్లేట్ పాఠశాల-చెన్నూరు*



నవోదయ పాఠశాలలో సీటు సాంధించాలనే లక్ష్యంతో చదువుతున్నాను. రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటల ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాను. మాకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. వారానికోసారి మాదిరి పరీక్షలను నిర్వహిస్తున్నారు. నవోదయలో సీటు పొందాలనే లక్ష్యంతో కష్టపడి చదువుతున్నాను.

### ఉన్నత చదువుల కోసం

*-కొండపర్తి కార్తీక్, న్యూస్లేట్ పాఠశాల-చెన్నూరు*



పోటీయుగంలో ఇప్పటి నుంచే పోటీ పరీక్షలు రాయడం మంచిది. దీంతో భవిష్యత్తులో పోటీ పరీక్షలు రాయడం చాలా సులభతరం అవుతుంది. నవోదయలో సీటు పొందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవి మంచిస్థానంలో ఉండేందుకు తోడ్పడుతుందని ఉపాధ్యాయులు చెప్పడంతో ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతున్నాను.

## తెరపై ఈనాడు

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** మంచిర్యాలలో... శ్రీనివాస- ఎంసీఏ, వెంకటేశ్వర- హాలో, సీసీసీలో దేవి తిరుమల స్క్రీన్-1లో- ఎంసీఏ, స్క్రీన్-2లో హాలో. లక్ష్మీ కాంప్లెక్స్: ఆక్సిజన్.



ప్రమాదకరంగా సుద్దాల మూలమలుపు

## ప్రమాదకరంగా సుద్దాల మూలమలుపు

దర్పణం

మండలంలోని కిష్టంపేట నుంచి సుద్దాల గ్రామానికి వెళ్లేదారిలో ఉన్న మూలమలుపు ప్రమాదభరితంగా ఉంది. రోడ్డుకు ఇరువైపుల చెట్లపొదలు ఏపుగా పెరగడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.. రాత్రివేళల్లో అయితే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెట్లపొదలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం**

# మహాసభలను విజయవంతం చేయండి

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** ఈ నెల 6,7 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య పార్కులో పురపాలిక కార్మికులు, ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించే 2వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలంటూ సంఘం జిల్లా కార్యదర్శి కాసర్ల రాజలింగు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం మందమర్రి పురపాలిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గోడప్రతులను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఈ సభ ద్వారా తీసుకువెళ్తామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సంఘం ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమాలకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యాకుబ్, లక్ష్మీ, వెంకమ్మ, సారయ్య, రాజలింగు తదితరులు పాల్గొన్నారు



మందమర్రిలో గోడప్రతులు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

# నాగేశ్వర్‌రావుకు సన్మానం

**చెన్నూరు, న్యూస్‌టుడే:** ప్రముఖ సాహితీవేత్త, సంగీత విద్వాంసుడు చెన్నూరు పట్టణానికి చెందిన జక్కెపల్లి నాగేశ్వర్‌రావును మంగళవారం స్థానిక శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన తెలుగు మహాసభల్లో తన గళాన్ని వినిపించి చెన్నూరు పేరుప్రఖ్యాతులను చాటిచెప్పిన ఆయనకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. తెలుగుభాష అన్ని భాషలకంటే గొప్పదని పరభాషా మోజులో పడి దీన్ని మర్చిపోకూడదన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు శిశుమందిరాలు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుతం శిశుమందిరాల్లో చదివిన విద్యార్థులు మాత్రమే క్రమశిక్షణతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు అలవర్చుకుంటూ ఉన్నతులుగా రాణించగలుగుతున్నారన్నారు. ఇతర పాఠశాలల్లో సైతం తెలుగు వెలుగులు నింపేందుకు కృషి చేస్తే తెలుగు భాషను కాపాడుకున్న వారిమవుతామని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నాగేశ్వర్‌రావును సన్మానిస్తున్న చెన్నూరు శిశుమందిర్ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు

## వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

**గూడెం(దండేపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే:** దండేపల్లి మండలం గూడెం గ్రామానికి చెందిన దమ్మ రాజయ్య అనే వీఆర్‌ఏ మంగళవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందారు. తహసీల్దార్ దత్తుప్రసాదరావు, సిబ్బంది ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ గణపతి, వీఆర్వో రాజయ్య, వీఆర్‌ఏలు మన్నె ప్రవీణ్, కాసం శరత్‌కుమార్, బల్సు రాజు, సాగర్, రాజయ్య పాల్గొన్నారు.



చెన్నూరు గాంధీచౌక్ ప్రాంతంలో నడిరోడ్డుపై ఆటోలు నిలిచి ఉన్న దృశ్యం

## ఇష్టారీతిగా ఆటోల నిలుపుదలతో ఇబ్బందులు

**చెన్నూరు, న్యూస్‌టుడే:** పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో ఆటోలు ఎక్కడపడితే అక్కడ నిలుపుదల చేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆటో డ్రైవర్లు అతివేగంతో తమ ఆటోలను నడిపిస్తూ ఇష్టారీతిగా గాంధీచౌక్ వద్ద నిలుపుదల చేస్తున్నారు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నడిరోడ్డుపై ఆటోలను నిలుపుతుండటంతో ఆమార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈవిషయమై సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు ప్రారంభం

**చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే:** మండలంలోని దుగ్నెపల్లి జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్రీయ మాధ్యమిక సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కరాటే శిక్షణ ఎంతగానో ఉపకరిస్తుందని ప్రధానోపాధ్యాయులు కె.బానయ్య అన్నారు. మార్చివరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో శిక్షకుడు జె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెన్నూరు

## రక్తనిధి కేంద్రంలో నిల్వలు

**ఏసీసీ(మంచిర్యాల):** మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు మంగళవారం వరకు ఎ పాజిటివ్ 6, ఎ నెగటివ్ 2, బి పాజిటివ్ 43, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 1, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 22, ఒ నెగటివ్ 7 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. అవసరం ఉన్నవారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా.డి. విష్ణుమూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.



## సంక్షేమ పథకాలపై కేంద్ర బృందం సమీక్ష



చెన్నూరు మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశమైన కేంద్ర పరిశీలకుల బృంద సభ్యులు

**చెన్నూరు, న్యూస్‌టుడే:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాల అమలు తీరుపై మండలంలో సర్వే నిర్వహిస్తున్న కేంద్ర పరిశీలకుల బృందం సభ్యులు సంజయ్‌రావత్, సంజీవీ కలా, గజేందర్‌సింగ్‌లు మంగళవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ, హరితహారం, మిషన్ కాకతీయ, ఇందిరాక్రాంతి పథం, పింఛన్ల పంపిణీ తదితర అంశాలపై క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపిన బృంద సభ్యులు ఆయా శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై పూర్తి వివరాలను సేకరించారు. పథకాల అమలు తీరు, ఉద్దేశం తదితర వివరాలను అధికారులు వారికి వివరించారు. మండలంలో సంక్షేమ పథకాల అమలు తీరుపై ఈసందర్భంగా వారు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లేష్, చిన్ననీటిపారుదల శాఖ జేఈ దామోదర్, ఈజీఎస్ ఏపీఓ గంగాభవాని, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.




మందమర్రిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

## మందమర్రిలో 'స్వచ్ఛ సర్వేక్షణ్' ర్యాలీ

**మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:** మందమర్రి పురపాలిక అధికారుల ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు మంగళవారం 'స్వచ్ఛ సర్వేక్షణ్' అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ నిషేధించాలని, తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చెసి పురపాలిక వాహనాల్లో వేయాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించుకున్న వారు వాటిని వినియోగించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారిణి జ్యోతి

## గ్రామాల్లో వైద్యసేవలను కల్పించాలి

**జైపూర్, న్యూస్‌టుడే:** ఆరోగ్య కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్యసేవలు, పరిసరాల పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని జిల్లా ఉపవైద్యాధికారిణి జ్యోతి అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ...ప్రభుత్వం గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, పౌష్టికాహారం, కేసీఆర్ కిట్ వంటి పథకాలను ప్రవేశపెడుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విష జర్వాలు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో శ్రీనివాస్, ఏఎన్ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## దాతల సేవలు అభినందనీయం

**కోటపల్లి, న్యూస్‌టుడే:** విద్యార్థుల సంక్షేమం కోసం దాతలు అందించే సహకారం అభినందనీయమని ఎస్సై వెంకన్న అన్నారు. చెన్నూరు పట్టణానికి చెందిన ఓం ప్రకాష్‌గిల్డా తన తండ్రి బన్సీలాల్ స్మారకార్థం మంగళవారం కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు దుప్పట్లు అందించేందుకు ముందుకు వచ్చారు. ఎస్సై చేతులమీదుగా విద్యార్థినులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో పోలీసుల సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. తన కుటుంబసభ్యుల పేరిట వంద దుప్పట్లను పంపిణీ చేసిన దాత ఓం ప్రకాష్ గిల్డా, సవితాగిల్డా దంపతులను ఎస్సై అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్త దుర్గ శంకర్‌సోమాని, నాయకులు నీల మనోహర్ తదితరులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీచేస్తున్న ఎస్సై, దాత

## పీఆర్టీయూ కాలసూచీ ఆవిష్కరణ

**చెన్నూరు, న్యూస్‌టుడే:** చెన్నూరు మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం పీఆర్టీయూ నాయకులు సంఘం 2018 సంవత్సరం కాలసూచీని ఆవిష్కరించారు. కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి గోలి మనోహర్, ఎంఈఓ రాధాకృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా హాజరై చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి మండలాల సంఘ నాయకులతో కలిసి కాలసూచీని ఆవిష్కరించారు. అనంతరం నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ..ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్టీయూ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు మైదం రవి, దుద్దిళ్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు కొట్టె శంకర్, నాయకులు హస్మత్ అలీ, పుట్ట శ్రీనివాస్, జోడు మధు, తోకల శ్రీధర్, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుపతయ్య, రషీద్, అంజన్‌కుమార్, కుమార్, వరప్రసాద్, భూమేష్, సంఘం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోటపల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

## మధ్యాహ్నభోజనాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

**కోటపల్లి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించాలని మండల విద్యాధికారి బెజ్జంకి జగన్ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల పరిశీలనలో భాగంగా మంగళవారం కోటపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు మండల పరిధిలోని బావన్‌పల్లి, షెట్‌పల్లి, మల్లంపేట్ తదితర పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పట్టిక ప్రకారం భోజనం అమలుచేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని గుర్తు చేశారు. అనంతరం పాఠశాలల్లో అమలవుతున్న వివిధ విద్యా కార్యక్రమాలను సమీక్షించారు.

## ఉపాధి కల్పించేలా కృషి చేస్తాం

**భీమారం:** నాటు సారా తయారీ మానేసిన వారు మళ్లీ ఆ వృత్తిలోకి వెళ్లకుండా ప్రభుత్వం కల్పించిన ఉపాధి మార్గాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రాజిరెడ్డి అన్నారు. మంగళవారం బూరుగుపల్లిలో నిర్వహించిన జనమైత్రి సమావేశంలో గ్రామస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం తరపున 12 మందికి మాత్రమే సహాయం అందిందని, మిగతా వారికి రాలేదని, లంబాడితండా నుంచి కోయగూడెం వరకు రహదారి సరిగా లేదని, పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకులంగా స్పందించిన ఆయన మిగతా వారికి ప్రభుత్వ సహాయం అందేలా ఉన్నతాధికారుతో మాట్లాడుతానని, ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగు పరుస్తానని తెలిపారు. జనమైత్రి అధికారి సంపత్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

### టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేంరావు



కాల సూచికను విడుదల చేస్తున్న టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేంరావు

**జైపూర్, న్యూస్‌టుడే:** త్వరలోనే కొత్త సర్వీస్ నిబంధనలతో కూడిన పదోన్నతులు రాబోతున్నాయని, రానున్న రోజుల్లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రేంరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మానవ వనరుల కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, నూతన పీఆర్సీ అమలయ్యేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం 2018 టీయూటీఎఫ్ కాల సూచికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న రవిందర్, జిల్లా కార్యదర్శులు దుర్గయ్య, సుదర్శన్, శంకర్, నాయకులు బానయ్య, లక్ష్మినారాయణ, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.



సుందర్‌శాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో పడుకున్న శునకాలు

## రక్షణగోడ లేని పాఠశాల

క్లిక్... క్లిక్

మండలంలోని సుందర్‌శాల ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. శునకాలు పాఠశాల ఆవరణలోనే తిరుగుతుండటంతో భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

**- న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం**

## రాజకీయంగా వెనుకబడిన నేతకానీలు

**భీమారం, న్యూస్‌టుడే:** నేతకానీలు ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడే ఉన్నారని వారిని చైతన్య పరుస్తూ, హక్కుల కోసం పోరాడతామని నేతకాని(చైతన్య) రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం అశోక్ అన్నారు.. మంగళవారం కొత్తపల్లి యువత గ్రామ కమిటీ నియామకం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఆకుదారి యాదగిరి, ఉపాధ్యక్షుడిగా సాగర్ దుర్గం ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా సెగ్యం సందీప్, కోశాధికారిగా ఆకుదారి ప్రవిణ్, కార్యదర్శిగా కావేరి ఆనంద్, సలహాదారుగా ఆకుదారి సంజీవ్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్కే, నాయకులు శ్రీరాములు, తిరుపతి, శంకర్, శ్రీనివాస్, రాజబాపు, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం ఇస్తున్న నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్



పంచాయతీ కార్యాలయం ముందు నిలిచిన మురుగునీరు

## ఇళ్ల ముందే మురుగునీరు

**కోటపల్లి, న్యూస్‌టుడే:** కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామంలోని పలుకాలనీల్లో మురుగుకాల్వల సౌకర్యం లేకపోవడంతో మురుగునీరు ఇళ్లముందే నిలుస్తోంది. వరదనీటితో పాటు ఇళ్లలోని వాడకం నీరు తోడవుతుండటంతో వర్షాకాలం ఇళ్లలోకి చేరుతుందని గ్రామస్థులు వాపోతున్నారు. మిగతా కాలాల్లో సైతం సక్రమంగా ముందుకుపోయే వెసులుబాటు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ నిలిచి దోమలకు ఆవాసంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు మురుగుకాల్వల నిర్మాణానికి చొరవచూపాలని స్థానికులు కోరుతున్నారు.